
అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 16-9-2023

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 9 సంచిక : 257 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు వెల : 6.50

ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు అందించేందుకు వారి దశను మార్చేందుకు

ప్రపంచపు అతి భారీ మోటార్లుతో, దానిని మించిన వజ్రసంకల్పంతో సాధ్యపడిన

పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్



భారతదేశంలో త్రాగునీరు, సాగునీరు కోసం దశాబ్దాలుగా పరితపిస్తున్న ప్రాంతాల్లో మరో మార్గంలేక ప్రజలు నిరంతరం ఇతర ప్రాంతాలకు వలసపోయేవారు. **తెలంగాణ ఆవిర్భావంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయినవి.**

గౌరవనీయ తెలంగాణ ముఖ్యమంత్రి, **శ్రీ కె. చంద్రశేఖర్ రావు** గారి అపూర్వ నాయకత్వాన భీమ, కల్వకుర్తి, కోయిల్సాగర్ లాంటి అనేక సాగునీటి ప్రాజెక్టులు ప్రారంభించబడినవి. క్రమేణా ప్రజల వలసలు ఆగినవి.


ఈ సమయంలో తెలంగాణ యవనికపై ఒక అద్భుత ఘట్టానికి తెరతీయబడింది. తరతరాలుగా నిరాదరణకు గురై, తడారిన గొంతులతో, నెర్రులిచ్చిన భూములతో కళావిహీనంగా మారిన ప్రాంతాల్లో **శ్రీశైలం నుండి కృష్ణా జలాలను ఎత్తిపోసి,** జలసిరి అందించేందుకు, తెలంగాణ ప్రజల భవిష్యత్తును సమూలంగా మార్చేసేందుకు 50,000 కోట్ల రూపాయల వ్యయంతో ప్రతిష్టాత్మకమైన **పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్** ఆవిష్కరించబడింది.

మొదటి దశ

70 మండలాల్లోని 1226 గ్రామాలకు తాగునీటి సౌకర్యం

రెండవ దశ

6 జిల్లాల్లోని 19 నియోజకవర్గాలలో 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు



ప్రాజెక్ట్ విశిష్టతలు


- 5 లిఫ్ట్ దశలు
- 6 రిజర్వాయర్లు
- 672 మీటర్ల ఎత్తుగల లిఫ్ట్
- 61.57 కి.మీ. పొడవు సొరంగం
- 915.47 కి.మీ. ప్రాథమిక కాలువ
- ఒక్కొక్కటి 145 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 31 బాహుబలి పంపులు మరియు ఒక్కొక్కటి 75 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 3 పంపులు

జల వనరులు

- రోజుకు 1.5 TMC నీరు లిఫ్ట్ చేయబడుతుంది
- 67.52 TMC నిలవ సామర్థ్యాన్ని కలిగివుంది
- పరిశ్రమల వినియోగానికి 0.33 టీఎంసీలు

లబ్ధిపొందే ప్రాంతాలు

- 1226 గ్రామాలు తాగునీరు పొందుతాయి
- 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు
- నాగర్ కర్నూలు, మహబూబ్‌నగర్, నారాయణ్‌పేట్, రంగారెడ్డి, వికారాబాద్ మరియు నల్గొండ జిల్లాలకు సాగునీరు అందుతుంది.
- తాగునీరు: జంట నగరాలకు కలిపి 7.15 టీఎంసీలు



ఈ సంబరానికి కేంద్ర బిందువు నీరే
ఈ మహోత్సవం జరిగేది నేడే

నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
తెలంగాణ ప్రభుత్వం.

అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శనివారం 16-9-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 257
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
16 పేజీలు వెల : 6.50

మణిపూర్ హింసాకాండలో 175 మంది మృతి : పోలీసుల నివేదిక
మార్చురీలో 96 మృతదేహాలు



ఇంఫాల్ : మణిపూర్ హింసాకాండలో ఇప్పటివరకూ 175 మంది మరణించగా, 1,108 మంది గాయపడినట్టు పోలీసులు తెలిపారు. సుమారు 33 మంది అదృశ్యమైనట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో హింసాత్మక ఘటనలపై కొన్ని కీలక గణాంకాలను పోలీసులు విడుదల చేశారు. 175 ...15లో

వైద్యరంగంలో దేశానికే ఆదర్శం
9 మెడికల్ కాలేజీలను ప్రారంభించిన సీఎం
ఏటా 10 వేల మంది వైద్యుల తయారీ : సీఎం కేసీఆర్



ప్రజారోగ్యాన్ని పరిరక్షిస్తూ వైద్యాన్ని పేదలకు అతి చేరువలోకి తెస్తూ, తెలంగాణ రాష్ట్రం ప్రతి యేటా పదివేల మంది వైద్యులను తయారుచేసే స్థాయికి చేరుకుని భారత దేశ వైద్య రంగ చరిత్రలోనే విప్లవాన్ని సృష్టిస్తున్నదనీ, దేశానికే ఆదర్శంగా రాష్ట్ర వైద్యరంగం పురోగమించడం తెలంగాణకు గర్వ కారణమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు తెలిపారు.

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం కేసీఆర్ చేతుల మీదుగా తొమ్మిది మెడికల్ కాలేజీలు ప్రగతి భవన్ నుంచి వర్చువల్ పద్ధతిలో శుక్రవారం ప్రారంభించారు. కరీంనగర్, కామారెడ్డి, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, కుమరంభీం ఆసిఫాబాద్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, జనగాం జిల్లాల్లో ఈ తొమ్మిది మెడికల్ కాలేజీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ గతంలో ఐదు కాలేజీలుంటే.. ఇప్పుడు 26 మెడికల్ కాలేజీలకు చేరుకున్నామని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మొత్తం 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉండేటట్టుగా రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించిందని గుర్తు చేశారు.

2014లో 2,850 ఎంబీబీఎస్ సీట్లుండగా నేడు అది 8,515 సీట్లకు పెరిగాయని తెలిపారు. నీట్‌కు పోను 85 శాతం సీట్లు తెలంగాణ బిడ్డలకు దక్కాలని విడుదల చేసిన జీవోపై వివాదం చెలరేగినా మంత్రి, వైద్యశాఖ సిబ్బంది పటిష్టమైన న్యాయపోరాటం చేసి హైకోర్టులో కూడా విజయం సాధించటాన్ని అభినందించారు. మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే, రోగ నిరోధక శక్తి కలిగి వుండాలంటే తెల్ల కణాలు రక్తంలో ఏ విధంగా పనిచేస్తయో , తెలంగాణ ఉత్పత్తి చేసే తెల్లకోటు డాక్టర్లు ...15లో

పార్లమెంటులో మహిళా, బీసీ బిల్లులు పెట్టాలి
= మోడీకి కేసీఆర్ లేఖ = బీఆర్ఎస్ పార్లమెంటరీపార్టీ సమావేశంలో నిర్ణయం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

చట్ట సభల్లో 33 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు, 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుల్ని పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం డిమాండ్ చేసింది. దీనిపై ప్రధాని నరేంద్రమోడీకి సీఎం కే చంద్రశేఖరరావు ...15లో




వీరతెలంగాణ సాయుధ పోరాటం అజరామరం
చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ
= సీట్లు, పొత్తుల కోసం కమ్యూనిస్టు పార్టీ పనిచేయదు
= బీజేపీ వ్యతిరేక శక్తులతో కలిసి నడుస్తాం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చారిత్రాత్మకం. అది ప్రజాపోరాటాలకు నిరంతర స్ఫూర్తి. ఈ దేశ భవిష్యత్తుకు మార్గదర్శి. అలాంటి పోరాటాన్ని బీజేపీ వక్రీకరిస్తున్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. జిల్లా కేంద్రమైన సిద్దిపేట పట్టణంలోని శివమ్స్ గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు తెలంగాణ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణలో రైతాంగ సాయుధ పోరాటంలో మొట్టమొదటి అమరుడు దొడ్డి కొమరయ్య అని తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని పీడిత ప్రజల పోరాటాలను హిందు ముస్లిమ్‌ల మధ్య పోరాటంగా బీజేపీ నాయకులు చెప్పడం సిగ్గుచేటన్నారు. ముస్లిం మైనార్టీలను అణగదొక్కడమే బీజేపీ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. మునుగోడు ఎన్నికల్లో బీజేపీని ఓడగొట్టడం కోసమే బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకున్నామని, కమ్యూనిస్టులతోనే అక్కడ బీజేపీ ఓడిపోయిందని తెలిపారు. తెలంగాణలో బీజేపీని అడ్డుకోవడమే ...15లో

నేడు సీడబ్ల్యూసీ సమావేశం
18 ఏండ్ల తర్వాత హైదరాబాద్‌లో...



సీడబ్ల్యూసీ ఏర్పాట్లను సమీక్షిస్తున్న కెసి వేణుగోపాల్, రేవంత్‌రెడ్డి తదితరులు

= ప్రధాని అభ్యర్థిగా రాహూల్‌గాంధీ = ఇండియా కూటమికి ప్రతిపాదన?
= ఐదు రాష్ట్రాల ఎన్నికలు, జమిలి, పార్టీ బలోపేతంపై చర్చ
= విజయభేరి సభలో ఆరు హామీలు విడుదల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ అత్యున్నత కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశానికి టీపీసీసీ సర్వం సిద్ధంచేసింది. 18 ఏండ్ల తర్వాత హైదరాబాద్‌లో జరుగుతున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి భారీ ఏర్పాట్లుచేసింది. 2005లో రాష్ట్రంలో ఏఐసీసీ ప్లీనరీ, సీడబ్ల్యూసీ సమావేశం జరిగింది. అంతకు ముందు 1995లో తిరుపతిలో సీడబ్ల్యూసీ నిర్వహించారు. ఆ తర్వాత ఇన్నేండ్లకు హైదరాబాద్‌లో సమావేశం నిర్వహిస్తున్నది. శుక్ర, శనివారం రెండు రోజులపాటు హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్ సీడబ్ల్యూసీ సమావేశానికి వేదిక కానుంది. దేశం నలుమూలల నుంచి 90 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. విస్తృత సమావేశానికి పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలు, ఐదు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరవుతున్నారు. త్వరలో ఎన్నికలు జరిగే తెలంగాణ, రాజస్థాన్, మిజోరాం, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో అనుసరించాల్సిన వ్యూహం, ఇండియా కూటమి బలోపేతం, పెరుగుతున్న మతోన్మాదం, జమిలి ఎన్నికలతోపాటు ...15లో

అప్పటి వరకూ విచారణకు పిలవొద్దు
7లో..
ఎమ్మెల్సీ కవితకు తాత్కాలిక ఊరట
తదుపరి విచారణ 26కు వాయిదా

విద్యార్థులకు 'దసరా కానుక'
5లో..
= అక్టోబర్ 24 నుంచి 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం'
= సర్కారు బడుల్లో అమలు

ఆర్టిజన్లను, కన్వర్షన్లను పర్మినెంట్ చేయాలి
7లో..
ఇందిరాపార్క్ వద్ద తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ మహాధర్నా

మనసే మనిషి, జ్ఞానమే మనసు, మనిషికి అసలు సిసలు
అర్థం అతను సంపాదించిన విషయ పరిజ్ఞానమే - ఫ్రాన్సిస్ బేకన్



దేశానికి కావాల్సింది... ప్రశ్నలే!

కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ రాజస్థాన్‌లోని బర్మర్‌లో నిర్వహించిన ర్యాలీలో చెలరేగిపోయాడు. 'సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడే వారి నాలుక కోసేయాలి. కండ్లు పీకేయాలని' అన్నాడు. సనాతనకు వ్యతిరేకంగా మాట్లాడే వారికి దేశాన్ని పాలించే అర్హత లేదని కూడా చెప్పుకొచ్చారు. ఎందుకింత విద్వేషపు అలజడులు రేకెత్తిస్తున్నారు? ఎందుకింత ప్రజల భావోద్వేగాలతో ఆడుకుంటున్నారు? ఎందుకిలా ఉన్మాద చర్యలను ప్రేరేపిస్తున్నారు? తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ సనాతనపై చేసిన వ్యాఖ్యలకు సమాధానం చెప్పలేని బీజేపీ-ఆరెస్సెస్ పరివారం 'చంపేస్తాం..నరికేస్తాం' అంటూ ఊగిపోతోంది. హింసను ప్రోత్సహిస్తోంది. దేశాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. భిన్నాభిప్రాయాలు చెప్పగలిగేదే ప్రజాస్వామ్యం. దాన్ని అమలు చేయాల్సింది కేంద్రంలో ఉన్న అధికారపక్షం. కానీ మాట్లాడే స్వేచ్ఛే లేదంటే మరి రాజ్యాంగంలో పొందుపరిచిన భావ ప్రకటనా హక్కు ఉన్నట్టా...లేనట్టా? సనాతన ధర్మం చర్చ అలా ఉంచితే ఇక్కడ 'పరివారం' వ్యవహరిస్తున్న తీరు గమనించాల్సిన అంశం. ప్రశ్నించే ప్రతి ఒక్కరినీ ఇలా బెదిరింపులకు గురిచేయడం, హింసను ప్రేరేపించే విధంగా మాట్లాడటం వారు చెప్పే ఆధ్యాత్మికత కూడా అంగీకరించదు కదా..! ఇది రాక్షసత్వమే తప్ప మరోటి కాదు. అయితే ఉదయనిధి స్టాలిన్ తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నాడు. ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు. ఎక్కడ సదస్సు, సభలు జరిగినా తనదైన శైలిలో బీజేపీపై ప్రశ్నలు సంధిస్తూనే ఉన్నాడు. ఇలాంటి వ్యక్తులే కావాలి నేడు దేశానికి. ఆయన ధైర్యంగా మాట్లాడటమే కాదు నిలబడ్డాడు. ఆయనకు విశాల ప్రజామోదం కూడా లభిస్తోంది. అయితే దీన్ని సహించలేని శక్తులు చేస్తున్న రాద్ధాంతమే విస్మయాన్ని కలిగిస్తోంది.

అయోధ్యకు చెందిన ఓ స్వామీజీ ఉదయనిధి తలపై రూ.10కోట్ల రివార్డు ప్రకటించిన విషయం తెలిసిందే. అతని తలనరికి తన చేతిలో పెట్టాలని, ఆ పని ఎవరూ చేయడానికి ముందుకు రాకపోతే..తానే చేస్తానంటూ బెదిరిం చాడు. వెంటనే స్పందించిన స్టాలిన్ 'మీ ప్రాంతంలో కులవివక్ష, అంటరానితనం లేకుండా చేస్తే నేనే రూ.20 కోట్లు ఇస్తానని' సవాల్ విసిరాడు. దీన్ని బట్టి దేశంలో కులం స్థానాన్ని అర్థం చేసుకోవచ్చు. అక్రమ మైనింగ్ కోసం ఒక జాతి నిర్మూలనకే పథకం వేసిన నాయకులు సనాతనను నిర్మూలించాలనగానే ఎక్కడలేని విద్వేషాన్ని వెళ్లగక్కుతున్నారు. ఎక్కడపడితే అక్కడ విషాన్ని చిమ్ముతున్నారు. మూడునెలలుగా మతం మంటల్లో కాలిపోతున్న మణిపూర్‌పై ఒక్కరంటే ఒక్కరూ కూడా స్పందించలేదు. అంతెందుకు ప్రధానే నోరువిప్పలేదు. బాధితుల్ని ఓదార్చేందుకు రాష్ట్రాన్ని సందర్శించారా? శాంతి, భద్రతలను పర్యవేక్షించారా? కానీ ఉదయనిధి వ్యాఖ్యలపై ఏకంగా కేంద్ర మంత్రి వర్గ సమావేశంలో ఊటంకించి సనాతన గురించి ఎవరు మాట్లాడినా సహించ కూడదనే సందేశాన్ని ఇచ్చారు. అంటే వీరి అధికారమంతా సనాతన పెంచిపోషించమేనన్నమాట. ప్రజల బాగోగులకంటే కూడా కుల, మతాల్నే రక్షించాలన్న మాట. వీరి విభజనవాదానికి అవి రక్షణ కవచాలన్నమాట.

అయితే సనాతన పేరుతో చేస్తున్న రాద్ధాంతం, విధ్వంసాన్ని ఉదయనిధి ఖండిస్తూనే ఉన్నాడు. ఉదయనిధే కాదు, ప్రతి పౌరుడూ ఖండించాలి. మోడీ పాలనలో దేశం తిరోగమనంలోకి వెళ్తోంది. ధరాభారం జనాన్ని అవస్థలు పెడుతోంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం ఆందోళనకు గురిచేస్తోంది. విభజన రాజకీయం కంటిమీద కునుకే లేకుండా చేస్తోంది. ప్రయివేటీకరణ, ఉత్పాదకత, ప్రభుత్వరంగ సంస్థల నిర్వీర్యం, అభద్రతా భావం ఇలా సమాజాన్ని పట్టిపీడించే సమస్యలు ఇప్పుడు కోకొల్లలు. వీటి నుంచి దృష్టిమరలించడానికి ఎత్తుకున్న రాగం 'భారత్', పాడుతున్న పాట 'జమిలి'. సనాతన అంటేనే ఆధిపత్యమని అర్థమైన తర్వాత దాన్నుంచి ఎలా బయటపడాలన్న అంశంపై నేడు చర్చ అవసరం. అందుకు ఉదయనిధి స్టాలిన్‌లు ఊరికొకరు కావాలి. ధైర్యంగా మాట్లాడాలి. అవసరమైన ప్రతిచోటా పోరాడాలి. పరివారం ప్రేరేపిస్తున్న హిందూత్వను అడ్డుకుని దేశాన్ని లౌకికతత్వంవైపు నడిపించాలి. 'ప్రశ్నిస్తే శత్రువుగా మిగిలిపోతావేమో... అయినా పర్వాలేదు కానీ బానిసగా మాత్రం జీవించకు' అన్న స్ఫూర్తే ఇప్పుడు దేశానికి రక్ష.

సంపాదకీయం

భారత స్వాతంత్ర్యోద్యమంతో ఆర్ఎస్ఎస్‌కు అణువంత సంబంధం కూడా లేదు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని భారత యువత, తమ విలువైన యవ్వన జీవితాన్ని వృథా చేసుకోవద్దని, ఆనాటి ఆర్ఎస్ఎస్ అధినేత గోల్వాల్కర్, బహిరంగంగానే ప్రకటించారు. వీరి సైద్ధాంతిక గురువు వినాయక్ దామోదర్ సావర్కర్, తనను జైలునుంచి విడుదల చేస్తే, బ్రిటిష్ పాలకులకే ఉపయోగమని వేడుకుని బయటపడ్డారు. స్వాతంత్ర్యోద్యమం ఉవ్వెత్తున సాగుతున్న కాలంలో కాంగ్రెసు నాయకులు ప్రాంతీయ ప్రభుత్వాలకు రాజీనామా చేసి నిరసన తెలిపారు. కానీ సావర్కర్ బ్రిటిష్ పాలకులకు సంఘీభావం తెలిపారు. ఇలాంటి ఆర్ఎస్ఎస్, వీరి రాజకీయ విభాగమైన బీజేపీలు ఇప్పుడు దేశభక్తి గురించి మాట్లాడుతున్నాయి.

స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో రాజుల పాలనలో ఉన్న రాజ్యాలు ఇండియా లేదా పాకిస్తాన్‌లో విలీనం కావడానికీ, లేదా స్వతంత్ర దేశాలుగా కొనసాగడానికీ స్వేచ్ఛనిచ్చారు. బ్రిటిష్ పాలకులతో జరిగిన ఒప్పందం అది. రైతాంగ పోరాటం ఉధృతమైంది. నిజాం రాజు నిలువలేని పరిస్థితి ఏర్పడింది. ఏమాత్రం ఆలస్యం జరిగినా నిజాం రాచరికం కుప్పగూలి ఎర్రజెండా అధీనంలోకి వచ్చే పరిస్థితి ఏర్పడ్డది. అదే జరిగితే పరిణామాలు ఎట్లా ఉంటాయో నెహ్రూ-పటేల్‌కు తెలుసు. ఇలాంటి పరిస్థితులలోనే 1948 సెప్టెంబరు 13న యూనియన్ సైన్యాలు తెలంగాణలో అడుగుపెట్టాయి. నిజాం రాజు పెద్దగా ప్రతిఘటించలేదు. ఐదవరోజుకల్లా నిజాం రాజు, హైదరాబాద్ రాజ్యాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేయడానికి అంగీకరించాడు. ఇదీ చరిత్ర.

ఈ కట్టుకథలు ఇంకెన్నాళ్లు?




ఎస్. వీరయ్య

విలీన దినోత్సవం రోజు రాష్ట్రానికి అమిత్ షా వస్తున్నారు. పైగా దీనిని విమోచన దినోత్సవం అంటున్నారు. నిజాం పాలనలో ఉన్న హైదరాబాద్ రాజ్యం స్వతంత్ర భారతదేశంలో విలీనమైన ఘట్టం గురించి వీరికి మాట్లాడే అర్హత ఉన్నదా? వాస్తవంగా ఏం జరిగింది?

1946లో ప్రారంభమైన తెలంగాణ సాయుధరైతాంగ పోరాటం జరుగుతున్న కాలంలోనే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. తర్వాత సంవత్సరానికి హైదరాబాద్ రాజ్యం కూడా భారతదేశంలో విలీనం అయ్యింది. కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో, పుచ్చలపల్లి సుందరయ్య నాయకత్వంలో సాగిన ఈ పోరాటం ద్వారా పేదలకు పది లక్షల ఎకరాల భూమి పంచారు. ఈ పోరాట ఫలితంగానే హైదరాబాద్ రాజ్యం భారతదేశంలో విలీనం కాక తప్పని పరిస్థితి ఏర్పడింది. అంతిమంగా, ఈ పోరాట ఫలితంగా భూమి సమస్య దేశం ఎజెండా మీదకు వచ్చింది. భూసంస్కరణల ఆవశ్యకత గుర్తించక తప్పని పరిస్థితి ఏర్పడింది. కులమతాలకు, ప్రాంతీయ భేదాలకు అతీతంగా సాగిన మహత్తర పోరాటమిది. వెట్టిచాకిరీని ప్రతిఘటించిన పోరాటం, మూడువేల గ్రామరాజ్యాలు ఏర్పాటు చేసి, మహిళలను నిర్ణయంలో భాగస్వాములను చేసింది. విడాకులతో సహా మహిళల హక్కులు గుర్తించారు. తెలుగు భాష అభివృద్ధి కోసం పోరాడారు. ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక రంగాలలో జరిగిన పోరాటమది. తెలంగాణ రైతాంగం పోరుబాటలో ఉండగా, ఆంధ్రప్రాంతంలోని సరిహద్దు జిల్లాల నుంచి ప్రజలు విరాళాలు పంపారు. కమ్యూనిస్టు కార్యకర్తలు స్వయంగా తెలంగాణకు తరలివచ్చి పోరాటంలో పాల్గొన్నారు. నాయకులకు, దళాలకు రక్షణ కల్పించారు. ఈ ప్రయత్నాలలో తీవ్ర నిర్బంధాలకు గురయ్యారు. భూమికోసం, భుక్తి కోసం, దోపిడీ నుంచి విముక్తి కోసం సాగిన ఈ మహోద్యమంలో ఆర్యసమాజ్ వెతికినా కనిపించదు. పైగా భూస్వాముల పంచన జేరింది. ఆర్ఎస్ఎస్ ఛాయలే కనిపించవు. ఎర్రజెండా నాయకత్వంలో సాగిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఈ పోరాటం గురించి ఇప్పుడు ఆర్ఎస్ఎస్, దాని ముద్దుబిడ్డ బీజేపీ వక్రభాష్యం చెబుతున్నది.

బ్రిటిష్ ఇండియాలో స్వాతంత్ర్యోద్యమం జరుగుతున్న కాలంలోనే కాశ్మీరీ రైతాంగం కూడా రాజు హరిసింగ్ రాజ్యం మీద తిరుగుబాటు చేసారు. భూమికోసం, ప్రజాస్వామ్యం కోసం పోరాడారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో జమ్ముకాశ్మీర్ రాజు స్వతంత్ర రాజ్యంగానే ఉండాలనుకున్నాడు. కానీ పాకిస్థాన్ దాడి చేసింది. కాశ్మీర్ రైతాంగం ఒకవైపు రాజ్యంమీద పోరాడుతూనే, పాక్ సైన్యాలను కూడా ఎదిరించారు. కశ్మీరీలు ముస్లింలు. అయినా పాకిస్థాన్ లాంటి మతరాజ్యంలో చేరడానికి నిరాకరించారు. ప్రజాస్వామ్యం కోరుకున్నారు. ఇటు ప్రజల తిరుగుబాటు, అటు పాకిస్థాన్ దాడితో ఉక్కిరిబిక్కిరి అయిన రాజు హరిసింగ్, జమ్ము కాశ్మీర్‌ను ఇండియాలో విలీనం చేయడానికి నిర్ణయించుకున్నాడు. ఆమేరకు పాకిస్థాన్‌ను ఎదుర్కొనే బాధ్యత ఇండియా తీసుకున్నది. భారతదేశం సెక్యులర్ దేశంగా ఉంటుందన్న హామీతో ఇండియాలో కలవడానికి సిద్ధపడ్డారు. 1947 అక్టోబర్‌లో ఇండియన్ యూనియన్ ప్రభుత్వానికీ, జమ్ము కాశ్మీర్ రాజుకూ ఒప్పందం కుదిరింది. ఇలాంటి సమయంలో కూడా, ప్రజాపరిషత్, ఆర్ఎస్ఎస్, జమ్ముకాశ్మీర్ స్వతంత్ర రాజ్యంగానే ఉండాలని రాజుకు సూచించింది. అప్పుడు వీరికి అఖండ భారత్ గుర్తుకు రాలేదు. అసలు భారత స్వాతంత్ర్యోద్యమంతో ఆర్ఎస్ఎస్‌కు అణువంత సంబంధం కూడా లేదు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని భారత యువత, తమ విలువైన యవ్వన జీవితాన్ని వృథా చేసుకోవద్దని, ఆనాటి ఆర్ఎస్ఎస్ అధినేత గోల్వాల్కర్, బహిరంగంగానే ప్రకటించారు. వీరి సైద్ధాంతిక గురువు వినాయక్ దామోదర్ సావర్కర్, తనను జైలునుంచి విడుదల చేస్తే, బ్రిటిష్ పాలకులకే ఉపయోగమని వేడుకుని బయటపడ్డారు. స్వాతంత్ర్యోద్యమం ఉవ్వెత్తున సాగుతున్న కాలంలో కాంగ్రెసు నాయకులు ప్రాంతీయ ప్రభుత్వాలకు రాజీనామా చేసి నిరసన తెలిపారు. కానీ సావర్కర్ బ్రిటిష్ పాలకులకు సంఘీభావం తెలిపారు. ఇలాంటి ఆర్ఎస్ఎస్, వీరి రాజకీయ విభాగమైన బీజేపీలు ఇప్పుడు దేశభక్తి గురించి మాట్లాడుతున్నాయి. క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో కూడా ఇక్కడ ఆర్ఎస్ఎస్‌తో తమకేమీ ప్రమాదం లేదనీ, స్వాతంత్ర్యం కోసం కమ్యూనిస్టులు ప్రజలను రెచ్చగొడుతున్నారని పోలీసు అధికారులు బ్రిటిష్ పాలకులకు రిపోర్టు పంపారు. బ్రిటిష్ వ్యతిరేక పోరాటంతోగానీ, భూస్వాములు, జమీందార్ల దోపిడీ వ్యతిరేక పోరాటంతో గానీ, రాచరికాల మీద సాగిన తిరుగుబాట్లతోగానీ ఏ సంబంధమూ లేని వీరు ఇప్పుడు భారతదేశం గురించీ, దేశభక్తి గురించీ, తెలంగాణ విలీనం గురించీ మాట్లాడుతున్నారు.



రైతాంగ సాయుధ పోరాటానికి మతం రంగు పులుముతున్నారు. ముస్లింలనుంచి హిందువులకు విమోచనగా ప్రచారం చేస్తున్నారు. ప్రజల మీద ప్రత్యక్షంగా దోపిడీ, దౌర్జన్యాలు సాగించిన జమీందార్లు, జాగీర్‌దార్లు హిందువులే. వీరికి అండగా నిలిచింది నిజాం ప్రభుత్వం. భూమి కోసం కేసు వేసిన బందగిని భూస్వామి హత్య చేయించాడు. భూస్వామికి అండగా నిలిచిన నిజాం పోలీసులు ముస్లింలు. హత్యకు గురైన రైతు, బందగి ముస్లిం. ఇక్కడ భూమిసమస్య తప్ప హిందూ ముస్లిం సమస్య లేదు. హైదరాబాద్ నగరంలో, నిజాం రాజ్యం మీద పోరాటం తప్పదని కామ్రేడ్స్ అసోసియేషన్ ప్రారంభించినవారిలో ఆలం ఖుంద్మిరి, మఖ్దూం మొహియుద్దీన్, రాజ్‌బహదూర్ గౌర్ ముఖ్యులు. నిజాం నిరంకుశ పాలనను ఎండగడుతూ వార్తలు రాసిన ఉర్దూ పాత్రికేయుడు షోయబుల్లాఖాన్‌ను నరికి చంపిన దుర్మార్గులు రజాకార్లు. ఐలమ్మ పండించిన పంటను దోచుకుని రావాలని జమీందార్ రామచంద్రారెడ్డి, తన గూండాలను పంపాడు. ఐలమ్మకు అండగా భీమిరెడ్డి నర్సింహారెడ్డి నాయకత్వంలో ఒక బృందం రంగంలోకి దిగింది. గూండాలను తరిమి, ఐలమ్మకు పంట దక్కేటట్టు చేసింది. జమీందారు మీద సాధించిన ఈ విజయం వార్త అనేక గ్రామాలకు పాకింది. రైతాంగం ప్రదర్శనలు చేసారు. ఈ స్ఫూర్తితోనే దొడ్డి కొమురయ్య కూడా ప్రదర్శనలో పాల్గొన్నాడు. కానీ జమీందార్లకు మద్దతుగా నిజాం సైనికులు, రజాకార్లు దాడి చేసి దొడ్డి కొమురయ్యను పొట్టనబెట్టుకున్నారు. ఇక్కడ మతసమస్య ఎక్కుడున్నది? అసలు రజాకార్ సంస్థకు అధ్యక్షుడు ఖాసిం రజ్వీ కాగా, ఉపాధ్యక్షుడు విసునూరు దేశముఖ్ రామచంద్రారెడ్డి కదా! ఏ గ్రామం పోయినా, రజాకార్ మూకలకు అడ్డాలు ఈ దొరల గడీలే కదా! హైదరాబాద్ నగరంలో కార్మిక పోరాటాలు కూడా జరిగాయి. పోలీసు కాల్పులను ఎదిరిస్తూ నిజాం పోలీసులను తరిమికొట్టారు. మఖ్దూం మొహియుద్దీన్, రాజ్‌బహద్దూర్ గౌర్, కెఎల్ మహేంద్ర, అలీ అక్బర్, సత్యనారాయణరెడ్డి తదితర నాయకులే ఆనాటి పోరాటాల సారథులు. భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ నుంచి విముక్తి కోసం సాగిన ఈ మహత్తర రైతాంగ పోరాటానికి మతం రంగు పులమటం దుస్సాహసం.



ఇప్పుడు ఐలమ్మ పేరు చెప్పుకుంటున్న బీఆర్ఎస్ నేతలది కూడా, చెట్టుపేరు చెప్పి, కాయలు అమ్ముకునే ప్రయత్నమే. భూస్వామ్య వ్యతిరేక పోరాట వీరనారి ఐలమ్మ. ఆమె పేరు వాడుకుంటున్న బీఆర్ఎస్ పాలకులకు వ్యవసాయ కార్మికులు, కౌలురైతులంటే గిట్టదు. అసైన్డ్ భూములు నిర్దాక్షిణ్యంగా గుంజుకుంటున్నారు. రెవిన్యూ రికార్డుల నుంచి 'కాస్తు' కాలమ్ తొలగించి, దశాబ్దాలుగా దున్నుకుంటున్న పేదరైతులను భూములనుంచి దూరం చేసారు.

కాంగ్రెసు, సర్దార్ పటేల్ పాత్ర కూడా కొత్త తరాలకు తెలియాలి. 1947 అక్టోబరులో జమ్ముకాశ్మీర్ రాజ్యాన్ని భారతదేశంలో విలీనం చేస్తూ నెహ్రూ-పటేల్ ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నది. అప్పుడు సర్దార్ పటేల్ హోం మంత్రి. సరిగ్గా నెలరోజుల తర్వాత, ఇదే ఇండియన్ యూనియన్ ప్రభుత్వం, నవంబరు 1947లో, నిజాం రాజుతో యథాతథ ఒప్పందం చేసుకున్నది. అంటే, నిజాం రాజ్యాన్ని కూడా స్వతంత్రదేశంగా గుర్తించింది. ఒకరి సార్వభౌమాధికారాన్ని మరొకరు గౌరవించాలని సంతకాలు చేసింది. విలీనానికి అంగీకరించిన జమ్ము కాశ్మీర్ రాజ్యాన్ని కలుపుకున్నారు. స్వతంత్ర దేశంగానే ఉంటామని ప్రకటించిన నిజాంతో యథాతథ ఒప్పందం చేసుకున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో రాజుల పాలనలో ఉన్న రాజ్యాలు ఇండియా లేదా పాకిస్తాన్‌లో విలీనం కావడానికీ, లేదా స్వతంత్ర దేశాలుగా కొనసాగడానికీ స్వేచ్ఛనిచ్చారు. బ్రిటిష్ పాలకులతో జరిగిన ఒప్పందం అది. రైతాంగ పోరాటం ఉధృతమైంది. నిజాం రాజు నిలువలేని పరిస్థితి ఏర్పడింది. ఏమాత్రం ఆలస్యం జరిగినా నిజాం రాచరికం కుప్పగూలి ఎర్రజెండా అధీనంలోకి వచ్చే పరిస్థితి ఏర్పడ్డది. అదే జరిగితే పరిణామాలు ఎట్లా ఉంటాయో నెహ్రూ-పటేల్‌కు తెలుసు. ఇలాంటి పరిస్థితులలోనే 1948 సెప్టెంబరు 13న యూనియన్ సైన్యాలు తెలంగాణలో అడుగుపెట్టాయి. నిజాం రాజు పెద్దగా ప్రతిఘటించలేదు. ఐదవరోజుకల్లా నిజాం రాజు, హైదరాబాద్ రాజ్యాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేయడానికి అంగీకరించాడు. ఇదీ చరిత్ర. సర్దార్ పటేల్ సాహసంతో, నిజాం ప్రభుత్వాన్ని లొంగదీసుకున్నారని నమ్మబలుకుతున్నారు. అదే నిజమైతే నిరంకుశ నిజాం రాజును ఎందుకు జైలులో పెట్టలేదు? పైగా ఆ నరహంతకుడినే, తెలంగాణ ప్రజలనెత్తిన రాజప్రముఖ్ పేరుతో కూర్చోబెట్టారు. నరహంతకుడు, రజాకార్ నేత ఖాసీం రజ్వీని ఎందుకు ఉరితీయలేదు? సకల సౌకర్యాలతో పాకిస్థాన్‌కు ఎందుకు అప్పగించారు? అంతేనా? రాజు ఆస్తిని జప్తు చేయకపోగా, నిజాం కుటుంబానికి రాజభరణం పేరుతో పరిహారం ముట్టజెప్పారు. యూనియన్ సైన్యాలు రాచరికం నిరంకుశత్వాన్ని అంతం చేసి ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పుతాయనీ, రైతాంగం హక్కులను గౌరవిస్తాయనీ నమ్మిన రైతులు మోసపోయారు. సైన్యం రైతాంగం మీద విరుచుకుపడ్డది. నిజాం పాలనలో, రైతాంగ తిరుగుబాటుతో భయపడి హైదరాబాద్ పారిపోయిన జమీందార్లు, యూనియన్ సైన్యాల అండతో ఖద్దరు బట్టలూ, తెల్లటోపీలతో, కాంగ్రెస్ అవతారంలో గ్రామాలలో అడుగుబెట్టారు. యూనియన్ సైన్యాల నిజరూపం రైతులకు అర్థమైంది.

ఈ మహత్తర పోరాట వారసులు కమ్యూనిస్టులు. ఇప్పటికీ ప్రజల కోసం పోరాడుతున్నది కమ్యూనిస్టులే కదా! ఇప్పుడు ప్రజల సమస్యలు పరిష్కరించటంలో మోడీ ప్రభుత్వం విఫలమైంది. అందుకే మతపరమైన విభజనతో, భావోద్వేగాలు రెచ్చగొట్టి, ప్రజల దృష్టి మరలించాలని ప్రయత్నిస్తున్నది. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి మతం రంగు పులిమేది కూడా అందుకే. తెలంగాణ ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు అప్రమత్తంగా ఉండాలి. ■

మతోన్మాద ముప్పు - వివేకానందుని హెచ్చరికలు



ఎస్.ఎన్. సాహూ

సెప్టెంబర్ 11, 2001న న్యూయార్క్‌లోని ట్విన్ టవర్లను ధ్వంసం చేసి, ఇతర ప్రాంతాల్లో దాడులు చేసిన కొంతమంది మతోన్మాదులు, అమెరికాపై చేసిన తీవ్రవాద దాడిని గుర్తుచేసుకుంటాం. భారతదేశ చరిత్రతో ముడిపడి ఉన్న సెప్టెంబర్ 11రోజు చాలా ఉన్నతమైంది, నిర్మాణాత్మకమైంది. ఇదే 1893 సెప్టెంబర్11న, స్వామీ వివేకానంద చికాగోలోని ప్రపంచ మతాల పార్లమెంట్ (వరల్డ్ పార్లమెంట్ ఆఫ్ రెలిజియన్స్)లో ప్రసంగించాడు. ఇదే రోజు 1906లో మహాత్మాగాంధీ దక్షిణాఫ్రికాలో తన మొదటి సత్యాగ్రహాన్ని ప్రారంభించాడు.

అధిక సంఖ్యాక వాదం (మెజారిటేరియనిజం)లో వ్యక్తమైన మతోన్మాదం

సెప్టెంబర్ 11నాటి స్వామీ వివేకానందుని సంక్షిప్తమైన, లోతైన ప్రసంగం, అమెరికా ప్రజలను మంత్ర ముగ్ధులను చేయడం ద్వారా వారిని కదిలించింది. తరువాత ఆధ్యాత్మికత, వేదాంతంపై అనేక ఉపన్యాసాల ద్వారా ఆయన వారి మనసుల పైన చాలా ప్రభావం చూపించాడు. చారిత్రాత్మకమైన తన చికాగో ప్రసంగంలో, "పాక్షికత్వం (సెక్టేరియనిజం), మతదురభిమానం (బిగాట్రీ), దాని వారసత్వంగా వచ్చిన భయంకరమైన మతోన్మాదం, ఈ నేలను అమాయకుల రక్తంతో తడిపివేసాయని" ఆయన పేర్కొన్నాడు. అదే విధంగా, ప్రపంచ మతాల పార్లమెంట్ ప్రారంభానికి మోగిన గంట, మతోన్మాదానికి మృత్యుఘోష కావాలని ఆయన ఆశించాడు. వాస్తవానికి స్వామీ వివేకానందుని మాటలు చాలా కదిలించాయి. ఆయన ఆ మాటలు మాట్లాడిన 108 సంవత్సరాల తరువాత మతోన్మాదులు కొందరు అమెరికాపై దాడి చేశారు. దురదృష్టవశాత్తు, 2023లో ప్రపంచం, ముఖ్యంగా భారతదేశం ఇప్పుడు, అధికసంఖ్యాకవాదం రూపంలో ఉన్న పాక్షికత్వం, మత దురభిమానం, మతోన్మాదాల సమ్మేళనాన్ని, భారతదేశ ప్రభుత్వ యంత్రాంగాన్ని నియంత్రించే వారు ప్రేరేపించే విభజన ప్రక్రియను ఎదుర్కొంటోంది.

జాతి సంహారం, జాతి ప్రక్షాళన కోసం పిలుపు

ఇప్పుడు, మతం పేరుతో హింస, ద్వేషాన్ని నిర్దాక్షిణ్యంగా వ్యాప్తి చేస్తున్న క్రమాన్ని మనం ఎదుర్కొంటున్నాం. మైనార్టీల్ని, ముఖ్యంగా ముస్లింల్ని అంతమొందించాలని, ధర్మసన్సద్‌లు, మత పార్లమెంట్ల నుండి చాలా కాలంగా ప్రతిరోజూ పిలుపులు జారీ చేస్తున్నారు. వీటికి, ముస్లింల సమగ్ర సామాజిక, ఆర్థిక బహిష్కరణ కోసం కూడా అశుభకరమైన పిలుపులు తోడు అయ్యాయి. ఇటీవల కాలంలో ఇలాంటి పిలుపులు హర్యానా రాష్ట్రంలోని నూహ్‌లో ముస్లింలను హింసాత్మకంగా లక్ష్యంగా చేసుకొని, వారు పని చేస్తున్న ప్రాంతాల్ని వదిలివెళ్ళిపోవాలని ఆదేశిస్తూ, వారి ఇళ్ళను నేలమట్టం చేశారు. పంజాబ్, హర్యానా హైకోర్టు ఈ సమస్యను సుమోటోగా స్వీకరించి, ఇది "జాతి ప్రక్షాళన"లో చేస్తున్న కసరత్తా అని తన ఆర్డర్‌లో ప్రశ్నించింది. జాతి సంహారం, సామాజిక ఆర్థిక బహిష్కరణల కోసం ఇస్తున్న పిలుపుల్ని దృష్టిలో ఉంచుకొని, సుప్రీంకోర్టు రాష్ట్రాలకు జారీ చేసిన ఆజ్ఞల్ని కూడా పరిగణలోకి తీసుకోకుండా తిరస్కరించడం విస్మయం కలిగించే విషయం. ఇటీవలి కాలంలో ద్వేషపూరిత ప్రసంగాలకు అడ్డుకట్టవేయడంలో మహారాష్ట్ర ప్రభుత్వం చేతకానితనాన్ని ప్రదర్శించిందా ఏమిటని సుప్రీంకోర్టు ఆశ్చర్యపోయింది.


గతంలో ఎన్నడూలేని విధంగా, మణిపూర్ రాష్ట్రంలో జాతి ప్రాతిపదికన హింస, రక్తపాతం ఇంకా కొనసాగుతూనే ఉండడం విచారకరం. ఊహించని రీతిలో అక్కడి మహిళలు అనుభవించిన క్రూరత్వం, జాతి ప్రాతిపదికన వారిపై అనాగరికంగా జరిపిన లైంగిక హింస వీడియోలు, పాక్షికత్వం, మతదురభిమాన వ్యక్తీకరణలను బట్టబయలు చేశాయి. ఇలాంటివాటిపై స్వామీ వివేకానంద ధ్వజమెత్తారు, మతోన్మాదం భయంకరమైన వారసత్వం గురించి కూడా ఆయన హెచ్చరించారు. 11 సెప్టెంబర్ 1893న ఆయన మాట్లాడిన మాటలను నేడు భారతదేశంలో పరిగణలోకి తీసుకోకుండా తిరస్కరించబడుతున్న తీరు, ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో మతం ఆధారంగా వేధింపులకు గురవుతున్న వారికి ఆశ్రయం ఇవ్వడం చూసి ఆయన ఆవేదన చెందేవాడు.

ద్వేషంతో ప్రమాదంలో దేశం మనుగడ

ఇతరులకు వ్యతిరేకంగా ద్వేషభావాన్ని వ్యాప్తి చేయడం ద్వారా దేశం యొక్క జీవనాధారం ప్రమాదంలో పడుతుందని స్వామీజీ అంతకు పూర్వమే హెచ్చరించాడు. సమాజంలో ఏర్పడిన ద్వేష భావం, తోటి భారతీయులకు వ్యతిరేకంగా ధిక్కారాన్ని ప్రదర్శించి వారితో సంబంధాలు నిలిపివేయడంతో చరిత్రలో భారతదేశ క్షీణతను ఆయన గుర్తించాడు. 27 అక్టోబర్ 1894న అమెరికా నుండి తన శిష్యుడు అలసింగా పెరుమాళ్‌కు రాసిన లేఖలో, "ఏ మనిషి, ఏ దేశం, నా కొడుకు, ఎవ్వరూ ఇతరులను ద్వేషించి, బతుకలేరని" ఆయన సున్నితంగా పేర్కొన్నాడు." వారు, 'మ్లేచ్ఛులు' అనే పదం కనిపెట్టిన రోజు, ఇతరులతో సన్నిహిత సంబంధాలు నిలిచిపోయినప్పుడే భారతదేశ వినాశనం ఖాయం అయిందని" ఆయన అన్నాడు. "కంప్లీట్ వర్క్స్ ఆఫ్ స్వామీ వివేకానంద"లోని ఐదవ అధ్యాయంలో అందు బాటులో ఉంది. విశ్వాసం పేరుతో భారతీయులను విభజిస్తూ, అంతర్ విశ్వాసాలను, సామరస్యాన్ని విషపూరితం చేస్తున్న ద్వేషభావం, 2023 భారతదేశం ఉన్న ప్రస్తుత సందర్భంలో ఆయన రచనలోని విషయాలకు ప్రాధాన్యత ఉంది.

మతోన్మాదం వల్ల కలిగే ముప్పుపై ధ్వజమెత్తిన సుప్రీంకోర్టు

1893 సెప్టెంబర్ 11న "పాక్షికత్వం, మత దురభిమానం, భయంకర మతోన్మాద వారసత్వాలు, ఈ నేలను అమాయకుల రక్తంతో తడిపివేసాయని" స్వామీ వివేకానంద హెచ్చరిస్తూ మాట్లాడిన మాటలు మన స్వంత ప్రమాదంలో విస్మరించబడవచ్చు. అయిశత్ శిఫా వర్సెస్ కర్నాటక రాష్ట్రం మధ్య ఉన్న కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో (13 అక్టోబర్ 2022) మతోన్మాదం వల్ల కలిగే ప్రమాదం పైన ధ్వజమెత్తింది. ఏ పాఠశాలల్లో, ఏ కళాశాలలో ఎక్కడైనా ముస్లిం బాలికలు హిజాబ్ ధరించడాన్ని అనుమతించే సందర్భంలో కోర్ట్ ఎస్.బీ.చవాన్ కమిటీ నివేదిక 1999పై ఆధార పడింది. ఈ నివేదిక సామాజిక ఐక్యత, సామాజిక, మతసామరస్య సాధనంగా మతాల గురించిన విద్యను చాలా గట్టిగా సిఫార్సు చేసింది. కోర్టు ఆ పేరాను ఈ విధంగా ఉదహరించింది:



"మతోన్మాదం, ద్వేషభావం, హింస, అవినీతి, నిజాయితీలేనితనం, దోపిడీ, మాదకద్రవ్యాల వినియోగం లాంటి వాటికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో దేశానికి విలువ ఆధారిత విద్య, సహాయకంగా ఉంటుంది. సూర్యుని వలె, విజ్ఞానం కూడా అందరికీ అందుబాటులో ఉండాలి. సంకుచిత మనస్తత్వం, అంధవిశ్వాసాలకు, పిడివాద సిద్ధాంతాలకు స్థానం ఉండకూడదు. ఈ లక్ష్యం కోసం ఒకవేళ ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని మతాల ప్రాథమిక సిద్ధాంతాలను నేర్చుకుంటే, లౌకికవాదానికి మనుగడ ఉండదని చెప్పలేం."

భారతదేశ సమ్మిళిత దార్శనికత

వంద సంవత్సరాల క్రితం, స్వామీ వివేకానంద ఏ ఒక్క మతం పైనా ఆధారపడకుండా ఒక సమ్మిళిత పద్ధతిలో భారతదేశాన్ని నిర్వచించాడు. భారతదేశానికి ఒక వేదాంతి మెదడు, ఇస్లామిక్ శరీరం అవసరమని అన్నాడు. ఇలాంటి విధానం, ఏకరూపతను ప్రోత్సాహించి, బహుళ సాంస్కృతికవాదానికి అపాయం కలిగించే, సాంస్కృతిక జాతీయవాదానికి భిన్నంగా భారతదేశాన్ని అర్థం చేసుకోవడానికి బహుళ విశ్వాస మార్గాన్ని అనుసరించాలని నొక్కి చెపుతుంది. కానీ ఒకే దేశం, ఒకే సంస్కృతి, ఒకే విశ్వాసంపై ప్రమాణం చేస్తున్నవారు, తమ పవిత్ర పురుషునిగా చెప్పుకుంటున్న స్వామీ వివేకానంద దార్శనికతను నిరాకరిస్తున్నారు.

వంద సంవత్సరాల క్రితం, స్వామీ వివేకానంద ఏ ఒక్క మతం పైనా ఆధారపడకుండా ఒక సమ్మిళిత పద్ధతిలో భారతదేశాన్ని నిర్వచించాడు. భారతదేశానికి ఒక వేదాంతి మెదడు, ఇస్లామిక్ శరీరం అవసరమని అన్నాడు. ఇలాంటి విధానం, ఏకరూపతను ప్రోత్సాహించి, బహుళ సాంస్కృతికవాదానికి అపాయం కలిగించే, సాంస్కృతిక జాతీయవాదానికి భిన్నంగా భారతదేశాన్ని అర్థం చేసుకోవడానికి బహుళ విశ్వాస మార్గాన్ని అనుసరించాలని నొక్కి చెపుతుంది. కానీ ఒకే దేశం, ఒకే సంస్కృతి, ఒకే విశ్వాసంపై ప్రమాణం చేస్తున్నవారు, తమ పవిత్ర పురుషునిగా చెప్పుకుంటున్న స్వామీ వివేకానంద దార్శనికతను నిరాకరిస్తున్నారు.

వేదాంతంపై నెహ్రూ, అంబేద్కర్

స్వామీ వివేకానంద వేదాంత మార్గాన్ని ఆసక్తికరంగా మన మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తన సుప్రసిద్ధ రచన "బేసిక్ అప్రోచ్"లో ఉదహరించాడు. మానసిక బలహీనతకు కారణమైన ఆధునిక నాగరికత యొక్క అనేక సవాళ్ళకు, వేదాంత ధోరణి పరిష్కారాలను చూపుతుందని నెహ్రూ తన రచనలో పేర్కొన్నాడు. డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ హిందూ మతాన్ని తీవ్రంగా విమర్శిస్తూ, సామాజిక అసమానతలపై ఆధారపడి ఏర్పడిన మతం, హిందూ మతం అని, "కుల నిర్మూలన" అనే రచనలో పేర్కొన్నాడు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంపై ఆధారపడి ఏర్పడిన మతం భారత దేశానికి అవసరమని, అలాంటి ఒక మతం, జీవనాధారాన్ని ఉపనిషత్తుల నుండి పొందుతుందని ఆయన అన్నాడు. వాస్తవానికి ఉపనిషత్తులు వేదాంతాన్ని ఏర్పాటు చేస్తాయి. ఆధునిక భారతదేశ నిర్మాతలైన ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, బీ.ఆర్.అంబేద్కర్ ఇరువురూ, స్వామీ వివేకానంద, భారతదేశ దార్శనికతను ఆవిష్కృతం చేసే ఇస్లాం విలువలతో పాటు సూచించిన వేదాంత మార్గాన్ని గురించి నొక్కి చెప్పారు. భారతదేశ భావనను బెదిరించే మతోన్మాదాన్ని ఓడించాలంటే, 1893 సెప్టెంబర్ 11 నాడు స్వామీ వివేకానంద మాట్లాడిన మాటలకు కట్టుబడి ఉండడం అత్యావశ్యకం.

("ద వైర్" సౌజన్యంతో)

అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451

మెయిల్ @ నవతెలంగాణ

వీధికెక్కిన ఉద్యోగ భ్రాంతి నాటకం!

బొంకరా బొంకరా పోలిగా అంటే టంగుటూరి మిరియాలు తాటికాయంత అన్నాడంట వెనకటికి ఎవడో! ఈ మధ్య కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లో నిరుద్యోగ దీక్ష చేపట్టారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న బీజేపీ ప్రభుత్వం దేశంలో కనీసం పదివేల ఉద్యోగాలు కల్పించకపోగా ఉన్న ఉద్యోగాలకే ఎసరు పెట్టే చర్యలకు పూనుకుంటోంది. మేకిన్ ఇండియా, స్టార్ట్ అప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా అని పేర్లు చెప్పడమే తప్ప యువతకు కేంద్రం చేసింది శూన్యం. కేంద్ర ఉద్యోగ, ఉపాధి కల్పన సంస్థలు, శిక్షణ సంస్థలు నిధులు లేక, సరైన జీతాలు లేక వెలవెల పోతున్నాయన్న అన్న సంగతి కిషన్‌రెడ్డికి తెలియదా? మరి నిరుద్యోగ దీక్ష ఎందుకు చేపట్టినట్టు? బీజేపీ పాలనలో యువతకు కేవలం స్విగ్గిస్, జొమాటో, గో డాడీ కొరియర్ అండ్ కార్గో, అవుట్ సోర్సింగ్, సెక్యూరిటీ, టెలికాలర్స్, ఆఫీస్ బాయ్స్, డ్రైవర్, పెట్రోల్ పంపులో ఆపరేటర్ ఉద్యోగాలు తప్ప గవర్నమెంట్‌లో కొలువులు ఎండమావిగానే మిగిలాయి. 2024 లోక్‌సభ ఎన్నికలకు కొద్ది నెలలు మాత్రమే ఉన్న తరుణంలో గరిష్ఠ నిరుద్యోగ రేటు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం మోడీ నేతృత్వంలోని కేంద్రానికి సవాల్‌గా మారాయి. ద్రవ్యోల్బణాన్ని తగ్గించడం, జాబ్ మార్కెట్‌లోకి వస్తున్న కోట్లాది మంది యువతకు ఉద్యోగాలను కల్పించడం బీజేపీ సర్కార్‌కు ప్రధాన ఛాలెంజ్‌లుగా ఉన్నాయి. మరోవైపు నిరుద్యోగాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్ ఎక్కువగా ఎత్తి చూపుతుంది. దీన్ని మోడీ ప్రభుత్వ వైఫల్యంగా ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు విమర్శిస్తున్నాయి. కేంద్రం అనుసరిస్తున్న అస్తవ్యస్త విధానాలు, ప్రయివేటీకరణ లక్ష్యంగా ప్రభుత్వ ఆస్తుల అమ్మకం, కార్పొరేట్ల ప్రయోజనాలకే ప్రాధాన్యతనివ్వడం వెరసి భారత్‌లో నిరుద్యోగం ఏటికేడూ పెరిగిపోతున్నది. కార్పొరేటు ఎగవేతదారులకు లబ్ధి చేకూరే విధంగా పన్నెండు లక్షల కోట్లు బ్యాంకు రుణాలు రైటాఫ్ చేసారంటే ప్రభుత్వాలు ఎవరి ప్రయోజనం కోసం పనిచేస్తున్నాయి? వీటన్నింటిని పక్కనపెట్టి కొత్తగా నిరుద్యోగ దీక్ష చేపడితే వచ్చేదేముంది? ఉద్యోగాలు ఇవ్వాల్సిన బాధ్యతను విస్మరించిన పార్టీయే నిరుద్యోగ దీక్ష పేరుతో ముందుకు రావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

-ముచ్చుకోట సురేష్‌బాబు

వరద ముప్పునకు శాశ్వత చర్యలు చేపట్టాలి...

హైదరాబాద్ నగరం చిన్నపాటి వర్షానికే జలమయమవుతోంది. రోడ్లపై వరద ప్రవహిస్తుండటంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. గంటల తరబడి వాహనదారులు సతమతమవుతున్నారు. కొన్ని చోట్ల వరద నీటిలో కార్లు, ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోతున్నవి చూస్తూనే ఉన్నాం. అన్నిటికంటే ప్రజల ప్రాణాలకు ముప్పు ఉన్నది. నాలాల్లో పడి చిన్నారులు చనిపోవడం అత్యంత బాధాకారం. జనాభా పెరుగు తున్న కొద్దీ సౌకర్యాలు కూడా మెరుగు పర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. వర్షం వచ్చిన ప్రతిసారి అడపాదడపా చర్యలు తీసుకుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారం దిశగా పాలకులు ఆలోచించడం లేదు. చిన్నపాటి వర్షాలకే నగరం అతలాకుతలమై ప్రజలు బయటకు వెళ్లాలని పరిస్థితి ఉంటోంది.విద్యుత్ స్తంభాలు విరగడం, చెట్లు కూలడం వంటి ఘటనలతో కాలనీల ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారు. ఇండ్లలోకి కూడా వర్షపు నీరు వచ్చి చేరుతోంది. ఇలాంటి వరద పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని నాటి నీటిపారుదల రంగ నిపుణులు 1997, 2000 సంవత్సరాలలో చెరువుల పరిస్థితిని అధ్యయనం చేశారు. 30 చెరువులను అభివృద్ధి చేయడంపై ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. అందుకను గుణంగా సఫిల్‌గూడ, సరూర్ నగర్, లంగర్ హౌజ్ చెరువులను అభివృద్ధి చేయడంతో వరద వల్ల వాటికి ఎలాంటి ముప్పు ఏర్పడటం లేదు. హైదరాబాద్‌లో దాదాపు 400 చెరువులు పై నుంచి కింది వరకు అనుసంధానించబడి ఉన్నాయి. నీరు ఒక చెరువు నుండి మరొక చెరువుకు ప్రవహించాలి. నీటి ప్రవాహ మార్గంలో అభివృద్ధి చేయబడిన నిర్మాణాలు ఒక చెరువు నుంచి మరొక చెరువుకు చేరకుండా అంతరాయంగా ఉంటున్నవి. ముందు చెరువులను అభివృద్ధి పరచాలి. అలాగే ఆకస్మిక వరదల్ని అరికట్టడానికి ఫీడర్ ఛానెల్‌లు, కాలువల్ని అభివృద్ధి చేయడం పరిష్కార మార్గం. ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

- దండంరాజు రాంచందర్ రావు, 9849592958

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె ఉధృతం

అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి

- రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీల భారీ ర్యాలీలు



నవతెలంగాణ-ముషీరాబాద్/విలేకరులు

అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా భారీ ర్యాలీలు తీశారు. వివిధ రూపాల్లో నిరసన తెలిపారు. హైదరాబాద్‌లో సీఐటీయూ రాష్ట్ర కార్యాలయం నుంచి గోల్కొండ క్రాస్ రోడ్డు వరకు నల్ల జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పి.జయలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ.. దేశంలో ఐసీడీఎస్ ప్రారంభించి 48 సంవత్సరాలు అవుతున్నా అంగన్వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయకపోవడం సిగ్గుచేటన్నారు. వారి న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతుంటే అధికారులు వేధింపులకు పాల్పడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధంగా సమ్మెలోకి వెళ్లినా అధికారులు మూర్ఖంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. అంగన్వాడీ ఉద్యోగులకి కనీస వేతనం రూ.26,000 ఇవ్వకపోతే కుటుంబాలు ఎలా గడుస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి ఎం.వెంకటేష్, అంగన్వాడీ యూనియన్ నగర నాయకులు టీ మహేందర్, నాయకులు నర్సమ్మ అనురాధ, వనిత , కుల్సుం, జానకి, రాజేశ్వరి, లలిత, విజయ, స్వప్న, శారద, దనమ్మ, సంధ్య, రాధిక, జానకి, పుష్ప, సంధ్య తదితరులు పాల్గొన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అల్వాల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీస్ వద్ద నిరసన అనంతరం అల్వాల్ ప్రాజెక్టు ఆఫీస్ నుంచి యాప్రాల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. రంగారెడ్డి జిల్లాలో హయత్‌నగర్ ప్రాజెక్టు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సరూర్‌నగర్ సీడీపీఓ ఆఫీస్ దగ్గర బతుకమ్మ ఆడి నిరసన తెలియజేశారు. అనంతరం ర్యాలీ తీశారు.ఖమ్మం జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీలు భారీ ప్రదర్శన నిర్వహించారు. జెడ్పీ సెంటర్ నుంచి పెవిలియన్ గ్రౌండ్ వరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరంలో గ్రౌండ్‌లో జరిగిన సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వర్లు మాట్లాడారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీల సమ్మెకు బీఎస్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ సంఘీభావం తెలిపారు. భద్రాచలంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎంబి నర్సారెడ్డి మద్దతు తెలిపారు. ములకలపల్లి చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. అదేవిధంగా కొందరు చిన్నారులు కేసీఆర్ తాత.. మా అమ్మల బాధలు అర్థం చేసుకోండని సమ్మె శిబిరం వద్ద పలకపై రాసి పట్టుకోవడం చూపరులను కలిచివేసింది. అశ్వారావుపేటలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు అంగన్‌వాడీలకు మద్దతుగా దీక్షలో కూర్చున్నారు.

రజాకార్ల వ్యతిరేక పోరాటంలో మహిళల పాత్ర మరవలేనిది

ఐద్వా ఉపాధ్యక్షులు బి హైమావతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం లో మహిళల పాత్ర మరవలేనిదని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఉపాధ్యక్షులు బత్తుల హైమావతి తెలిపారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, మహిళల పాత్ర' అంశంపై శుక్రవారం మూడ్ శోభన్ అధ్యక్షతన వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రజాకార్లను తరిమి కొట్టటంతోనే ఆగకుండా..ఆ తర్వాత నెహ్రూ సైన్యాలతోనూ తలపడ్డారని తెలిపారు. వారి పోరాట తెగువ నేటి మహిళా లోకానికి స్ఫూర్తిదాయకమన్నారు. రజాకార్ల, నెహ్రూ సైన్యాల అకృత్యాలకు బలైంది కూడా ఎక్కువ మహిళలేనని చెప్పారు. అలాంటి గొప్ప పోరాటానికి మతోన్మాద శక్తులు మత కొట్లాటగా చిత్రించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అది హిందూ, ముస్లిం కొట్లాట కాదని చెప్పారు. వెట్టి చాకిరికి వ్యతిరేకంగా పేదల విముక్తి కోసం సాగిన చారిత్రక పోరాటమని తెలిపారు. ఆ పోరాటంలో కుల, మతాలకు అతీతంగా ఉద్యమించారనీ, తద్వారా ఎందరో పాశవిక నిర్బంధానికి గురయ్యారని తెలిపారు. చరిత్రకు వక్రభాష్యాలు చెప్పి రాజకీయ లబ్ధి పొందాలని సంఘ్‌పరివార్ శక్తులు కలలు కంటున్నాయనీ, వారి ఆటలు తెలంగాణలో సాగవని హెచ్చరించారు.

కాంగ్రెస్‌లోకి చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదేలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదేలు శుక్రవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు మంచిర్యాల జెడ్పీ చైర్ పర్సన్ భాగ్యలక్ష్మి, కౌన్సిలర్ శివ కిరణ్, నల్లాల శ్రావణ్, నల్లాల సందీప్, దుర్గం నరేష్, ముజాహిద్, మెరుగు ప్రభాకర్, మహేందర్, తదితరులను హైదరాబాద్‌లో రేవంత్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఉద్యమ నిర్మాత కనయ్ బెనర్జీ

- సిఐటియు, ఎఐకెఎస్ సంతాపం



న్యూఢిల్లీ : స్వాతంత్ర్య ఉద్యమ నేత, ప్రముఖ కార్మిక సంఘ నాయకుడు, సైద్ధాంతికవేత్త, సిఐటియు మాజీ జాతీయ కార్యదర్శి కనయ్ బెనర్జీ మృతికి సిఐటియు, ఎఐకెఎస్ తదితర సంఘాలు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశాయి. 1939లో ఢాకాలో సుభాష్ చంద్రబోస్ ప్రసంగించిన సమావేశానికి హాజరైన విషయాన్ని బెనర్జీ గుర్తు చేసుకునేవారని తెలిపాయి. ప్రజా ఉద్యమాల్లోనూ, రాజకీయ కార్యకలాపాల్లోనూ క్రియాశీలంగా పాల్గొంటున్నందుకు ఆయనను ఇంటి నుండి వెళ్లగొట్టారు. కూచ్‌బీహార్‌లోని కాలేజీ నుండి బహిష్కరించారు. ప్రజల నుంచి వచ్చిన ఒత్తిడితో ఆయన్ని మళ్లీ కళాశాలలోకి తీసుకున్నారు. 1940 తొలినాళ్లలో బీడీ కార్మికులు, టైలర్లు, రజక వృత్తిదారుల సంక్షేమం కోసం ఉద్యమాలు నిర్మించిన ఆయన తర్వాత సహకార సంస్థలను నడిపారు. కలకత్తాకు వచ్చిన తర్వాత విద్యార్థి ఉద్యమంలో, కార్మిక సంఘ ఉద్యమంలో చాలా చురుగ్గా వుండేవారు. 1974లో చారిత్రక రైల్వే సమ్మెలో కీలక పాత్ర పోషించారు. 1984లో రైల్వే నుంచి ముందుగానే రిటైర్‌మెంట్ తీసుకుని బిటిఆర్ చొరవ మేరకు ఢిల్లీలో సిఐటియు సెంటర్‌లో కనయ్ చేరారని సిఐటియు గుర్తు చేసుకుంది. 1989 నుంచి సిఐటియులో వివిధ రంగాల్లో, వివిధ రాష్ట్రాల్లో పలు బాధ్యతలు నిర్వహించారు. సిఐటియు నాయకత్వంలోకి మహిళలను కూడా తీసుకురావాలని ఆయన పట్టుబట్టేవారు. సిఐటియు లైబ్రరీ రూపకల్పనలో ఆయనది కీలక పాత్ర అని గుర్తు చేసుకుంది. ఆయన మృతికి సంతాపసూచకంగా సిఐటియు, ఎఐకెఎస్ పతాకాలను అవనతం చేశారు. ఆయన మృతికి సంతాపాన్ని తెలియచేస్తూ వారి కుటుంబ సభ్యులకు ఆయా సంఘాలు సానుభూతిని ప్రకటించాయి.

దార్శనికత కలిగిన కార్మిక సంఘ నేతగా ఆయన పలు రంగాల్లో పనిచేశారని, వర్కింగ్ ఉమెన్స్ ఉద్యమాన్ని అభివృద్ధిపరిచారని ఎఐకెఎస్ పేర్కొంది. రైతులు, కూలీల మధ్య ఐక్యత కోసం ఆయన కృషి చేశారని పేర్కొంది. దేశవ్యాప్తంగా కార్మిక సంఘ ఉద్యమాల నిర్వహణలోనూ, కార్మికులను, రైతులను సమైక్యపరుస్తూ ఆయన సాగించిన ఉద్యమం ఎన్నటికీ గుర్తుండిపోతుందని పేర్కొంది.

విద్యార్థులకు 'దసరా కానుక'

అక్టోబర్ 24 నుంచి 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం' ● సర్కారు బడుల్లో 1 నుంచి 10వ తరగతి పిల్లలకు అమలు

- మరో చారిత్రక నిర్ణయం : సీఎం కేసీఆర్
- ముఖ్యమంత్రికి సబిత కృతజ్ఞతలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వ దసరా కానుక ప్రకటించింది. సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన సీఎం కేసీఆర్ సర్కారు మరో వినూత్న పథకానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేస్తూ, విద్యార్థుల సంక్షే మానికి పాటుప డుతున్న ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు విద్యార్థుల సంక్షేమం దిశగా మరో చారిత్రక నిర్ణయం తీసుకున్నది. దసరా కానుకగా వచ్చేనెల 24 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు "ముఖ్యమంత్రి అల్పాహార పథకం" అందించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. తద్వారా విద్యార్థులకు చక్కని బోధనతోపాటు మంచి పోషకాహారం అందించే దిశగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయనుంది. నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యా ర్థులకు పౌష్టి కాహారం అందిం చడంతోపాటు వారికి చదువు పట్ల ఏకాగ్రతను పెంచే దిశగా చర్యలు చేపట్టింది. ఉదయాన్నే వ్యవసాయ పనులు, కూలీపనులు చేసుకోవడానికి వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులు పడే ఇబ్బందులను అర్థం చేసుకున్న సీఎం కేసీఆర్ మానవీయ ఆలోచనకు అద్దంపట్టే దిశగా ఈ అల్పాహారం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం దసరా నుంచి అమలు చేయనున్నది.

తమిళనాడులో విజయవంతంగా అమలు

తమిళనాడులో విజయవంతంగా అల్పాహారం పథకం అమలవుతున్నది. ఆ పథకం విధానాన్ని పరిశీలించి రావాలంటూ ఐఏఎస్ అధికారుల బృందాన్ని సీఎం కేసీఆర్ ఇటీవలే అక్కడకు పంపించారు. కాగా అక్కడ విజయవంతంగా అమలవుతున్న 'విద్యార్థులకు అల్పాహారం పథకం'ను అధ్యయనం చేసిన అధికారుల బృందం ప్రభుత్వానికి నివేదిక అందించింది. తమిళనాడులో కేవలం ప్రాథమిక పాఠశాలల వరకే అమలు చేస్తున్నారనే విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తెచ్చింది. కాగా విద్యార్థుల విషయంలో మానవీయ కోణంలో ఆలోచించే కేసీఆర్ ఖర్చుకు వెనకాడకుండా ఉన్నత పాఠశాలల విద్యార్థులకూ అల్పాహారం అందజేయాలని నిర్ణయించారు. ఇందుకు గాను రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై ప్రతి ఏటా దాదాపు రూ. 400 కోట్ల వరకు అదనపు భారం పడనున్నదని ప్రభుత్వం ప్రకటించింది. అయితే రాష్ట్రంలోని 28,807 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 23,05,801 మంది విద్యార్థులకు 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం' వర్తించనుంది. ఇందుకు సంబంధించి విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు.

స్వాగతించిన టీఎస్‌యూటీఎఫ్

ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని టీఎస్‌యూటీఎఫ్ సంపూర్ణంగా స్వాగతించింది. వచ్చేనెల 24 నుంచి ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి ఉత్తర్వులు విడుదల చేయడం హర్షణీయమని టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి తెలిపారు. ఉదయం ఖాళీ కడుపుతో బడికి వచ్చే పలువురు పేద విద్యార్థుల ఆకలి తీర్చే ఈ పథకాన్ని పకడ్బందీగా శాశ్వతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని వారు కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అల్పాహార పథకం ఒక వరమని సీపీఎస్ ఉపాధ్యాయ ఉద్యోగ సంఘం అధ్యక్షులు దాముక కమలాకర్, ప్రధాన కార్యదర్శి చీటీ భూపతిరావు పేర్కొన్నారు.

ఈ పథకాన్ని ప్రకటించిన సీఎం కేసీఆర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు అల్పాహార పథకం అందించాలని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం పట్ల బాలల హక్కుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గుండు కిష్టయ్య, ప్రధాన కార్యదర్శి రఘునందన్ హర్షం ప్రకటించారు.

అభిప్రాయాలు చెప్పడమే నేరమా?

జర్నలిస్టులపై కేసు ఎలా పెడతారు?

● ఎఫ్ఐఆర్‌ను ఎందుకు కొట్టివేయకూడదు? ● ఎడిటర్స్ గిల్డ్ కేసులో చీఫ్ జస్టిస్ కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : మణిపూర్‌లో హింసకు సంబంధించి పక్షపాతంగా మీడియా కవరేజి జరిగిందన్న అంశంపై ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా (ఇజిఐ) ఇచ్చిన నివేదిక తప్పు కావచ్చు లేదా నిజం కావచ్చు, కానీ తన అభిప్రాయాలను చెప్పడం భావ ప్రకటనా స్వేచ్ఛ కదా! అని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. నలుగురు జర్నలిస్టులపై మణిపూర్ పోలీసులు దాఖలు చేసిన కేసులో వారిపై బలవంతంపు చర్యలు తీసుకోకుండా సుప్రీం కోర్టు రెండు వారాల పాటు రక్షణ కల్పించింది. ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియాకు చెందిన జర్నలిస్టులు నేరానికి పాల్పడ్డారంటూ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారని, కానీ అందులో తనకు నేరమనేది కనిపించడం లేదని చీఫ్ జస్టిస్ వ్యాఖ్యానించారు. అసలు ఆ జర్నలిస్టులు చేసిన నేరమేమిటని ఆయన ప్రశ్నించారు. తమ అభిప్రాయాలను చెప్పడాన్నే నేరంగా ఎలా పరిగణిస్తారు? అని ఫిర్యాదుదారులను ప్రశ్నించారు. తొలుత ఎఫ్ఐఆర్‌లను ఢిల్లీకి మార్చాలని సూచించిన కోర్టు, ఆ తర్వాత ఫిర్యాదుదారులు పదే పదే జర్నలిస్టులు మణిపూర్‌లో చేసిన నష్టం గురించి ప్రస్తావిస్తూ వుండడంతో కీలకమైన వ్యాఖ్యలు చేసింది."మీరు ఈ విషయాన్ని లేవదీశారు కాబట్టి ఒక విషయం ముందు మాకు చెప్పండి, అసలు ఈ నేరాలు ఎలా జరిగాయో చెప్పండి, అఫిడవిట్ దాఖలు చేయండి, అన్నీ రికార్డు చేయండి, అసలు ఈ ఫిర్యాదులను, ఎఫ్ఐఆర్‌లను ఎందుకు కొట్టివేయరాదో కూడా చెప్పాలి" అంటూ ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ కోరారు. మణిపూర్‌లో పక్షపాతంతో కూడిన మీడియా కవరేజీ జరిగిందని పేర్కొంటూ ఆర్మీ ఎడిటర్స్ గిల్డ్‌కు లేఖ రాసింది. వెంటనే గిల్డ్ తన సీనియర్ జర్నలిస్టుల బృందాన్ని పంపి, క్షేత్రస్థాయిలో ఏం జరిగిందో కనుగొనాల్సిందిగా కోరింది. వారు ఒక నివేదికను సమర్పించారు. అది నిజమవచ్చు లేదా తప్పు కూడా కావచ్చు, కానీ అదంతా కూడా భావ ప్రకటనా స్వేచ్ఛకు సంబంధించినది కదా? మీరు దాన్నెలా తప్పుబడతారని చీఫ్ జస్టిస్ ప్రశ్నించారు. ఒకవేళ మీడియా వార్తలు తప్పు కావచ్చు, జర్నలిస్టులందరిపై ఐపిసిలోని సెక్షన్ 153 కింద అభియోగాలు నమోదు చేస్తారా? అని ప్రశ్నించారు. ఆ నివేదిక అంతా ప్రభుత్వ వ్యతిరేక కథనమని మీరు మీ ఫిర్యాదులో పేర్కొంటున్నారు. ఎడిటర్స్ గిల్డ్ తప్పు చేసిందని మీ భావన, అందుకే ప్రతి పేరాగ్రాఫ్‌లో కూడా తప్పు, తప్పు అని పేర్కొంటూ వస్తున్నారు. 'ఒక వ్యాసంలో తప్పుడు స్టేట్‌మెంట్ చేయడం సెక్షన్ 153ఎ కింద నేరం కాదు' అని చీఫ్ జస్టిస్ ఫిర్యాదుదారులకు స్పష్టం చేశారు. ఒక దశలో ఫిర్యాదుదారు తరఫున న్యాయవాది కృష్ణకుమార్ మాట్లాడుతూ, ఎడిటర్స్ గిల్డ్ తన నివేదికను ఉపసంహరించుకుంటే తన క్లయింట్‌కూడా వారి ఫిర్యాదులను ఉపసంహరించుకుంటారని సూచించారు. ఎట్టకేలకు తన ప్రతిస్పందనతో అఫిడవిట్ దాఖలు చేయడానికి ఆయన అంగీకరించారు. ఎడిటర్స్ గిల్డ్ తరఫున సీనియర్ న్యాయవాది శ్యామ్ ధావన్ మాట్లాడుతూ, తమ నివేదికకు వ్యతిరేకంగా వచ్చిన అభిప్రాయాలను కూడా నివేదికతో పాటే గిల్డ్ వెబ్ పేజ్‌లో ప్రచురిస్తామని చెప్పారు. రెండు రకాల అభిప్రాయాలు చదివిన తర్వాత ప్రజలు వారి అభిప్రాయాలను ఏర్పరుచుకోవచ్చని అన్నారు.

గ్రామాధ్యక్షురాలిగా గెలిచి రెండేండ్లు

చెన్నై : తమిళనాడులో ఎన్నికల్లో గెలిచిన ఒక దళిత మహిళ వివక్షను ఎదుర్కొంటున్నది. ఎన్నికల్లో గెలిచి రెండేండ్లు గడుస్తున్నప్పటికీ.. ఇప్పటికీ ఆమె ప్రమాణస్వీకారానికి నోచుకోక అన్యాయానికి గురవుతున్నది. 2021 అక్టోబర్‌లో తిరుపత్తూరు జిల్లాలోని నాయకనేరి పంచాయతీ అధ్యక్షురాలిగాడదళిత మహిళ ఎన్నికైంది. ఇందుకు సంబంధించిన ఎన్నికల సర్టిఫికేట్‌ను సైతం ఆమె ఎన్నికల అధికారుల నుంచి అందుకున్నది. ఇది జరిగి దాదాపు రెండేళ్లు దాటినా జిల్లా యంత్రాంగం మాత్రం ఆమెతో ఇంకా ప్రమాణ స్వీకారం చేయించలేదు. ఇది ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కే చర్యలో భాగమనీ, పెత్తందారీ కులమైన వన్నియార్ సామాజిక వర్గం ప్రాబల్యం ఉన్న పంచాయతీలో ప్రమాణం చేయడానికి ఆమెకు అనుమతి లభించటం లేదని దళిత సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ మహిళలకు పంచాయతీని రిజర్వ్ చేయాలనే ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరుతూ వన్నియార్ కులానికి చెందిన పంచాయతీ మాజీ అధ్యక్షుడు మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు.

శరవేగంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులు

- ఇంజినీరింగ్ అద్భుతంగా పేర్కొంటున్న నిపుణులు
- ఆసియాలోనే అతిపెద్ద పంపుహౌజ్
- కాళేశ్వరాన్ని మించిన బాహుబలి మోటర్లు
  వెట్‌రన్‌కు నేడు శ్రీకారం
- 80 శాతం ప్రాజెక్టు పూర్తి:ఉన్నతాధికారులు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

పాలమూరు-రంగారెడ్డి సాగునీటి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు శరవేగంగా సాగుతున్నాయి. మూడు జిల్లాల సాగు, తాగునీటి అవసరాలను తీర్చనున్న ఈ ప్రాజెక్టు పనులు, దాదాపు 89 శాతం పూర్తయ్యాయని సాగునీటి శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇది ఓ ఇంజినీరింగ్ అద్భుతం అని కూడా పేర్కొంటున్నారు. శ్రీశైలం బ్యాక్‌వాటర్స్ నుంచి రోజుకు రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోసేందుకు పాలమూరు-రంగారెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసింది. తద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని 12.30 లక్షల ఎకరాలకు సాగునీరందించడమే లక్ష్యంగా పనులు సాగుతున్నాయి. దాదాపు 19 నియోజకవర్గాల్లోని ఆయకట్టును వరప్రదాయిని కానుంది. 2015లో ప్రారంభమైన నిర్మాణాన్ని రెండు ఫేజులుగా చేపడుతున్నారు. పేజీ-1లో ప్రాజెక్టు ప్రధాన పనులు, ఫేజ్-2లో కాలువలు, ఇతర నిర్మాణాలు జరుగుతున్నాయి. తొలుత శంకుస్థాపన నాటికి ప్రాజెక్టుకు రూ. 35,200 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరుచేశారు. ఇప్పటివరకు సాగునీటి శాఖ అధికారిక సమాచారం ప్రకారం రూ.26,262 కోట్లు ఖర్చు చేశారు. కాగా ఈ ప్రాజెక్టు వ్యయం మూడు రెట్లు పెరుగుతుందనే వ్యాఖ్యానాలు ఇటు అధికారులు, అటు సాగునీటిరంగ నిపుణుల నుంచి వస్తున్నాయి.

ఈనెల 16న ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి వెట్‌రన్‌కు స్విచ్చాన్ చేయనున్నారు. ఇప్పటికే డ్రైరన్ పూర్తిచేసిన సంగతి తెలిసిందే. కాగా ప్రాజెక్టు పనులే పూర్తికాలేదనీ, పూర్తికాని ప్రాజెక్టుకు ప్రారంభోత్సవాలేంటనీ, పనులు నాణ్యంగా జరగడం లేదంటూ ప్రతిపక్షాల నుంచి అరోపణలు, విమర్శలు వస్తున్న తరుణంలో రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ 'ప్రెస్‌టూర్' నిర్వహించింది. హైదరాబాద్ నుంచి మూడు బస్సుల్లో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాను తీసుకెళ్లింది. ప్రాజెక్టును భౌతికంగా చూపించి వాస్తవాలను ప్రజలకు తెలియజేసే ఉద్దేశంతో ప్రాజెక్టు పరిధిలోని నార్లపూర్ పంపుహౌజ్, హెడ్‌రెగ్యులేటర్, యేదుల పంపుహౌజ్ , సర్జ్‌పూల్‌ను మీడియాకు చూపించింది.

ప్రాజెక్టుకు సంబంధించి సమాచారాన్ని మీడియాకు అందించింది. సాంకేతిక అంశాలను తెలియజేసింది. స్థానికంగా ఉన్న సాగునీటి చీఫ్ ఇంజినీర్ స్థాయి అధికారితో పాటు జిల్లా, డివిజనల్ అధికారులు మీడియాకు అందుబాటులో ఉన్నారు. అలాగే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు వి. శ్రీనివాస్‌గౌడ్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సైతం చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద సాగునీటి ఎత్తిపోతల పథకంగా అభివర్ణించారు . కాళేశ్వరం కంటే పాలమూరు ప్రాజెక్టుకు భారీ బాహుబలి మోటర్లను బిగిస్తున్నట్టు చెప్పారు.

వరప్రదాయిని కానుందా ?

ఈ ప్రాజెక్టు తెలంగాణకు వరప్రదాయిని కానుందని ఇటు అధికారులు, అటు మంత్రులు చెప్పారు. గులాబీ సర్కారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఆప్రాజెక్టులతో రాష్ట్రంలోని చాలా జిల్లాలకు సాగు, తాగునీటి సమస్య తీరనుంది. 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు, 1200 గ్రామాలకు తాగునీరు అందించేలా ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. దీని ద్వారా నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణ్‌పేట, రంగారెడ్డి, వికారాబాద్, నల్లగొండ జిల్లాలకు ప్రధానంగా లబ్దిచేకూరనుంది. 67.67 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో ఐదు రిజర్వాయర్లను నిర్మించారు. నాలుగు పంపుహౌజులతో 145 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం కలిగిన 34 పంపులను ఏర్పాటు చేశారు. యేదుల పంపుహౌజ్ దగ్గర ఆసియాలోనే అతిపెద్దదైన సర్జ్‌పూల్‌ను నిర్మించారు. అత్యధిక సామర్థ్యంగల పంపుల వినియోగంలో కాళేశ్వరం రికార్డును మించి 145 మెగావాట్ల సామర్థ్యంగల మహా బాహుబలి మోటర్లను వినియోగిస్తున్నారు. ప్రపంచంలోనే ఎక్కడా వినియోగించని విధంగా మూడు పంపుహౌజ్‌లూ ఉన్నట్టు సాగునీటిశాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

నీటిని ఎత్తిపోసే గరిష్ట ఎత్తు 672 మీటర్లు

ఈ ప్రాజెక్టు గరిష్టంగా 672 మీటర్లనుంచి నీటిని ఎత్తిపోయనుంది. మొత్తం పథకం సొరంగ మార్గం పొడవు 6167 కిలోమీటర్లు ఉందని అధికారులు చెప్పారు. ప్రధాన కాలువల పొడవు 915.47 కిలోమీటర్లు కాగా, ఇంకా అవి ప్రారంభం కాలేదు. తాగునీటి కోసం 7.15 టీఎంసీలు, పరిశ్రమల కోసం మూడు టీఎంసీలు, సాగునీటికి 79 టీఎంసీలు వినియోగించనున్నారు. తొమ్మిది పంపులను ఏర్పాటు చేయడం ప్రపంచంలో ఇదే మొదటిసారని అధికారులు అంటున్నారు. ఈ మోటర్లను దేశీయ దిగ్గజ కంపెనీ, కేంద్ర ప్రభుత్వ సంస్థ బీహెచ్ఈఎల్ తయారుచేయడం గమనార్హం. ప్రాజెక్టుకు సంబంధించి జలాశయాలు నార్లపూర్, యేదుల, వట్టెం, కరివెన, ఉద్దండపూర్ ప్రాంతాల్లో ఉన్నాయి.

90 మీటర్ల ఎత్తు..30 మీటర్ల వెడెల్పు యేదుల వెరసీ ఎదుల పంపుహౌజ్

యేదుల సర్జ్‌పూల్ సొరంగంలోకి వెళతుంటే అద్భుతంగానే అనిపించింది. లోపల వాతావరణం సాధారణంగానే ఉంది. ఆక్సిజన్ సమస్య రాకుండా సాంకేతికతను ఉపయోగించి పలు జాగ్రత్తలు తీసున్నారు. మొత్తం 9 ప్లస్ 1 మోటర్లతోప్రాజెక్టును డిజైన్ చేశారు. ఒకేసారి తొమ్మిది మోటర్లు ఫెయిల్ అయినా ఒకటి అదనంగా నడిచేలా ఏర్పాట్లు ఉన్నాయి. ఒకసారి మోటర్‌ను ఆన్ చేస్తే, దాదాపు ఏడాది నుంచి ఏడాదిన్నరపాటు ఆపకుండా రన్‌చేయవచ్చని స్థానిక ఇంజినీర్లు చెప్పారు. కాళేశ్వరం కంటే ఈ మోటార్లు చాలా పెద్దవని కూడా మీడియాకు వివరించారు. సర్జ్‌పూల్ సొరంగం 90 మీటర్ల ఎత్తులో, 30 మీటర్ల వెడల్పుతో నిర్మించారు. శనివారం వెట్‌రన్ నేపథ్యంలో సర్జ్‌పూల్‌ను పూర్తిగా నింపనున్నట్టు ఇంజినీర్లు తెలిపారు. ఒకసారి సర్జ్‌పూల్ నీటితో నిండాక మళ్లీ చూడటం కుదరనీ, ఇప్పుడే చూడాలని ఇంజినీర్లు పదే పదే సూచించారు. రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో మీడియా అంతా సర్జ్‌పూల్‌ను చూసేందుకు ఆసక్తికనపరిచారు.

రెండు ఫేజులు3

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును రెండు ఫేజులుగా విభజించారు. ఫేజు-1లో ప్రాజెక్టు ప్రధాన పనులు అంటే హెడ్‌రెగ్యులేటర్, టన్నెళ్లు, పంపుహౌజ్‌లు, సర్జ్‌పూల్, మోటర్లు ఉన్నాయి.

ఫేజు-2లో ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీ లైన్లు, లైనింగ్ పనులు ఉన్నాయి. ప్రస్తుతం ఫేజు -1 పనులు మాత్రమే 80 శాతం పూర్తయినట్టు సాగునీటి శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లు తెలిపారు. అలాగే మోటర్లల్లో తొమ్మిదికిగాను మూడు సిద్ధమైనట్టు వివరించారు. వెట్‌రన్ రోజు ఒక మోటరును ప్రారంభించనున్నారు. నార్లపూర్ పంపుహౌజ్ ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు రంగం సిద్ధం చేశారు. కోర్టు కేసులు, ఇతర సాంకేతిక అంశాల మూలంగా ఫేజు-2 పనులు ఆలస్యమయ్యాయి.కాగా ఇటీవల కేంద్ర ప్రభుత్వ అటవీశాఖ వాతావరణ అనుమతులకు సైతం ఇటీవలే సిఫారసు చేసింది.

అటవీ సమీప గ్రామాల్లో
పల్లె పశువుల వనాలకు ప్రాధాన్యత

అటవీ శాఖ రాష్ట్ర స్థాయి వర్క్‌షాపులో పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ప్రతీ అటవీ సమీప గ్రామాల్లో గడ్డి మైదానాలతో పల్లె పశువుల వనాల అభివృద్ధి ప్రాధాన్యత ఇవ్వబోతున్నట్టు రాష్ట్ర అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ఆర్.ఎం.డోబ్రియాల్ వెల్లడించారు. అన్ని జిల్లాల్లోనూ ఈ వనాలను ప్రయోగాత్మకంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో అటవీ శాఖ ఆధ్వర్యంలో అడవుల రక్షణ, నిర్వహణపై రెండో రోజూ రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ నిర్వహించారు. తెలంగాణకు హరితహారం, అర్బన్ ఫారెస్ట్ పార్కుల నిర్వహణ, అటవీ సంరక్షణ చట్టం, అభివృద్ధి పనులకు అటవీ భూముల మళ్లింపు, అటవీ రక్షణ– విజిలెన్స్, ప్రత్యామ్నాయ అటవీకరణ (కంపా), ఎకో టూరిజం, ప్రొడక్షన్ తదితర అంశాలపై చర్చించారు. సంబంధిత విభాగాల పర్యవేక్షకులుగా ఉన్న ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ద్వారా పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా డోబ్రియాల్ మాట్లాడుతూ.. హరితహారం విజయవంతం కోసం క్షేత్రస్థాయి పరిశీలన మరింత పెరగాలని సూచించారు. అర్బన్ ఫారెస్ట్ పార్కులు స్వయం సమృద్ధి సాధించి నిర్వహణ ఖర్చులు రాబట్టుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు, పర్యావరణ



ఔత్సాహికులతో నేచర్ క్లబ్బులు ఏర్పాటు చేసి వనదర్శిని కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాధ్యతాయుతమైన ఎకో టూరిజం అభివృద్ధి, నిర్వహణకు తగిన ప్రదేశాల ఎంపిక చేయాలని నిర్ణయించారు. ప్రాజెక్టులు, రోడ్ల కోసం అటవీ భూముల మళ్లింపు నిర్ణయాల విషయంలో అటవీ సంరక్షణ చట్టం, కొత్త కేంద్ర నిబంధనలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. గిరిజన గ్రామాలకు రోడ్లు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు వేగంగా అనుమతులివ్వాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫైబర్ నెట్ వర్క్ ఏర్పాటుకు కూడా ఆటంకాలు లేకుండా చూడాలని సూచించారు. ఇంకా సమావేశంలో అటవీ భూముల కచ్చితమైన సరిహద్దుల గుర్తింపు, అటవీ బ్లాక్‌ల నోటిఫికేషన్ ప్రకటన, ఫారెస్ట్ స్టేషన్ల ఏర్పాటు, కొత్త ఉద్యోగాల నియామకాలు, కలెక్టర్ల నేతృత్వంలో ఫారెస్ట్ ప్రొటెక్షన్ కమిటీల ఏర్పాటు, అటవీ రక్షణలో టెక్నాలజీ వినియోగం, తదితర అంశాలపై చర్చించారు. వర్క్‌షాపులో పీసీసీఎఫ్ (విజిలెన్స్) ఏలూసింగ్ మేరు, పీసీసీ ఎఫ్ (సోషల్ ఫారెస్ట్రీ) సువర్ణ, పీసీసీ ఎఫ్ (ఎఫ్‌సీఏ) ఎం.సీ. పర్గెయిన్, అదనపు పీసీసీఎఫ్‌లు వినయ్ కుమార్, సునీతా భగవత్, అన్ని అటవీ సర్కిళ్ల చీఫ్ కన్జర్వేటర్లు, కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్లు, అన్ని జిల్లాల ఫారెస్ట్ ఆఫీసర్లు, డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

వికలాంగుల సమస్యలపై
వచ్చే నెల 9న చలో హైదరాబాద్

- 39 అంశాలపై డిక్లరేషన్‌ను ప్రకటించిన ఎన్‌పీఆర్‌డీ
- రాజకీయ పార్టీల ఎన్నికల ప్రణాళికలో తమ సమస్యలు చేర్చాలి :ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

వికలాంగుల సమస్యలను పరిష్కరించటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందనీ, తక్షణ వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చే నెల 9న చలో హైదరబాద్ కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్టు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర కార్యదర్శి ఎం అడివయ్య తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కారాలయంలో వికలాంగులు ఎదుర్కొంటున్న 39 అంశాలపై వికలాంగుల డిక్లరేషన్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో అడివయ్యతో పాటు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. వెంకట్, కోశాధికారి ఆర్ వెంకటేష్, ఉపాధ్యక్షులు బోల్లేపల్లి స్వామి, సభ్యురాలు పి శశికళ ఉన్నారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ పెన్షన్ రూ.10 వేలకు పెంచాలనీ, వికలాంగుల కమిషన్ ఏర్పాటు చేసి, చైర్మెన్, సభ్యులను నియమించాలని డిమాండ్ చేశారు. శారీరక వికలాంగుల రోస్టర్ 10లోపు తగ్గించాలనీ, వారి సంక్షేమం, సాధికారత కోసం వికలాంగుల బంధు పథకం ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి జిల్లా కేంద్రంలో స్పెషల్ స్కూల్స్ ఏర్పాటు చేయాలంటూ డిమాండ్ చేశారు. సాధారణ ఎన్నికల్లో ఆయా రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికలో వికలాంగుల సమస్యలను పొందుపర్చాలని కోరారు.

డాక్టరేట్ సాధించిన గుమ్మడవల్లి వాసి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి గ్రామానికి చెందిన అత్తునూరి వెంకటరామి రెడ్డి, కుమారి దంపతుల కుమారుడు అత్తునూరి నాగిరెడ్డి హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్–ఐఐసీటీలో లోహ ఉత్ప్రేరక సమక్షంలో ఆల్కైన్‌ల క్రియాశీలత అను అంశం మీద విశేష పరిశోధనలు జరిపారు. ఆ పరిశోధనలకుగాను సీఎస్ఐఆర్–ఏసీఎస్ఐఆర్ సంయుక్తంగా నాగిరెడ్డికి డాక్టరేట్ ప్రధానం చేసింది. పేద కుటుంబానికి చెందిన డీఎస్ టీ–ఇన్‌స్పైర్ స్కాలర్‌షిప్‌ని పొందారు. రసాయన శాస్త్రం మీద ఉన్న మక్కువతో కష్టపడి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ పూర్తి చేశారు. ఈ సమయంలో యుజిసి అందించు మెరిట్ స్కాలర్‌షిప్ పొందడమే కాకుండా, ఐఐటీ కాన్పూర్‌లో రెండు నెలల ప్రాజెక్ట్ చేశారు. ఈ సమయంలో కర్బన సమ్మేళనాలు మరియు వాటి ఉపయోగాలు బాగా ఆకర్షించాయి. సీఎస్ఐఆర్ –ఐఐసీటీ హైదరాబాద్‌లో సీటు సంపాదించారు సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎమ్. శ్రీధర్ రెడ్డి దగ్గర 2018లో జాయిన్ అయి నిర్విరామంగా రోడియం, పెల్లాడియం ఉత్ప్రేరకాలని ఉపయోగించి ఆల్కైన్‌ల ద్విచక్ర, పాలిచక్ర సమ్మేళనాల అభివృద్ధి గురించి వివిధ పద్ధతులని కనిపెట్టారు.

ఆర్టిజన్లను, కన్వర్షన్లను పర్మినెంట్ చేయాలి

మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

= ఇందిరాపార్కు వద్ద తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ మహాధర్నా



ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద జరిగిన మహా ధర్నాలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి, పాలడుగు భాస్కర్ తదితరులు

నవతెలంగాణ- ముషీరాబాద్

విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న 23 వేల మంది ఆర్టిజన్లు, కన్వర్షన్లను పర్మినెంట్ చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 11 ప్రకారం కార్మికులకు కనీస వేతనం రూ.12000 ఇవ్వాలన్నారు. తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి, పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. తెలంగాణ ట్రాన్స్‌కో జెన్‌కో శాశ్వత ఉద్యోగులకు ఈపీఎఫ్, జీపీఎస్ సమస్య చాలా తీవ్రంగా ఉందని తెలిపారు. తెలంగాణ ట్రాన్స్‌కో -జెన్‌కో ఎన్‌పీడీపీఎల్ హైదరాబాద్, వరంగల్ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న 23 వేల మంది ఆర్టిజన్స్, కన్వర్షన్స్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. వరంగల్ బేస్‌గా ఉన్న ఎంపీడీపీఎల్ కంపెనీలో 1,536, ఎస్పీడీసీఎల్‌లో గల 53 మంది అన్‌మెన్స్ కార్మికులను ఆర్టిజన్స్‌గా గుర్తించాలన్నారు. పీస్‌రేట్ కార్మికులైన బిల్ కలెక్టర్లు, స్పాట్ బిల్లర్స్, ఎస్పీఎం, పీఏఎలుగా పనిచేస్తున్న కార్మికులకు జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనం రూ.12000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖ శాశ్వత ఉద్యోగులకు ఈపీఎఫ్ టు జీపీఎఫ్ సమస్య చాలా తీవ్రంగా ఉందన్నారు. విద్యుత్ సంస్థల్లో ప్రమోషన్స్ ఇవ్వడం లేదని, సీనియారిటీ ప్రకారం ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్‌పీడీసీఎల్ పరిధిలో 2011లో రిక్రూట్‌మెంట్ చేసిన జేఎల్ఎంలకు రావాల్సిన వేల రూపాయల ఏరియన్స్ ఇవ్వ కుండా యాజమాన్యం కాలయాపన చేస్తోందని, వెంటనే ఇవ్వాలని కోరారు. విద్యుత్ వినియోగదారుల సంఖ్య పెరుగుతున్న కారణంగా ఉద్యోగుల సంఖ్య తక్కు వగా ఉండటంతో మెరుగైన సేవలు అందడం లేదన్నారు. మరో 18 నుంచి 20 వేల మంది ఉద్యోగులను రిక్రూట్ చేయాల్సి ఉందని, వెంటనే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహా ధర్నాలో యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్య క్షులు ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వెంకటరాజు, ప్రసాద్ రాజు, ఆర్గనై జింగ్ సెక్రటరీలు సుధాకర్, రవీంద్ర ప్రసాద్, శశికళ బసవ రాజు, ఎస్పీడీసీఎల్ అధ్యక్ష కార్యదర్శులు చంద్రారెడ్డి, సత్యం, ఎన్పీడీసీఎల్ అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రజలే ఎర్రజెండాగా మారి.. సాయుధ పోరాటం

= చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య

నవతెలంగాణ-మంచిర్యాల

ప్రజలే ఎర్రజెండాగా మారి సాగించిన పోరుబాటే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో చార్వక ట్రస్ట్ భవనంలో శుక్రవారం తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. ఓవైపు స్వాతంత్ర్య సంబరాలు చేసుకుంటుంటే.. మరోవైపు తెలంగాణలో మా భూములు మాకు కావాలి అంటూ కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాయుధ రైతాంగ పోరాటం ఉవ్వెత్తున సాగిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కమ్యూనిస్టులపై, ప్రజలపైన దాడి చేయించిందన్నారు. ఇందులో 3వేల మందికి పైగా కమ్యూనిస్టులు అమరులయ్యారని తెలిపారు. మూడు లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసిన ఘన చరిత్ర తెలంగాణ సాయుధ పోరాటానిదని తెలిపారు. కమ్యూనిస్టుల పోరాటాన్ని తట్టుకోలేక నిజాం సర్కారు సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రాంతాన్ని భారతదేశంలో విలీనం చేసిందని వివరించారు. కానీ దీన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్ వక్రీకరించి ముస్లిం రాజుపై హిందువుల పోరాటంగా, విద్రోహదినంగా చిత్రీకరించేందుకు ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. ఇందులో భాగంగానే ఈ నెల 17న కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను ఆహ్వానించారని తెలిపారు. ఇక్కడ కూడా హిందూ, ముస్లింల మధ్య విభేదాలు పెట్టి అల్లర్లు సృష్టించాలని ప్రయత్నాలు సాగిస్తున్నారన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో మతోన్మాద చర్యలను తిప్పికొట్టే విధంగా ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, కార్యదర్శివర్గ సభ్యులు గోమాస ప్రకాష్, దుంపల రంజిత్ కుమార్, నాయకులు దూలం శ్రీనివాస్, బోడెంకి చందు, రవి, ఉమారాణి, ప్రేమ్ కుమార్, మహేష్, సరిత, రేణుక, భూదక్క, సమ్మక్క పాల్గొన్నారు.

ఆ రెండూ కాకుండా నేను రాజకీయ నాయకుడినయ్యా!

అమ్మకు డాక్టర్ కావాలని.. నాన్నకు ఐఏఎస్ కావాలని కోరిక..

రాజన్నసిరిసిల్ల జిల్లా మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్



సిరిసిల్లలోని బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

నవతెలంగాణ- సిరిసిల్ల రూరల్ / కరీంనగర్ / కొత్తపల్లి

'1993లో నేను బయాలజీ స్టూడెంట్‌గా ఉన్నప్పుడు ఎంసెట్ రాస్తే 1600 ర్యాంకు వచ్చింది.. అయినా మెడిసిన్ సీట్ రాలేదు. మా అమ్మకు నేను డాక్టర్ కావాలని, నాన్నకు ఐఏఎస్ కావాలనే కోరిక ఉండేది. ఆ రెండూ కాకుండా నేను రాజకీయ నాయకుడిని అయ్యాను' అని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో శుక్రవారం మెడికల్ కాలేజీని రాజధాని నుంచే సీఎం కేసీఆర్ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రారంభోత్సవ వేదికలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రయివేటు మెడికల్ కళాశాలల్లో ప్రతి సంవత్సరమూ 10వేల మంది విద్యార్థులు వైద్య విద్యను పూర్తి చేసి డాక్టర్లుగా బయటకు వస్తున్నారని చెప్పారు. దేవుని రూపంలో అత్యవసర పరిస్థితుల్లో ప్రాణం కాపాడే వైద్యున్ని ప్రజలు గౌరవిస్తారని, అంతటి ప్రాధాన్యతన ఉన్నదే వైద్య వృత్తి అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంపై ప్రత్యేక దృష్టిసారించి ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీని ప్రారంభించి పేదలకు మెరుగైన వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవ రెడ్డి, సెస్ చైర్మెన్ చిక్కాల రామారావు, రాష్ట్ర పవర్ లూం, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ గూడూరి ప్రవీణ్, టెస్కాబ్ చైర్మెన్ కొండూరి రవీందర్, రైతుబంధు సమితి అధ్యక్షులు గడ్డం నర్సయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్‌లు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశానికి వైద్యం అందించే స్థాయికి తెలంగాణ
బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్

'దేశానికి వైద్యం అందించే స్థాయికి తెలంగాణ ఎదిగింది. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని ప్రారంభించిన ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికత వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుంది' అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్ర శివారులోని కొత్తపల్లిలో ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీ తాత్కాలిక భవనాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి గంగుల మాట్లాడారు. గతంలో వైద్య విద్య కోసం చైనా, ఉక్రెయిన్, ఫిలిప్పీన్స్ తదితర దేశాలకు వెళ్లి చదివేవారని గుర్తు చేశారు. గతంలో 5 వైద్య కళాశాలలు ఉంటే, తెలంగాణ వచ్చిన తర్వాత ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాల ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. అంతకుముందు రేకుర్తి బ్రిడ్జి వద్ద మంత్రి జెండా ఊపి విద్యార్థుల ర్యాలీని ప్రారంభించారు. అనంతరం వైద్య కళాశాలలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, కలెక్టర్ బి.గోపి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్ సుంకే రవిశంకర్ పాల్గొన్నారు.

ఆలయ ట్రస్ట్ సభ్యుల కొత్త కార్యవర్గం ఏకగ్రీవం

హైదరాబాద్: చాదర్‌ఘాట్‌లోని శ్రీరామాలయం, కళ్యాణ మంటపము యొక్క ఆలయ ట్రస్ట్ సభ్యులు కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు శుక్ర వారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ ట్రస్టు అధ్యక్షులు, చైర్మెన్‌గా అంబర్ పేట్‌కు చెందిన కృష్ణ, ఆలయ ట్రస్టు ఉపాధ్యక్షులుగా కె.ఎం. సంతోష్, ఆలయ కార్యదర్శిగా కె.విజయసాయి, కోశాధికారిగా మహేష్, ఆలయ ట్రస్ట్ సంయుక్త కార్యదర్శిగా ఎం.ప్రతాప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ సభ్యుల కొత్త కార్యవర్గాన్ని మాజీ అధ్యక్షులు ఎం.బాగ్గయ్య, చెరుకు కిషన్, పి.రాజేందర్, పి.సాయిబాబా, ప్రేమ్‌కుమార్, శివకాంత్ తదితరులు పాల్గొని నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందించారు.



నిలోఫర్ ఆస్పత్రిలో చిన్నారి అదృశ్యం

- తల్లికి పరిచయమైన మహిళపై అనుమానం..!
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-మెహిదీపట్నం

హైదరాబాద్ నిలోఫర్ ఆస్పత్రిలో ఆరు నెలల చిన్నారి అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. పోలీసులు, బాలుడి తల్లి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన సల్మాన్- ఫరీదా దంపతులు గండిపేట ప్రాంతంలోని ఒక వ్యవసాయ క్షేత్రంలో సెక్యూరిటీ సిబ్బందిగా పని చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. నాలుగేండ్ల పెద్ద కుమారుడికి జ్వరం రావడంతో ఫరీదా గురువారం ఇద్దరు పిల్లలను తీసుకొని నీలోఫర్ ఆస్పత్రికి వచ్చింది. డాక్టర్ సలహా మేరకు పెద్ద కుమారుడిని ఆస్పత్రిలో అడ్మిట్ చేసి.. ఆరు నెలల చిన్న కుమారుడు ఫైజల్ ఖాన్‌ను ఎత్తుకుని వార్డు బయటికి వచ్చింది. ఈ క్రమంలో ఆమెకు ఒక మహిళ పరిచయమైంది. అనంతరం బాబుని ఆ మహిళ కొద్దిసేపు ఎత్తుకుంది. తర్వాత ఫరీదా భోజనం చేయడానికి బాబును వార్డులో పడుకోబెట్టి వెళ్లి 15 నిమిషాల తర్వాత తిరిగి రాగా బాలుడు కనిపించలేదు. చిన్నారి కోసం చుట్టుపక్కల అంతా వెతికినా దొరక్కపోవడంతో ఆమె గురువారం రాత్రి నాంపల్లి పోలీసులను ఆశ్రయించింది. తనతో మాట్లాడిన ఆ మహిళ కూడా కనిపించడం లేదని.. ఆమెపైనే అనుమానం ఉందని పోలీసులకు ఫరీదా తెలిపింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాబు ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

ఆర్ఎస్ఎస్, బీజేపీ అప్పుడున్నారా?

= కమ్యూనిస్టుల పోరాటాన్ని హైజాక్ చేయాలన్న వక్రబుద్ధి : సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన తెలంగాణ రైతాంగ పోరాట సమయంలో ఆర్ఎస్ఎస్, బీజేపీ ఎక్కడున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ సంఘ్‌పరివార్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం 75 వసంతాల వజ్రోత్సవాలలో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని గన్ పార్క్ ఎదుట హైదరాబాద్ జిల్లా సమితి ఏర్పాటు చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఛాయాచిత్ర ప్రదర్శనను సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్. బోస్, ఈ.టి. నరసింహ, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి. స్టాలిన్, రాష్ట్ర సమితి సభ్యులు బి. వెంకటేశం, ప్రముఖ సంఘసేవకులు మోటూరి కృష్ణ ప్రసాద్‌లతో కలసి నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి సాయుధ పోరాటాన్ని హైజాక్ చేసి, అది మత ప్రాతిపదికన జరిగిన పోరాటంగా చిత్రించాలన్న వక్రబుద్ధిని బీజేపీ ప్రదర్శిస్తున్నదని చెప్పారు. పోరాటం దేశ చరిత్రలోనే మరవలేని ఘట్టమని కొనియాడారు.

అప్పటి వరకూ విచారణకు పిలవొద్దు

= ఎమ్మెల్సీ కవితకు తాత్కాలిక ఊరట



న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కుంభకోణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు తాత్కాలిక ఊరట లభించింది. కవితకు ఇచ్చిన సమన్లను పది రోజులు వాయిదా వేస్తామని ఈడీ సుప్రీంకోర్టుకు తెలిపింది. దీంతో తదుపరి విచారణను సర్వోన్నత న్యాయస్థానం 26కు వాయిదా వేసింది. అప్పటి వరకు కవితను విచారణకు పిలవొద్దని స్పష్టం చేసింది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఈ ఏడాది మార్చి 11న కవితను ఈడీ ఢిల్లీలో విచారించింది. అనంతరం మరోసారి 16న తమ ముందు విచారణకు హాజరుకావాలని నోటీసులు ఇచ్చింది. దీంతో... ఈడీ నోటీసులను సవాల్ చేస్తూ మార్చి 14న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆమె తరఫున అడ్వకేట్ వందన సెఘల్ 105 పేజీలతో కూడిన రిట్ పిటిషన్(క్రిమినల్)ను దాఖలు చేశారు. తనపై ఎలాంటి బలవంతపు (అరెస్ట్ లాంటి) చర్యలు ఈడీ తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ పై గతంలో విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం, కేంద్ర మాజీ మంత్రి చిదంబరం భార్య నళిని చిదంబరం, వెస్ట్ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ వేసిన పిటిషన్లకు జత చేసింది. ఈ పిటిషన్లు శుక్రవారం జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సుధాన్షు ధులియా ద్విసభ్య ధర్మాసనం విచారించింది.

ఈ సందర్భంగా తొలుత కవిత తరపు సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి వాదనలు వినిపించారు. నళిని చిదంబరం కేసులో ఆమె విచారణకు రావాలని ఈడీ పట్టుబట్టలేదని, అలాగే తన క్లయింట్‌కు రక్షణ కల్పించాలని ధర్మాసనాన్ని కోరారు. ఎందుకు కవితకు ఇలాంటి ఆదేశాలను అమలు చేయలేమని ప్రశ్నించారు. కస్టమ్స్ యాక్ట్ సైతం మహిళలపై ఎలాంటి బలవంతపు చర్యను తీసుకోరాదని ఉందన్నారు. సీఆర్పీసీ సెక్షన్ 160, ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ)లు అన్ని విధాలుగా మహిళలకు రక్షణ కల్పిస్తున్నట్టు వివరించారు. బెయిల్ సెక్షన్, సెక్షన్ 45లు కూడా మహిళలకు కొన్ని సడలింపులు ఇస్తున్నాయన్నారు. ఈ విషయంలో క్లారిటీ వచ్చే వరకు ఈడీ పంపిన సమన్లను నిలుపుదల చేయాలని కోరారు. విక్రమ్ చౌదరి వాదనలపై అదనపు సొలిసిటర్ జనరల్ (ఎఎస్‌జీ) రాజు అభ్యంతరం వ్యక్తం చేశారు.

'కవిత ఇప్పటికే పలుమార్లు విచారణకు హాజరయ్యారు. ఒక వేళ ఆమె బిజీగా ఉంటే మరో పది రోజుల వరకు విచారణ తేదీని పొడగిస్తాం. అంతవరకు మాత్రం చేయగలం' అని కోర్టుకు నివేదించారు. ఈ వాదనలపై ధర్మాసనం స్పందిస్తూ... తదుపరి విచారణ వరకు కవితను విచారించొద్దని ఆదేశాలు జారీ చేయమంటారా? అని ప్రశ్నించింది. ఇందుకు ఎఎస్‌జీ బదులిస్తూ తదుపరి విచారణ తేది వరకు పది రోజుల పాటు విచారణను వాయిదా వేస్తామని స్పష్టం చేశారు. ఇరువైపు వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను సెప్టెంబర్ 26 వాయిదా వేస్తున్నట్టు వెల్లడించింది.

ఇక స్మార్ట్ అటెండెన్స్

= ఫేషియల్ రికగ్నేషన్‌తో విద్యార్థుల హాజరు = హైదరాబాద్ జిల్లాలో 694 బడులు

= 1.14లక్షల మంది విద్యార్థులు

= స్మార్ట్‌ఫోన్, ట్యాబ్ ద్వారా నమోదు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల చదువులపై దృష్టిపెట్టిన విద్యాశాఖ.. ఇకపై వారి అటెండెన్స్‌పై నజర్ పెట్టనుంది. ఇందుకోసం ఫేషియల్ రికగ్నేషన్ అటెండెన్స్‌ను (డీఎస్ఈ- ఎఫ్ఆర్ఎస్ఏ) అమలు చేయనుంది. ఈ యాప్ ద్వారా ప్రతిరోజూ ఎంతమంది విద్యార్థులు పాఠశాలలకు హాజరవుతున్నారు.. మధ్యాహ్నం ఎంత మందికి భోజనం పెడుతున్నారనే వివరాలతోపాటు విద్యార్థులు బడులకు హాజరు కాకున్నా.. రిజిస్టర్‌లో హాజరు వేయడం.. లేని విద్యార్థులను ఉన్నట్టు చూపెట్టడం, బోగస్ సంఖ్యను గుర్తించే అవకాశంతోపాటు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, స్కాలర్‌షిప్స్ వంటివి ఎంతమందికి అందించాలనే విషయంపై ఓ క్లారిటీ రానుంది. హైదరాబాద్ జిల్లాలో ఈనెల 11వ తేదీ నుంచి విద్యార్థుల ముఖాచిత్రాలను యాప్‌లో నమోదు చేసే ప్రక్రియ ప్రారంభమవ్వగా.. ఈనెల 20వ తేదీలోపు పూర్తి చేయనున్నారు. అనంతరం ఈ విధానం ద్వారా హాజరును అమలులోకి తీసుకురానున్నారు.

> **అవకతవకలకు చెక్..**
> **పక్కాగా పథకాల అమలు**

పాఠశాలల్లో పథకాల అమలులో పారదర్శకతతోపాటు అవకతవకలకు చెక్ పెట్టేందుకు ఫేషియల్ అటెండెన్స్‌ని అమలు లోకి తెచ్చారు. విద్యార్థి ముఖంలోని కనుబొమ్మలు, పెదాలు, ముక్కు, తదితర అవయవాలను స్కాన్ చేస్తారు. ఉపాధ్యాయుల వద్ద ఉన్న ఆండ్రాయిడ్ మొబైల్స్, ట్యాబ్ ద్వారా విద్యార్థుల ముఖచిత్రాలను స్కాన్.. రిజిస్టర్ చేసి హాజరు నమోదు చేస్తారు. మండల, జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులకు క్షణాల్లో ఈ వివరాలన్నీ చేరతాయి. ఎంత మంది విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యారు. హాజరు శాతం తదితర వివరాలు ఆన్‌లైన్‌లో కనిపిస్తాయి. ఈ యాప్ వినియోగంపై ఇప్పటికే విద్యాశాఖాధికారులు పాఠశాలల హెచ్ఎంలకు అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 694 ప్రభుత్వ పాఠశాలలుండగా.. యూడైస్ ప్రకారం 92,623 మంది విద్యార్థులు విద్యనభ్య సిస్తున్నారు. ఇప్పటివరకు 34,247 మంది విద్యార్థుల ముఖ చిత్రాలను స్కాన్ చేసి యాప్‌లో నమోదు చేశారు. మిగతా విద్యార్థుల వివరాలు ఈ నెల 20లోపు పూర్తిచేయనున్నారు.

ఈ నెల 20 వరకు పూర్తి..

ఫేషియల్ యాప్ ద్వారా విద్యార్థుల రిజిస్ట్రేషన్ ఈనెల 11 నుంచి నగరంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించాం. ఈ ప్రక్రియలో హెచ్ఎం లకు ఎమైనా సాంకేతిక సమస్యలు వస్తే హెల్ప్‌లైన్ ద్వారా పరిష్కరిస్తున్నాం. ఇప్పటికే రిజిస్టరైనా విద్యార్థుల హజరును ఒక్క క్లిక్‌తో యాప్ ద్వారా నమోదు చేయాల్సిందిగా ఆదేశాలిచ్చాం.

- ఎస్.రజిత, కో-ఆర్డినేటర్, హైదరాబాద్ జిల్లా.

ఒక్క క్లిక్‌తో.. తరగతి గది హాజరు

గూగుల్ ప్లేస్టోర్ నుంచి 'డీఎస్ఈ-ఎస్ఆర్ఎస్' పేరిట ఉన్న ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఉపయో గించి లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. విద్యా ర్థుల రిజిస్ట్రేషన్, హాజరు, డిటేల్ రిపోర్టు అనే ఆప్షన్లు ఉంటాయి. ఓ తరగతి గదిలో ఉన్న విద్యార్థుల వివరాలన్నీ యాప్‌లో నమోదవుతాయి. ఒక్కో విద్యార్థి పేరు క్లిక్ చేస్తే కెమెరా ఓపెన్ అవుతుంది. విద్యార్థి ముఖం రౌండ్ సర్కిల్లో ఉండేలా చూడడం తో పాటు ముఖం చుట్టూ ఎరుపు నుంచి ఆకుపచ్చ రంగు వస్తే హాజరు ఒకే అయినట్టే.


బోగస్ సంఖ్యకు అడ్డుకట్ట

రాష్ట్రంలో 14 జిల్లాల్లో బయోమెట్రిక్ హాజరు అమలులో ఉంది. కానీ హైదరాబాద్ జిల్లాలో అమలులో లేదు. వలస కుటుంబాలు, ప్రయివేట్ పాఠశా లలు ఎక్కువగా ఉండటం వల్ల ఇక్కడ ప్రభుత్వ విద్యార్థుల సంఖ్య మారుతూ ఉంటుంది. ఈ క్రమంలో విద్యార్థుల హాజరు కచ్చితత్వాన్ని నిర్ధారిం చేందుకు ఫేస్ యాప్‌ను ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చింది. ఈ ఫేషియల్ అటెండెన్స్ ద్వారా విద్యార్థులు పేర్లు ఒక్కటికన్నా ఎక్కువ పాఠశాలల్లో ఉండటాన్ని అరికట్టొచ్చు. దీని ద్వారా ప్రతిరోజూ ఒక పాఠశాల, మండలంలో ఎంతమంది విద్యార్థులు హాజరవుతున్నారనే విషయం తెలుస్తుంది. అలాగే మధ్యాహ్న భోజనం పథకం, యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోటు బుక్స్, స్కాలర్‌షిప్‌లో అవకతవకలు జరిగే విషయం సైతం సులువుగా తెలియనుంది. హాజరుకాని విద్యార్థుల స్థానంలో అటెండెన్స్ వేసి.. టీచర్ పోస్టులు తగ్గకుండా చూస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త హాజరు విధానం బోగస్ సంఖ్యను ఇట్టే గుర్తించి చెక్‌పెట్ట నుంది. ఉపాధ్యాయులకు సైతం త్వరలో ఈ యాప్ ద్వారా హాజరు నమోదు చేయనున్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

= రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల ఆందోళనలు = నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



టీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీన ప్రక్రియ పూర్తికాకముందే కార్మికుల వేతన ఒప్పందాలు, డిఏ బకాయిలు, బాండ్ డబ్బులపై స్పష్టత ఇవ్వాలని ఆర్టీసీ కార్మికులు డిమాండ్ చేశారు. టీఎస్ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు, యూనిట్ల వద్ద కార్మికులు డిమాండ్లతో కూడిన నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపారు. ఈ ఆందోళనల్లో పాల్గొన్న కార్మికులకు జేఏసీ చైర్మెన్ కే రాజిరెడ్డి, కన్వీనర్ వీఎస్ రావు, కో కన్వీనర్ యాదయ్య ఉద్యమాభివందనాలు తెలిపారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనానికి గవర్నర్ ఆమోదం తెలపడాన్ని స్వాగతిస్తున్నామనీ, అయితే దానికంటేముందు పరిష్కారం కావల్సిన సమస్యలు అనేకం ఉన్నాయని వారు వేర్వేరుగా విడుదల చేసిన ప్రకటనల్లో ప్రస్తావించారు. 2017, 2021 వేతన ఒప్పందాలు వెంటనే ప్రకటించాలనీ, 2013 వేతన ఒప్పందం బకాయిలుకు ఇచ్చిన బాండ్స్ డబ్బులు ఇవ్వాలనీ, సీసీఎస్‌కు యాజమాన్యం చెల్లించాల్సిన రూ.1,078 కోట్లు చెల్లించాలనీ, 2023 జులై డిఏ వెంటనే ప్రకటించి, 170 నెలల బకాయిలు కూడా చెల్లించాలని కోరారు. పీఎఫ్, ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ ట్రస్టుల బకాయి సొమ్ములు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించకుండా విలీన ప్రక్రియ పూర్తయితే ఆర్టీసీ కార్మికులు ఆర్థికంగా చాలా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించక పోతే "చలో ఇందిరా పార్క్" ఆందోళన నిర్వహిస్తామనీ, కార్మికులు దాన్ని కూడా జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఆందోళనల్లో ఖమ్మం రీజియన్‌లో పాటి అప్పారావు (ఈయూ), సుధాకర్ (ఎస్‌డబ్ల్యూఎఫ్), ప్రధాన కార్యాలయం వద్ద గంగాధర్, సోమన్న, వరంగల్‌లో రాంచందర్, ఎల్లయ్య, ఆదిలాబాద్‌లో ఎమ్‌బీ రావు, కరీంనగర్‌లో శ్రీనివాస్, నల్గొండలో సుధాకర్, నర్సింహా, మహబూబ్‌నగర్‌లో ప్రభాకర్, వీరాంజనేయులు, గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లో జీఆర్ రెడ్డి, కృష్ణ, ప్రకాష్ నాయకత్వం వహించారు.

తెలంగాణ స్ఫూర్తితో దేశమంతటా మొక్కలు నాటాలి

= గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో ప్రపంచ ప్రఖ్యాత పర్యావరణవేత్త ఎరిక్ సోల్హీమ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణకు హరితహారం కార్యక్రమం ద్వారా ఏడు శాతం కొత్తగా అటవీ విస్తీర్ణం పెరగడం అద్భుతమనీ, ఇదే స్ఫూర్తితో దేశంలోని మిగతా రాష్ట్రాల్లోనూ మొక్కలను పెంచాలని ఐక్యరాజ్యసమితి ఎన్విరాన్‌మెంటల్ ప్రోగ్రాం మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, నార్వే మాజీ మంత్రి, గ్రీన్ బెల్ట్ అండ్ రోడ్ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకులు, పర్యావరణవేత్త ఎరిక్ సోల్హీమ్ పిలుపునిచ్చారు. అందరూ కలిసి పనిచేస్తే భూమిపై సాధించలేనిదంటూ లేదనే తన ఆశయానికి గ్రీన్ ఇండియా ఛాలెంజ్ నిర్వాహకులు, ఎంపీ జోగినిపల్లి సంతోశ్‌కుమార్ ప్రతిరూపంగా కనిపించారని కొనియాడారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బేగంపేటలో సంతోశ్‌కుమార్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సోల్హీమ్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ నియంత్రణ కోసం కార్యక్రమాల్ని రూపొందించి అమలు చేయడం చాలా సంతోషించదగ్గ విషయమన్నారు.

ఆర్టీసీ 'జూనియర్ అసిస్టెంట్' నోటిఫికేషన్ నిలుపుదల

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్‌ఆర్టీసీలో జూనియర్ అసిస్టెంట్ క్యాలిపై పరీక్ష కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌ను యాజమాన్యం నిలుపుదల చేసింది. ఈ పరీక్షపై అనేక అభ్యంతరాలు, విజ్ఞప్తులు వెల్లువెత్తిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఈ నోటిఫికేషన్‌లో మార్పులు కోరుతూ టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) కూడా యాజమాన్యానికి వినతిపత్రం సమర్పించింది. దీనిపై ఆర్టీసీ కార్మికులకు అవగాహన కల్పించడంలో భాగంగా ఈనెల 17న మధ్యాహ్నం 1 గంటకు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవగాహనా సమావేశాన్ని కూడా ఏర్పాటు చేసింది. దానికంటే ముందే యాజమాన్యం నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకుంది. అయితే భవిష్యత్ అవసరాల కోసం ఎస్‌డబ్ల్యూఎఫ్ అవగాహనా సమావేశాన్ని యథాతథంగా నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు తెలిపారు. ఆర్టీసీ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

శతాబ్దికే అతి పెద్ద జోక్

- కేంద్రమంత్రి ఆర్కే సింగ్ వ్యాఖ్యలపై మంత్రి జగదీశ్‌రెడ్డి ఫైర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణకు ఆర్థిక స్థోమతలేనందుకే కేంద్రం నుంచి రుణాలివ్వట్లేదంటూ కేంద్రమంత్రి ఆర్కే సింగ్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఆర్కే సింగ్ వ్యాఖ్యలు శతాబ్ది కాలంలోనే అతిపెద్ద జోక్ అని కొట్టిపడేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని టీఎస్ జెన్కో కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. తీసుకున్న రుణాలుతిరిగి చెల్లించడంలో దేశంలోనే ముందున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని స్పష్టం చేశారు. రాష్ట్రానికి ఇవ్వాల్సిన వాటా ఇవ్వకుండా, ఇచ్చే ఆర్థిక సంస్థలను భయపెడుతున్నది దుర్మార్గమైన కేంద్ర ప్రభుత్వమేనని విమర్శించారు. రైతుల మోటార్లకు మీటర్లు పెట్టాలని చెప్పలేదని ఆర్కేసింగ్ అనటం పచ్చి అబద్ధమన్నారు. మీటర్లు పెట్టనందుకే నిధులు ఆపుతున్నామని కేంద్ర ప్రభుత్వం పంపిన ఉత్తరాలను ఎన్నోసార్లు ప్రజల ముందు ఉంచిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రధాని మోడీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో కరెంట్ కోతలే లేవన్నది పచ్చి అబద్ధమన్నారు. రాత్రిపూట కరెంటు వాడితే సర్ ఛార్జ్ విధిస్తామని కేంద్ర మంత్రి హోదాలో ఆర్కేసింగ్ చేసిన వ్యాఖ్యలు నిజం కాదా? అని ప్రశ్నించారు. ఎవరెన్ని ఆటంకాలు సృష్టించినా రైతులకు 24 గంటల కరెంటు ఇచ్చి తీరుతామన్నారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి ఏ ఒక్క సంస్థకైనా ఎక్కడ పేమెంట్ ఆలస్యమైందో ఆర్కే సింగ్ చూపించాలని సవాల్ విసిరారు.

బిర్యానీ తిని వెళ్లండి... ప్రజల్ని మభ్యపెట్టకండి

- సీడబ్ల్యూసీ సమావేశాలపై ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హైదరాబాద్‌లో జరిగే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశానికి వచ్చే అతిథులు బిర్యానీ తిని వెళ్లాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎద్దేవా చేశారు. అతిథులుగా రాష్ట్రానికి ఎవరొచ్చినా గౌరవిస్తామనీ, సోనియా, రాహుల్‌గాంధీ సహా ఈ సమావేశాలకు వచ్చే వివిధ రాష్ట్రాల ప్రతినిధుల్ని తాము అలాగే చూస్తున్నామని చెప్పారు. అంతేతప్ప, ప్రజల్ని మభ్యపెట్టి వెళ్లొద్దని వ్యాఖ్యానించారు. బీజేపీతో కాంగ్రెస్‌కు అవగాహన కుదిరినందునే సోనియా, రాహుల్‌పై పెట్టిన నేషనల్ హెరాల్డ్ ఈడీ కేసులు ఏడాదిగా ముందుకు సాగట్లేదని ఆరోపించారు. కాంగ్రెస్‌పార్టీ ఒక్కో చోట ఒక్కో విధానం అమలు చేస్తున్నదనీ, ఒక రాష్ట్రంలో కమ్యూనిస్టులతో పొత్తు పెట్టుకొని, మరో రాష్ట్రంలో అవే పార్టీలను వ్యతిరేకిస్తుందన్నారు. ఒక ప్రాంతంలో ఆప్‌తో కొట్లాడుతూ.. మరో చోట అదే పార్టీతో పొత్తు పెట్టుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలిత రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో అదానీకి రెడ్ కార్పెట్ వేసి స్వాగతం పలుకుతూ.. ఇతర రాష్ట్రాల్లో వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. 20 ఏండ్లుగా పెండింగులో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లుపై సోనియా, రాహుల్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

అభివృద్ధిలో మనమే ఆదర్శం

- ఇంజినీర్స్ డేలో విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రాభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి అన్నారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణే అనీ, కేవలం 9 ఏండ్లలోనే ఈ విజయాన్ని సాధించగలిగామని చెప్పారు. తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 163వ జన్మదినాన్ని పురస్కరించుకొని 56వ ఇంజనీర్స్ డే ని శుక్రవారంనాడిక్కడి టీఎస్‌జెన్‌కో శక్తి బిల్డింగ్ ఆడిటోరియంలో నిర్వహించారు. టీఎస్-ఎస్పీడీసీఎల్, టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎమ్‌డీలు జీ రఘుమారెడ్డి, ఏ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు. మంత్రి జగదీశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యుత్ ఒక్కటే కాకుండా అన్ని జిల్లాల్లో మెడికల్ కాలేజీలు, గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి, దేశానికి ఆదర్శంగా ఉన్నామన్నారు. ఈ ప్రగతి సీఎం కేసీఆర్ దూరదృష్టి వల్లే సాధ్యమైందని చెప్పారు. సీఎమ్‌డీలు మాట్లాడుతూ ఉద్యోగుల్లోని నిబద్ధత, క్రమశిక్షణమే రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నిలిపిందని అన్నారు. కార్యక్రమంలో టీఎస్‌పీఈఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సదానందం, పీ రత్నాకరరావు, ఉపాధ్యక్షులు వెంకట్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్‌లోకి తుమ్మల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం కాంగ్రెస్‌లో చేరనున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే, అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు శుక్రవారం హైదరాబాద్ మాదాపూర్‌లోని తుమ్మల నివాసానికి వెళ్లారు. పార్టీలో చేరాలంటూ ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యేలు వేముల వీరేశం, యెన్నం శ్రీనివాసరెడ్డి, బీజేపీ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరనున్నారు.

50 లక్షలు పెనాల్టీ కట్టండి

- రియల్ ఎస్టేట్ సంస్థలకు 'రెరా' జరిమానా



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

నిబంధనలు ఉల్లంఘించి, రియల్ ఎస్టేట్ బిజినెస్ నిర్వహిస్తున్న సంస్థలపై రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) కన్నెర్ర చేసింది. నోటీసులు ఇచ్చినా పట్టించుకోకుండా, నిర్ణీత గడువులోపు సమాధానాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన జయత్రి (జయా గ్రూప్) ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఏజీఎస్ శ్రీనివాసం ప్రాపర్టీస్ ప్రయివేటు లిమిటెడ్ (ఏజీఎస్ గ్రూప్) ఈపీఎల్ సంస్థలకు రూ.50 లక్షలు అపరాధరుసుం విధించింది. రెరా చైర్మెన్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ నేతృత్వంలోని కమిటీ శుక్రవారం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. 'రెరా' నిబంధనలు ఉల్లంఘించి ఈ సంస్థలు అడ్వర్టయిజింగ్, మార్కెటింగ్ కార్యకలాపాలు చేపట్టినందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన తెలిపారు. దీనికి సంబంధించి తాము గతంలోనే షోకాజ్ నోటీసులు ఇచ్చామనీ, వాటికి ఆయా సంస్థలు సమాధానాలు చెప్పలేదని వివరించారు. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు తమ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించడానికి ముందుగా 'రెరా' లో విధిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలనీ, 'రెరా' రిజిస్ట్రేషన్ లేకుండా ప్రకటనలు జారీ చేస్తూ మార్కెటింగ్ అడ్వర్ టైజింగ్ కార్యకలాపాలు నిర్వహించే సంస్థలు, ప్రాజెక్టులపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

బాబు అరెస్టుపై 'ఓట్ల' మాటలు..!

రాజకీయ లబ్ది కోసం బీఆర్ఎస్, కాంగ్రెస్ ఆరాటం

- ఇరుపార్టీల అధినాయకత్వం దాటవేత ధోరణి
- ఉమ్మడి ఖమ్మం జిల్లా నేతల 'స్కిల్స్' ప్రదర్శన
- టీడీపీ ఫ్యాన్స్ ఓట్ల కోసం లేని ప్రేమ ఒలకబోత



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేత చంద్రబాబు అరెస్టును రాజకీయ లబ్ది కోసం వాడుకునేందుకు తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు విశ్వయత్నాలు చేస్తున్నారు. ఆయా పార్టీల అధినాయత్వం బాబు అరెస్టుపై స్పందించేందుకు విముఖత వ్యక్తం చేసినా ఓట్ల వేటలో భాగంగా ఇరు పార్టీల జిల్లా నాయకత్వం మాత్రం లేని ప్రేమను ఒలకబోస్తున్నారు. పోటాపోటీగా ప్రకటనలు చేస్తూ టీడీపీ అభిమానుల ఓట్లకు గాలం వేస్తున్నారు.

చంద్రబాబు అరెస్టుపై ఇటు బీఆర్ఎస్, అటు కాంగ్రెస్ అధినాయకత్వం దాటవేత ధోరణితో మాట్లాడుతోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కల్వకుంట్ల తారకరామారావు, ఆర్థికమంత్రి హరీశ్‌రావు సభా వేదికలపై గానీ, ప్రెస్‌మీట్‌లలో గానీ ఈ ప్రస్తావనే తేవట్లేదు. విలేకరులు అడిగినా 'పక్క రాష్ట్రాల విషయాలు మనకెందుకు' అంటున్నారు. చంద్రబాబుతో సుదీర్ఘ రాజకీయ అనుబంధం ఉన్న టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సైతం కాంగ్రెస్‌లోకి వచ్చాక బాబు ఊసు ఎత్తడం లేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి కాంగ్రెస్ రాష్ట్రస్థాయి కీలకనేత, సీఎల్పీ లీడర్ మల్లు భట్టివిక్రమార్క సైతం దీనిపై స్పందించ లేదు. విజయభేరి సన్నాహక సభ సందర్భంగా ఖమ్మంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోనూ బాబు అరెస్టుపై భట్టిని ప్రశ్నిస్తే దాటవేత ధోరణిలో మాట్లాడకొచ్చారు. కానీ ఏపీ సరిహద్దున ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల ప్రకటనలు మాత్రం చర్చకు దారితీస్తున్నాయి. ఓట్ల రాజకీయాల్లో భాగంగా బాబుపై లేనిప్రేమను ఒలకబోస్తున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్, బీఆర్ఎస్, కమ్యూనిస్టు పార్టీలతో పాటు ఇప్పటికీ టీడీపీకి బలమైన క్యాడర్ ఉంది. ఈ నేపథ్యంలో బాబు అరెస్టు ఘటనను అడ్డుపెట్టుకొని ఎలాగైనా తెలుగుదేశం అభిమానుల ఓట్లను కొల్లగొట్టాలనే ప్రయత్నాలు విపరీతంగా సాగుతున్నాయనే చర్చ మొదలైంది.

టీడీపీ ఓట్లపై బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల కన్ను..

ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాపై ఏపీ రాజకీయ పరిణామాల ప్రభావం ఉంటుంది. చంద్రబాబుకు ఇక్కడ అభిమానులు భారీగానే ఉన్నారు. నేతలు పార్టీ మారినా అభిమానులు మాత్రం ఇప్పటికీ చాలామందే ఉన్నారు. ఈ నేపథ్యంలో బాబు అరెస్టుపై 'సానుభూతి'ని ప్రకటించి టీడీపీ అభిమానుల ఓట్లను కొల్లగొట్టాలనే ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయనే చర్చ సాగుతోంది.

ఆలస్యం.. అపహాస్యం..

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడ్ని స్కిల్ డెవలప్‌మెంట్ అక్రమాల ఆరోపణల కేసులో ఏపీ సీఐడీ పోలీసులు ఈనెల 9వ తేదీన అరెస్టు చేస్తే.. తీరుబడిగా ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు స్పందిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అభిమానం ఉంటే అరెస్టయిన వెంటనే ఖండిస్తూ ప్రకటనలు చేసేవారని, ఓటు బ్యాంకు రాజకీయాల్లో భాగంగానే ఆలస్యంగా స్పందిస్తున్నారని టీడీపీ శ్రేణులు విమర్శిస్తున్నాయి. బాబు అరెస్టయిన మూడు, నాలుగు రోజుల తర్వాత సత్తుపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య ఖండించారు. ఆ తర్వాత రెండు రోజులకు గురువారం మమత హాస్పిటల్ సిల్వర్ జూబ్లీ మీటింగ్‌లో మంత్రి పువ్వాడ స్పందించారు. దాదాపు వారంరోజుల తర్వాత అశ్వారావుపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు ప్రకటన చేశారు. దీనికి ఒకటి, రెండు రోజుల ముందు మధిర బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమలరాజ్ ఖండించారు. ఇక బీఆర్ఎస్ వీడి కాంగ్రెస్‌లోకి చేరేందుకు సమాయత్తం అవుతున్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం ఆలస్యంగానే ప్రకటన చేశారు. తాజాగా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరులు శుక్రవారం ప్రకటన చేయడం చర్చనీయాంశంగా మారింది.

చర్చనీయాంశంగా పొంగులేటి అనుచరుల ప్రకటన..

చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ మాజీ ఎంపీ, కాంగ్రెస్ ఎన్నికల కమిటీ కో చైర్మెన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరులు మువ్వా విజయ్‌బాబు, తుళ్లూరి బ్రహ్మయ్య పేరుతో శుక్రవారం వెలువడిన ప్రకటన తీవ్ర చర్చకు దారితీసింది. సీఎల్పీ లీడర్ మల్లు భట్టివిక్రమార్క బాబు అరెస్టుపై వెంటనే స్పందించారని, దీనికి తాము కట్టుబడి ఉన్నామంటూ ఓ ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ నేతలు ఆలస్యంగా స్పందిస్తున్నారని విమర్శలు చేశారు. కానీ భట్టి అనుయాయులు మాత్రం తమ నేత ఎక్కడా ప్రకటన చేయలేదని అంటున్నారు. ఈ విషయాన్ని పక్కనబెడితే ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయ గురువుగా భావించే పొంగులేటి కార్యాలయం నుంచి బాబు అరెస్టును ఖండిస్తూ ప్రకటన వెలువడటం చర్చనీయాంశమైంది. కొద్దిరోజుల క్రితమే ఎన్టీఆర్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసేందుకు పొంగులేటి వెళ్లారు. ఆ క్రమంలో ఆయన అనుచరులపై 'గులాబీ' టీడీపీ అభిమానులు దాడి చేశారు. శ్రీనివాసరెడ్డి పూలమాల వేసి వెళ్లాక విగ్రహాన్ని సైతం పాలతో శుద్ధి చేశారు. కాగా పొంగులేటి అనుచరులు బాబు అరెస్టును ఖండిస్తూ ప్రకటన చేయడంపై పొంగులేటి అనుచర గ్రూపులోనూ పలువురు వ్యతిరేకిస్తున్నారు.

'డబుల్' ఇండ్లలో సౌకర్యాల బాధ్యత మాదే..

- పేదలు గొప్పగా ఉండాలనదే సీఎం కేసీఆర్ విజన్
- రెండో విడతలో వికలాంగులు,ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ : మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- 24 నియోజకవర్గాల్లో 11,700 లబ్దిదారుల ఎంపిక.. 21న పంపిణీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో మౌలిక సౌకర్యాలు కల్పించే బాధ్యత ప్రభుత్వానిదేనని పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. హైదరాబాద్ కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో శుక్రవారం రెండో విడతలో భాగంగా ర్యాండమైజేషన్ సాఫ్ట్‌వేర్ విధానం ద్వారా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ఆన్‌లైన్ డ్రా నిర్వహించి లబ్దిదారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. పేదలు ఆత్మగౌరవంతో జీవించాలనే ఉద్దేశంతోనే డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని చెప్పారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో రెండో విడతగా 11,700 మంది లబ్దిదారులను ఎంపిక చేసినట్టుగా తెలిపారు. రెండో విడత ప్రక్రియలో వికలాంగులు, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించామన్నారు. వికలాంగులకు 470, ఎస్సీలకు 1,923, ఎస్టీలకు 655 ఇండ్లు కేటాయించగా.. ఇతరులకు 8,652 కేటాయించినట్టు వివరించారు. కేటాయింపుల్లో ఎవరి జోక్యం లేకుండా పారదర్శకంగా లబ్దిదారులను ఎంపిక చేసినట్టు చెప్పారు. పేద, మధ్య తరగతి ప్రజలు గొప్పగా బతకాలనే ఉద్దేశంతో డిమాండ్ ఉన్న ఏరియాల్లో ఇండ్లు కట్టించి పంపిణీ చేస్తున్నామన్నారు. ఇండ్లు రాని వారు ఆందోళన చెందొద్దని, చివరి విడత వరకు ఆగాలని దరఖాస్తుదారులను మంత్రి కోరారు. మూసీ పరివాహక ప్రాంతాల్లోని వారికి 3 లేదా 4వ విడతలో ఇండ్లు ఇవ్వాలనే యోచనలో ఉన్నామన్నారు. మానవ ప్రయత్నంతో లాటరీ ద్వారా కేటాయింపు చేసే ప్రక్రియకన్నా ఇది ఎన్నో రెట్లు నాణ్యత, పారదర్శకత, జవాబుదారీతనాన్ని సూచిస్తుందన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్, ఎన్‌ఐసీ సిబ్బంది ప్రధాన భూమిక పోషించారని, వారికి అభినందనలు తెలిపారు.

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. రెండో విడత ఇండ్ల కేటాయింపు పారదర్శకంగా జరగాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్‌ఐసీ సహకారంతో రాండమైజేషన్ సాఫ్ట్‌వేర్ ద్వారా ప్రజాప్రతినిధుల సమక్షంలో లబ్దిదారుల ఎంపిక చేయడం జరిగిందన్నారు. మంత్రులు మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, నగర మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్, అరికెపూడి గాంధీ, దానం నాగేందర్, ముఠా గోపాల్, ప్రకాశ్ గౌడ్, ఎమ్మెల్సీలు ప్రభాకర్, వాణీదేవి, మీర్జా రహమత్ బేగ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రంగారెడ్డి కలెక్టర్ హరీశ్, మేడ్చల్ కలెక్టర్ అమోయ్ కుమార్, హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్, డీఆర్వో వెంకటాచారి, హైదరాబాద్ ఆర్డీవోలు సూర్యప్రకాశ్, రవికుమార్, ఎన్‌ఐసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిజం నిప్పులాంటిది

- త్వరలోనే వెలుగులోకి వస్తుంది
- ఏపీ సర్కారుకు పయ్యావుల కేశవ్ హితవు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెలుగుదేశం అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడును అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఏపీ టీడీపీ ప్రధాన కార్యదర్శి పయ్యావుల కేశవ్ చెప్పారు. ఏపీ సర్కారు, సీఐడీ ఇష్టానుసారం వ్యవహరించాయని అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ని ఎన్టీఆర్ భవన్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో గత వారం రోజుల క్రితం చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. కోర్టును సైతం తప్పు దోవ పట్టించి ఏపీ సీఐడి ప్రజల ముందుకు వచ్చి అసత్యాలను విపరీతంగా ప్రచారం చేస్తున్నదని వ్యాఖ్యానించారు. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సరిపోలేదంటూ గురువారం హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టడాన్ని తప్పుబట్టారు. సీఐడి ఆఫీసర్, పొన్నవోలు సుధాకర్ రెడ్డి విలేకర్లతో అదే అసత్యాలను వల్లేవేయడం మొదలు పెట్టారని చెప్పారు. సిమెన్స్ సంస్థ అనేది ఒరిజనల్ కాదు. పేరు బాగుంది కదా అని చంద్రబాబు ఈ పేరు పెట్టుకున్నారని ప్రచారం చేయడం సరికాదని అన్నారు.

కాంట్రాక్టు ఏఎన్ఎంలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయుఎంహెచ్‌ఇయూ - సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర అధ్యక్షులు ఎండీ ఫసియొద్దీన్, ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6000 మంది కాంట్రాక్టు ఏఎన్ఎంలు రెగ్యులరైజేషన్ చేయాలనీ, పరీక్షా విధానం రద్దు చేయాలని ఆగస్టు 15 నుండి సెప్టెంబర్ 4 వరకు 21 రోజులపాటు సమ్మెచేశారని వారు గుర్తుచేశారు. సమ్మె కాలంలో రాష్ట్ర ప్రభుత్వం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆధ్వర్యంలో మూడుసార్లు చర్చలు జరిపి, సెప్టెంబర్ ఒకటిన జరిగిన ఒప్పందం ప్రకారం ముగ్గురు అధికారులతో రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేసిందని తెలిపారు. కమిటీ యూనియన్లతో చర్చించి ప్రభుత్వానికి రిపోర్ట్ పంపి నిర్ణయాలు చేయాల్సి ఉందన్నారు. ఈలోపు రాష్ట్ర ప్రభుత్వం తరపున డైరెక్టర్ గారు ఇచ్చిన హామీ మేరకు ఎరియర్స్ సెప్టెంబర్ 15 నాటికి రావాల్సి ఉన్నప్పటికీ రాలేదని విమర్శించారు. అలాగే సమ్మె కాలపు వేతనాలు చెల్లిస్తామని చెప్పినా జీతాలు కట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఏఎన్ఎంలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌లో అప్లై చేసుకోవడానికి కూడా సమయం సరిపోవడం లేదు. డిఎంహెచ్‌వోలు సర్వీస్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. ముఖ్యంగా అర్బన్ హెల్త్ సెంటర్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలను ఇబ్బంది పెడుతున్నారు . ఒకవేళ ఇచ్చినా అందులో సమ్మె కాలాన్ని మెన్షన్ చేస్తున్నారు. కాంట్రాక్ట్ ఏఎన్ఎంల వరకు వయసు పరిమితి పూర్తిగా ఎత్తివేయాలని కోరాము. దాన్ని పరిశీలిస్తామన్నారు. కానీ అది ఏం పరిష్కారం కాలేదు. నోటిఫికేషన్ డేట్‌ను వెంటనే పొడిగించాలని కోరుతున్నారు. కాంట్రాక్ట్ ఏఎన్ఎంల ప్రధాన సమస్య అయిన రెగ్యులరైజేషన్, పరీక్ష విధాన రద్దు కోసం కమిటీ వెంటనే ఒక నిర్ణయం తీసుకోవాలి అలాగే సమ్మె కాలం జీతాలు, ఏరియర్స్ వెంటనే చెల్లించాలి. లేనిపక్షంలో మళ్ళీ ఆందోళన ప్రారంభిస్తామని వారు హెచ్చరించారు.

ఆహార విషయాల ద్వారా సైన్స్ ప్రమోషన్

- పద్మశ్రీ డాక్టర్ దాసరి ప్రసాదరావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమతుల్యాహారం తదితర విషయాలను ప్రచారం చేయడం ద్వారా సైన్స్‌ను ప్రమోట్ చేయాలని పద్మశ్రీ డాక్టర్ దాసరి ప్రసాదరావు సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లో జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కోయ వెంకటేశ్వర రావు అధ్యక్షతన ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ (ఏఐపీఎస్ఎన్) ఆధ్వర్యంలో సైంటిఫిక్ టెంపర్ అనే అంశంపై జాతీయ స్థాయి సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశం ప్రారంభోత్సవంలో దాసరి ప్రసాదరావు మాట్లాడుతూ తల్లి గర్భం నుంచే శిశువుల ఆహారం, ఆరోగ్యం పొందుతారని తెలిపారు. 30 ఏండ్లుగా డాక్టర్‌గా తన అనుభవంలో రోగాలకు నివారణ ముఖ్యమని గ్రహించినట్టు తెలిపారు. ప్రస్తుతం వస్తున్న రోగాల్లో మూడింట రెండు వంతులు అసాంక్రమిత (నాన్-కమ్యూనికేబుల్ డిసీజెస్) ఉంటున్నాయని తెలిపారు. స్మోకింగ్, సరైన శారీరక శ్రమ లేకపోవడం, వ్యాయమం లేకపోవడం తదితర సరైన జీవనశైలి లేకపోవడంతో ఈ రోగాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలనీ, మందులకు తర్వాతి స్థానం ఇవ్వాలని సూచించారు. కాలుష్యం లేని వాతావరణంలో ఆహారం, నీరు ప్రజలకందాల్సి ఉందని తెలిపారు. ఏమి తినాలి? ఎలా తినాలి? తదితర విషయాలను ప్రజలు తెలుసుకోవాలని సూచించారు. పూర్తిగా మాంసాహారం తినాలనీ లేదా పూర్తిగా మాంసాహారం మానేయాలని చెబుతుంటారనీ, కానీ, ప్రతి ఒక్కరు సమతుల్యాహారం గురించి తెలుసుకోవాలని కోరారు. భారతదేశంలో ఎక్కువగా ఉత్పత్తి రహిత చర్చలు జరుగుతుంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా అభివద్ధి చెందిన దేశాల్లో ఉత్పత్తిసహిత చర్చలతో ఎదుగుదల కనిపిస్తున్నదన్నారు.

సైన్సులో ఆరోగ్యం, వ్యవసాయం, ఇంజినీరింగ్ ముడిపడి ఉన్నాయని తెలిపారు. సైన్స్ అంటేనే ఆహారమనీ, ఆహారమంటేనే ఇంజినీరింగ్ అని, ఆహారమంటేనే ఔషధంమంటూ డాక్టర్ దాసరి ప్రసాదరావు తెలిపారు. ఆహారానికి - సైన్సుకు ఉన్న సంబంధాన్ని వివరిస్తూ ప్రచారం చేయాలని సైన్స్ ప్రమోటర్లకు ఆయన సూచించారు. అల్లోపతి వైద్యం ఆధారాలతో నిరూపితమైందని తెలిపారు. కొన్ని వైద్య విధానాలకు ఆధారాలుండవనీ, అవి కేవలం తమ పూర్వీకుల అనుభవాల మేరకు వాడుతుంటారని విమర్శించారు. మధ్యాహ్న భోజన పథకం గొప్ప పథకమని కొనియాడారు. ఏఐపీఎస్ఎన్ ప్రధాన కార్యదర్శి ఆశా మిశ్రా మాట్లాడుతూ భారతదేశంలో పాలకవర్గాలు అశాస్త్రీయ భావాలను పెంపొందిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా పాఠ్యాంశాల్లోనూ అశాస్త్రీయ అంశాలను పొందుపరుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిజమైన సైన్సు అంటే ఏంటో చెప్పాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తుచేశారు. గోవింద్ పన్సారే, గౌరీ లంకేష్, కల్బుర్గి తదితరులు ఏ ఆశయం కోసమైతే పని చేశారో దాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు.

మావోయిస్టు అగ్రనేత సంజయ్ దీపక్ రావు హైదరాబాద్‌లో అరెస్టు

- విలేకరుల సమావేశంలో వెల్లడించిన డీజీపీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

మావోయిస్టు అగ్రనేత సంజయ్ దీపక్ రావుని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. కూకట్‌పల్లిలోని మలేషియా టౌన్‌షిప్‌లోని తన స్నేహితుల వద్ద ఉన్న సంజయ్‌ను సైబరాబాద్‌తో పాటు యాంటీ నక్సలైట్ విభాగం ఎస్‌ఐబీ అధికారులు కాపు కాచి శుక్రవారం అరెస్టు చేసినట్టు రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అరెస్టు చేసిన సంజయ్ నుంచి ఒక రివాల్వర్, ఆరు బులెట్లు, కంప్యూటర్ స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు. మహారాష్ట్రలోని థానే జిల్లాకు చెందిన సంజయ్ 1980లో జమ్ము కాశ్మీర్‌లో ఐఐటీ ఇంజనీరింగ్ చేస్తూ.. విప్లవ కార్యకలాపాల పట్ల ఆకర్షితుడైనట్టు ఆయన తెలిపారు. తర్వాత సీపీఐ(ఎంఎల్)లో రవూఫ్ వర్గంలో చేరిన సంజయ్ తర్వాత సీపీఐ(ఎంఎల్) నక్సల్‌బరీ మురళీధరన్ వర్గంలో చేరి కార్యకలాపాలు సాగించాడని ఆయన తెలిపారు. అనంతరం 2007లో దండకారణ్యంలో సీపీఐ మావోయిస్టు పార్టీలతో సంప్రదింపులు జరిపిన మురళీధరన్, సంజయ్‌లు తమ వర్గాన్ని మావోయిస్టు పార్టీల్లో విలీనం చేసినట్టు డీజీపీ తెలిపారు. ఇదే సమయంలో అనంతపురానికి చెందిన మావోయిస్టు పార్వతీని వివాహం చేసుకున్నాడు. అటుతర్వాత కేరళ, కర్నాటక, తమిళనాడు కలుపుతూ ఏర్పాటు చేసిన మావోయిస్టు వెస్ట్రన్ గార్ట్స్ ఏరియా కమిటీలో కీలక బాధ్యుడిగా సంజయ్‌ను నియమించారు. తర్వాత మావోయిస్టు కేంద్ర కమిటీలో సభ్యుడిగా ఆయనకు స్థానం కల్పించిందని అంజనీ కుమార్ వివరించారు. అనంతరం ఆరోగ్య కారణాలరీత్యా మైదాన ప్రాంతానికి మారిన సంజయ్ హైదరాబాద్‌లో తన పూర్వ స్నేహితులతో ఉన్నట్టు నిఘా వర్గాలు కనిపెట్టి అరెస్టు చేశాయని ఆయన తెలిపారు. సంజయ్‌పై మహారాష్ట్ర ప్రభుత్వం రూ.25లక్షలు రివార్డుగా ప్రకటించిందని ఆయన వివరించారు.

ఇంజినీర్లతోనే మౌలిక సదుపాయాల కల్పన



- సందీప్ కుమార్ సుల్తానీయా

నవతెలంగాణ-హైదరాబాద్

సమాజానికి మౌలిక సదుపాయాలు కల్పించాలంటే ఇంజినీర్లతోనే సాధ్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సందీపకుమార్ సుల్తానీయా వ్యాఖ్యానించారు. ఇంజినీర్లు లేకుండా ఏదీ అంత సులభం కాదని అభిప్రాయపడ్డారు. యంత్రాలు తయారు చేయాలన్నా, రాకెట్లు రూపొందించాలన్నా భవనాలు కట్టాలన్నా ఇంజినీర్లు చాలా ముఖ్యమని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్లోని ఎర్రమంజిల్‌లో ఉన్న పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ప్రధాన కార్యాలయంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య పుట్టిన రోజు 'ఇంజినీర్స్ డే' సందర్భంగా రక్తదాన శిభిరం నిర్వహించారు. ఈసందర్భంగా దాదాపు 47 మంది పంచాయతీరాజ్, మిషన్ భగీరథ ఇంజినీర్లు, అధికారులు రక్తదానం చేశారు. ప్రతి ఒక్కరూ. 300 మిల్లీలీటర్ల రక్తం ఇచ్చారు. వీరికి అవసరమైన పండ్లు, ఇతర తినుబండారాలను అందజేశారు. ఈ సందర్భంగా సుల్తానీయా మాట్లాడుతూ రక్తదానం గొప్ప విషయమన్నారు. రక్తమిచ్చిన అధికారులు, ఇంజినీర్లను అభినందించారు. పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఏజీ సంజీవ రావు మాట్లాడుతూ మోక్ష గుండము విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని సూచించారు. ఇంజినీర్లు లేకుండా ప్రపంచం లేదని అభిప్రాయపడ్డారు. అందుకే ఇంజనీర్స్ మేక్ ది వరల్డ్ అని అన్నారని గుర్తు చేశారు. రక్తదాన శిబిరానికి చొరవ తీసుకున్న పీఆర్ చీఫ్ ఇంజనీర్ గజం సీతారాములు మాట్లాడుతూ ఇంజినీర్లు, అధికారులు తమ విధులతోపాటు మానవ సేవ చేయాలని కోరారు. సమాజంలోని అనాథలను దగ్గరతీసి చేతనైన మేరకు సాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ సీఈలు మధుబాబు, రామచంద్రనాయక్ , పీఆర్ ఈఈ ముజీబ్, రజిత, నరేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



జరుగబోయే పార్లమెంట్ సమావేశాల్లో ,ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని. కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ,చలో ఢిల్లీ సెప్టెంబర్ 21,22 టీఎమ్ఆర్‌పీఎస్ కరపత్రాన్ని, ఆల్విన్ కాలని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ చేతుల మీదుగా, రాష్ట్ర ఉపా ధ్యక్షులు పాలడుగు జానయ్య, మేడ్చల్ జిల్లా కన్వీనర్ గుడ్ల శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో, ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో టీఎమ్ ఆర్‌పీఎస్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు సావిత్రి, అధ్యక్షులు హెచులోల్ల మహేష్, కార్యదర్శి ఆశంగార సురేష్, ప్రకాష్, శంకర్, లక్ష్మణ్, మల్లేష్, సయ్యద్ ఇంత్యాజ్, నారాయణ, నర్సింగ్, రాందాస్, తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కూకట్‌పల్లి

చంద్రబాబు అరెస్ట్ అప్రజాస్వామికం :ఎమ్మెల్యే

నవతెలంగాణ-మల్కాజిగిరి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్ట్ అప్రజాస్వామ్యం అని స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టును మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఖండించారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రిగా అపార అనుభవములతో పాటు ఐటీ రంగంలో అనేక మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. 73 సంవత్సరాల వయసుగల చంద్రబాబు నాయుడు అరెస్టు విచారణ అప్రజాస్వామ్యంగా ప్రభుత్వ కక్ష సాధింపు ధోరణిలా కనబడుతుందని ఆయన అన్నారు.



21న 'డబుల్' ఇండ్లు పంపిణీ

- ర్యాండమైజేషన్ పద్ధతిలో లబ్దిదారుల ఎంపిక పూర్తి
- మొత్తం 24 నియోజకవర్గాలు 11700 మంది ఎంపిక
- 3.55లక్షల దరఖాస్తులు..1.31లక్షల మంది అర్హుల గుర్తింపు

నవతెలంగాణ-సిటీబ్యూరో

సొంత రాష్ట్రంలో నిరుపేద ప్రజలు గౌరవంగా జీవించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాలను చేపట్టిన విషయం తెలిసిందే. అందులో భాగంగా గ్రేటర్ పరిధిలో లక్ష ఇండ్లను నిర్మించి ఇవ్వాలని నిర్ణయించింది. వీటిలో ఇప్పటికే 70వేల వరకు ఇండ్లు పూర్తిచేసినట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించగా.. మరో 30వేల ఇండ్ల నిర్మాణం చివరి దశలో ఉన్నాయని తెలిపింది. ఆగస్టు 24న మొదటి విడుతలో భాగంగా గ్రేటర్ పరిధిలోని 11,700 మంది లబ్దిదారులను ఎంపిక చేసి.. ఈనెల 2న వారికి ఇండ్లు పంపిణీ చేసింది. ఈ నేపథ్యంలో రెండో విడత డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీకి సంబంధించి శుక్రవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో ఎన్ఐసీ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ర్యాండమైజేషన్ పద్ధతిలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సమక్షంలో ఆన్‌లైన్ డ్రా తీశారు. 24 అసెంబ్లీ సెగ్మెంట్‌లో మొత్తం 11,700 మంది లబ్దిదారులను ఎంపిక చేశారు. వీరికి ఈనెల 21న ఇండ్లు అందించనున్నారు.

జీహెచ్ఎంసీ పరిధిలోని మొత్తం 24 నియోజకవర్గాల్లో డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం 3.55లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంటింటి సర్వేలో ఈనెల 8వ తేదీవరకు



1,31,214 మంది దరఖాస్తులు అర్హత కలిగినట్టుగా అధికారులు గుర్తించారు. దాదాపు అయిదారు దశల్లో ఇప్పటికే పూర్తయిన సుమారు 70 వేలకుపైగా ఇండ్లకు లబ్దిదారులను ఎంపిక చేయనున్నారు. ఈ క్రమంలో శుక్రవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ఆన్‌లైన్ లాటరీ డ్రాలో రెండవ విడుతలో గ్రేటర్‌లోని 24 అసెంబ్లీ సెగ్మెంట్‌లకు 500 మంది చొప్పున 11,700 మంది లబ్దిదారులను ఎంపిక చేశారు. ఇందులో హైదరా బాద్(7300), రంగారెడ్డి(1900), మేడ్చల్-మల్కాజిగిరి(2000), సంగారెడ్డి జిల్లాలకు (500) మంది చొప్పున లబ్దిదారులను ఎంపిక చేశారు.

ఇదిలావుంటే రెండో విడతలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులో ప్రభుత్వం వికలాంగులు, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ కోటా అమలు చేసింది. దీంతో గ్రేటర్‌లోని హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి సంగారెడ్డి జిల్లాలో వికలాంగులకు(470), ఎస్సీలకు(1923), ఎస్టీలకు(655) చొప్పున డబుల్ బెడ్ రూమ్ కేటాయించినట్టు అధికారులు తెలిపారు.

రెండో విడత-2బీహెచ్‌కే లబ్దిదారులు ఇలా...

జిల్లా	లబ్దిదారులు
హైదరాబాద్	7300
మేడ్చల్-మల్కాజిగిరి	2000
రంగారెడ్డి	1900
సంగారెడ్డి	500
మొత్తం	11700

'డబుల్'లో రిజర్వేషన్లు.. లబ్దిదారులు ఎంపిక

జిల్లా	లబ్దిదారులు	వికలాంగులు	ఎస్సీ	ఎస్టీ	ఇతరులు
హైదరాబాద్	7300	283	1213	413	5391
మేడ్చల్	2000	96	332	116	1456
రంగారెడ్డి	1900	75	295	97	1433
సంగారెడ్డి	500	16	83	29	372
మొత్తం	11700	470	1923	655	8652

జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ కార్యాలయంలో ఇంజినీర్స్ డే



నవతెలంగాణ-బాలానగర్

భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య 163వ జయంతి సందర్భంగా ఇంజినీర్స్ డే శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఇంజినీర్స్ డే వేడుకలలో భాగంగా జీహెచ్ఎంసీ ఏఈ మహమ్మద్ రషీద్, నాక్ ఇంజనీర్ కవితను వారి కార్యాలయంలో సీఐటీయూ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, పాత్రికేయుడు డెక్కన్ విజన్ రిపోర్ రవి కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ భారతరత్న గ్రహీత మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆదర్శనీయుడని అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య తన శేష జీవితంలో 30 సంవత్సరాలు ఇంజనీర్‌గా, 20 సంవత్సరాలు పరిపాలన అధికారిగా, 20 సంవత్సరాలు సలహాదారునిగా దేశానికి చేసిన సేవలను రాజశేఖర్ గుర్తు చేశారు. ఇంజనీరింగ్ క్షేత్రం తరచుగా ఆవిష్క రణలలో అగ్రగామిగా ఉంటుందని, సమాజాన్ని దాని భవిష్యత్తును రూపొందించడంలో ఇంజనీర్లు ముఖ్యపాత్ర పోషిస్తారని తెలిపారు. ప్రతి ఇంజనీర్ ఆయనను ఆదర్శంగా తీసుకుని ఆయనలోని క్రమశిక్షణను, నిజాయితీని, అంకితభావాన్ని అలవర్చుకోవాలని కోరారు.

మేడ్చల్: మైసమ్మ గూడలోని సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంజనీర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ బ్రహ్మయ్య విచ్చేసి మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చేపట్టిన ప్రాజెక్ట్ గురించి వివరించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ దేశ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని తెలిపారు. అనంతరం కళాశాల సెక్రెటరీ టి. వి. రెడ్డి మాట్లాడుతూ ఇంజనీర్ మొబైల్స్‌లో ప్రతిరోజు ఎన్నో రకాల యాప్స్ డెవలప్స్ చూస్తూ ఉంటారని వాటిని మనం నిత్యం ఉపయోగిస్తూ ఉంటామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె .శ్రీలత మాట్లాడుతూ మన ఇంజనీరింగ్ పితామహుడు భారతరత్న మోక్ష గుండం విశ్వేశ్వరయ్య పుట్టినరోజును ఇంజనీర్స్ డే గా జరుపుకుంటున్నామని ప్రతిరంగంలో నైపుణ్యం కలిగి ఉన్నప్పుడు సమాజానికి ఉపయోగపడే వస్తువులను తయారు చేయడంలో విద్యార్థులను ప్రోత్సహించాలని తెలిపారు. ఇంజనీర్స్ డే సందర్భంగా పలు విభాగాల విద్యార్థులు పోస్టర్ ప్రజెంటేషన్, పేపర్ ప్రజెంటేషన్ ప్రదర్శించారు. బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థి ప్రదర్శించిన అటల్ టన్నెల్ నమూనా అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ముఖ్య అతిధిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ సరోజా రెడ్డి, డైరెక్టర్ అనురాగ్ రెడ్డి , పీఆర్ఓ రవి సుధాకర్ , ఏఓ డా.హరి ప్రసాద్ రెడ్డి, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.





కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు మరియు బీఆర్ఎస్ పార్టీ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్‌ని తన నివాసం వద్ద కార్యాలయంలో కలిసి పలు సమస్యలపై వినతి పత్రాలు, ఆహ్వాన పత్రికలు అందజేశారు. సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

క్రీడలతో శారీరక దృఢత్వం , మానసిక ఉల్లాసం



- కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

క్రీడలతో శారీరక దృఢత్వం పొందడంతోపాటు మానసిక ఉల్లాసానికి కూడా దోహదపడుతుందని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని మేరాజ్ నగర్ లో క్రికెట్ క్రీడాకారులకు ఆమె పాల్గొని క్రికెట్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. రాబోయే రోజుల్లో ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని జిల్లా స్థాయిలో పోటీల్లో పాల్గొని అల్లాపూర్ డివిజన్ కు మంచి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో మోయిజ్, చున్ను, మతిన్, కరీమ్, హమీద్ సాబ్, జావీద్, ఫయాజ్, గౌస్, సమీర్,పాల్గొన్నారు.

ప్రజల ఆశీర్వాదంతోనే హ్యాట్రిక్ విజయం సాధిస్తా

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రజల ఆశీర్వాదంతోనే రానున్న ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధిస్తానని స్థానిక ఎమ్మెల్యే కేపీవివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో "ప్రగతి యాత్ర"లో భాగంగా 108వ రోజు శుక్రవారం ఎమ్మెల్యే వివిధ విభాగాల అధికారులు, స్థానిక ప్రజలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో పూర్తిచేసిన భూగర్భ డ్రయినేజీ, పనులను పరిశీలించారు. కాగా సీసీ రోడ్డు పూర్తి చేయాలని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రావడంతో అక్కడే ఉన్న సంబంధిత అధికారులకు ఆయన ఆదేశాలిచ్చారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి చైతన్యవంతులను చేయాలని తెలిపారు. అర్హులైన పేద, మధ్యతరగతి ప్రజలు సంక్షేమ ఫలాలు సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఐటీ మంత్రి కేటీఆర్ సహకారంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పరుచుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా కుత్బుల్లాపూర్ ను తీర్చిదిదుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు రుద్ర అశోక్, మహిళా అధ్యక్షురాలు బింగి ఇందిరా గౌడ్ శ్రీనివాస్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు నర్సింగ్ గౌడ్, సీనియర్ నాయకులు సయ్యద్ రషీద్, నల్లగోపుల బాబుగౌడ్, శశిధర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌కు ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరు



- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరు కావడం ఎంతో గర్వకారణం అని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్టలో హెచ్ఎండీఏ (హెచ్ఎంటి ఖాళీ స్థలం) చెందిన 20ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, బస్సు టెర్మినలకు కేటాయించిన స్థలాన్ని శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే వివేకానంద్ సంబంధిత అధికారులతో కలిసి పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నిర్ణయం జిల్లాకు మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడం అందులో భాగంగా మేడ్చల్ జిల్లాకు సంబంధించి ప్రభుత్వ వైద్య కళాశాలను మన కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి కేటాయించడం చారిత్రాత్మక విజయమని పునరుద్ఘాటించారు. దానితోపాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆర్టీసీ బస్ టెర్మినల్ స్థలం కేటాయించడం శుభ పరిణామమని సంతోషం వ్యక్తపరిచారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు. గడిచిన తొమ్మిదిన్నర సంవత్సరాలలో రాజకీయాలకతీతంగా ప్రజల సహకారంతో ప్రజా సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, డివిజన్ నాయకులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే చర్యలు



- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాధికారి విజయకుమారి

నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలకు స్పౌస్ పాయింట్లను ఉపయోగించుకుని దంపతులు వెబ్ ఆప్షన్ ఎంచుకునే సందర్భంలో స్పౌస్ పని చేస్తున్న పాఠశాలకు దగ్గరగా ఉన్న ఖాళీలను మాత్రమే వెబ్ ఆప్షన్‌లో ప్రాధాన్యతా క్రమంలో ముందుగా కోరుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాధికారి విజయకుమారి తెలిపారు. అలా కాకుండా దగ్గర పాఠశాల కాకుండా దూరంగా ఉన్న పాఠశాలను కోరుకుంటే వారిపై శాఖాపరమైన క్రమ శిక్షణా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జీవో 5 ప్రకారం కాకుండా ఎవరైనా నకిలీ ధ్రువీకరణ పత్రాలను సమర్పించినా, ప్రిఫరెన్సియల్ కేటగిరీలు అంటే వితంతువు, పీహెచ్‌సీ, డిపెండెంట్ గురించి ఎలాంటి తప్పుడు సమాచారం అందించినా వారిపై శాఖపరమైన క్రమ శిక్షణా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

5వ రోజు అంగన్‌వాడీల నిరవధిక సమ్మె



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ (సీఐటీయూ) యూనియన్ ఆధ్వర్యంలో తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఐదు రోజులుగా నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నారు. శుక్రవారం అల్వాల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీస్ వద్ద నిర్వహించి అనంతరం అల్వాల్ ప్రాజెక్టు ఆఫీస్ నుంచి యాప్రాల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి చౌరస్తాలో మానవహారం నిర్వహించినట్టు సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ నాయకులు, మల్కాజిగిరి మండల ప్రధాన కార్యదర్శి బంగారు నర్సింగరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పని చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె చేస్తున్న కార్మిక సంఘాల్ని రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు పిలిచి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని లేని సమక్షంలో ఈ సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఉన్నికృష్ణన్ మాట్లాడుతూ ప్రభుత్వాలు స్పందించకపోతే అవసరమైతే ప్రగతి భవన్‌ను ముట్టడి చేస్తామని, ఇందుకు అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్, మల్కాజిగిరి, యాప్రాల్ మండలాల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ టీచర్స్ పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు.

నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీర్స్ డే వేడుకలు



- కార్యదర్శి జె. త్రిశూల్ రెడ్డి

నవతెలంగాణ-దుండిగల్

మేడ్చల్ మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం కళాశాల ప్రాంగణంలో ఇంజనీర్స్ డే వేడుకలు ఎస్ఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా1947 నుండి నేటి వరకు సాంకేతికంగా భారతదేశం పురోగతి, సమాజంలో ఇంజనీర్ల పాత్ర, దేశ పురోగతికి ఇంజనీర్ల సహకారం అంశాలపై ఇంజనీరింగ్ విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్ ఉపన్యాస ,వ్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి జె. త్రిశూల్ రెడ్డి ఇంజనీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితం అందరికీ స్ఫూర్తి దాయకమని, ప్రతి విద్యార్థి ఆయన ఆదర్శంగా తీసుకోవాలని, సమాజానికి ఉపయోగపడే ఇంజనీర్లుగా తయారు కావాలన్నారు. అలాగే అందరూ సూక్ష్మ పరిశీలన వైపు దృష్టి కలిగి ఉండాలని తద్వారా దేశభ్యున్నతిలో ఉపయోగపడే ఇంజనీర్లుగా తయారవుతారని తెలిపారు. విద్యార్థులు ఇంజనీరింగ్ పూర్తి కాగానే సామాజిక అవసరాలకు అనుగుణంగా నూతన ఆవిష్కరణల వైపు అడుగు లేయాలని, దేశ ప్రగతికి తోడ్పడాలని సూచించారు. అనంతరం ఇంజనీరింగ్ డే సందర్భంగా వివిధ పోటీల లో పాల్గొని ప్రతిభ కనపరచిన విద్యార్థులకు కళాశాల కార్యదర్శి జె. త్రిశూల్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ జె .నర్సింహ రెడ్డి, కార్యదర్శి జె. త్రిశూల్ రెడ్డి, కోశాధికారి త్రిలోక్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా.ఆర్ లోకనాథం,SAC డీన్ డా. టి.ఎల్ రామదాసు, కన్వీనర్ సౌమ్య, పలు విభాగాధిపతులు అధ్యాపకులు విద్యార్థులు సిబ్బంది హాజరయ్యారు.

టీపీసీసీ ఛార్జ్ షీట్ కమిటీలో జ్యోత్స్నా శివారెడ్డి



నవతెలంగాణ-బాలానగర్

తెలంగాణ రాష్ట్రంలో పథకాల పేరుతో ప్రజలను మభ్యపెడుతూ ప్రజలను మోసం చేస్తున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కందాడి జ్యోత్స్న శివారెడ్డి అన్నారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన టీపీసీసీ ఛార్జ్ షీట్ కమిటీ సమావేశంలో పాల్గొని ఛార్జ్ షీట్ లో పొందుపరచాల్సిన అంశాలు, విధి విధానాలపై కమిటీ సభ్యురాలు కందాడి జ్యోత్స్న శివారెడ్డి చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 17న తుక్కుగూడలో జరిగే విజయభేరి సభను విజయవంతం చేయాలని నాయకు లకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదలపై పెనుభారం మోపుతున్నారని అన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలను పెంచి, ములిగే నక్క పైన తాడి పండు పడ్డ చందంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చడమే ఎమ్మెల్యే లక్ష్యం



- కార్పొరేటర్ మేకల సునీత

నవతెలంగాణ-మల్కాజిగిరి

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు లక్ష్యమని గౌతమ్ నగర్ కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ అన్నారు. గత ఎన్నికల సమయంలో హిల్ టాప్ కాలనీలో బోర్ వేయిస్తా నని ఎమ్మెల్యే కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. హామీలో భాగంగా ప్రభుత్వం నిధులతో శుక్రవారం ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, కార్పొరేటర్ హిల్ టాప్ కాలనీలో పవర్ బోరు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ముందుకు సాగుతున్నాన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి అహర్నిశలు ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కృషి చేస్తున్నారని చెప్పారు. టీఆర్ఎస్ నేత మేకల రాము యాదవ్, కాలనీవాసులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ఆల్విన్ కాలని



- సురభి రవీందర్ రావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్ రావు మార్పు కోసం బీజేపీ అనే నినాదం తో చేపట్టిన పాదయాత్ర శుక్రవారం ఆల్విన్ కాలనీ లాస్ట్ బస్ స్టాప్, ధరణి నగర్, ఫేస్ టు ఫేస్ వన్‌లలో నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ రావు మాట్లాడుతూ కాలనీ ఏర్పడి 34 సంవత్సరాలు పూర్తయినా కూడా నేటికీ అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుందని అన్నారు. డ్రయినేజీ వ్యవస్థ, రోడ్డు వ్యవస్థ సరిగ్గా లేదని, వీధీ దీపాల సమస్యలు చాలా ఉన్నాయని అన్నారు. వందల కోట్లు పెట్టి ఆల్విన్ కాలనీ అభివృద్ధి చేశామని, అధికార పార్టీ నాయకులు చెప్తున్నారు. అభివృద్ధి ఎక్కడ చేశారో చెప్పాలని అన్నారు. ఆల్విన్ కాలనీలో ఇంకా 40 శాతం పనులు పెండింగ్లో ఉన్నాయని, వెంటనే అధికారులు స్పందించి సమస్యలు అన్నిటిని పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రామ్ రెడ్డి, రవీందర్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, కుమార్ యాదవ్, కుమార చారి, నరేందర్ రెడ్డి, రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం మన చేతిలో ఉంటే వర్గీకరణ చేసుకోవచ్చు

- సీపీఐ మండల కార్యదర్శి ఉమా మహేష్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



గత 3 రోజులుగా ఈ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో వర్గీకరణ బిల్లును పెట్టి ఆమోదించాలని కోరుతూ కుత్బుల్లాపూర్ మున్సిపల్ చౌరస్తా అంబెడ్కర్ విగ్రహం వద్ద మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని శుక్రవారం సందర్శించి, సీపీఐ మండల కార్యదర్శి ఉమా మహేష్ సంఘీభావం మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఉమా మహేష్ వారిని ఉద్దేశించి మాట్లాడుతూ గత 29 సంవత్సరాలుగా వర్గీకరణ పోరాటం నడుస్తుందని ఎన్నికల సమయంలో అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలుపి గద్దెనెక్కిన తరువాత పట్టించుకోవడం మానేస్తున్నాయన్నారు. ఈ అంశన్నీ ఎన్నికల అంశంగా మాత్రమే ఓట్ల కోసం మాత్రమే చూస్తున్నాయని ఎద్దేవాచేశారు. సీపీఐ మాత్రం ఎన్నికల అజెండాగా కాకుండా సామాజిక కోణంలో చూస్తూ మొదటి నుండి ఉద్యమానికి మద్దతు తెలియచేస్తూదని అన్నారు. కావున ఎన్నికల అజెండాగా కాకుండా ప్రజల అజెండాగా మార్చి రాజ్యాధికారం కోసం పోరాటం నిర్వహిస్తే వర్గీకరణ సాధించుకోవచ్చు అన్నారు. మన హక్కులు, లక్ష్యాలు సాధించలంటే లాల్ నిల్ ఐక్యం కావాలని కోరారు. రానున్న రోజుల్లో కూడా తమ మద్దతు ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఇమామ్ ,ప్రభాకర్, సంతోష్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



10

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మేడ్చల్-ఉప్పల్

శనివారం | సెప్టెంబర్ 16. 2023 | www.navatelangana.com

'డైమండ్ హిల్స్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా'



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ డైమండ్ హిల్స్ కాలనీ అభివృద్ధికి పాటుపడుతానని బీఆర్ఎస్ ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కాలనీని రిక్రేషన్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్‌గా మార్చిన సందర్భంగా బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం భారత్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అనేక ఏండ్లుగా రెసిడెన్షియల్ జోన్ లేక ఇబ్బంది పడుతున్న ప్రజల కల నెరవేరిందన్నారు. కార్యక్రమంలో మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్, కాలనీ ప్రెసిడెంటు శ్రీనివాస్ రెడ్డి, డైమండ్ హిల్స్ కాలనీ ప్రెసిడెంట్ మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈక్బాల్, ఆరీఫ్, ప్రభాకర్ రెడ్డి, నసీరుద్దీన్, తైర్‌భాయ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో జరిగిన అవకతవకలపై విచారణ చేయాలి

● మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మున్సిపల్‌లో జరుగుతున్న అవినీతి, అక్రమాలను పూర్తిస్థాయిలో విచారించి అందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని ఘట్కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ అన్నారు. మున్సిపల్‌లో జరిగిన అవినీతిపై శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ..మున్సిపల్‌లో జరిగిన అవినీతిలో కమిషనర్ల పాత్ర ఉందని ఆయన ఆరోపించారు. వారి పాత్ర లేకుంటే ఇంత డబ్బు మాయమై మళ్లీ మున్సిపల్ అకౌంట్‌లో ఎలా జమ అయ్యాయన్నారు. మున్సిపల్ లో రెండు వర్గాలు ఏర్పడి అందులో ఒక వర్గం అవినీతి వర్గానికి సహకారం అందిస్తుందని ఆరోపించారు. ఇందులో పాత్ర ఉన్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ జన సమితి జిల్లా నాయకులు లక్ష్మారెడ్డి, ఖయ్యూం, శ్రీనివాస్, వెంకటేష్ గౌడ్, శివ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయ్‌కు రూ.10వేల ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ చిన్న చర్లపల్లికి చెందిన విజయ్ కుడికాలు యాక్సిడెంట్‌లో విరిగింది. విషయం తెలుసు కున్న బీఆర్ఎస్ ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ఆదేశాలతో చర్లపల్లి డివిజన్ నాయకుడు నరసిం హ ముదిరాజ్‌తో బాధితుడికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. అనునిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న బండారి లక్ష్మారెడ్డిని వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నరసింహ ముదిరాజ్, పాండు, భూపాల్, గోవిందరాజు గౌడ్ ,బాబు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటున్న పాలమాకుల సుదర్శన్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ఆదేశాలతో బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు గుమ్మడి జంపాల్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారవు. కార్యక్రమంలో శంకర్ యాదవ్, బుచ్చిరెడ్డి, దూసరి నవీన్ గౌడ్,భూపతి అశోక్,పంగ యాకూబ్, కందుకూరి కృష్ణమూర్తి, బొడ్డు శీను, యాదగిరి, గోల్లూరి మనీష్ పాల్గొన్నారు.

వాటర్ పైప్ లైన్ పనులను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ నేతాజీ నగర్‌లో జరుగుతున్న వాటర్ పైప్ లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ శుక్రవారం పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం లక్ష్మీనగర్ వెల్ఫేర్ హౌసింగ్ సొసైటీ కాలనీలో గణేష్ మండపాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్య భద్రతే మా ప్రథమ లక్ష్యం



● మేయర్ జక్కా వెంకట్ రెడ్డి ● ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

నవతెలంగాణ-బోడుప్పల్

కార్మికుల ఆరోగ్యంగా ఉంటేనే కార్పొరేషన్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షన్-2023 "సఫాయి మిత్ర సురక్ష" కార్యక్రమంలో భాగంగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బస్తీ దవాఖాన ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు ఏర్పాటు చేసిన "ఉచిత హెల్త్‌క్యాంపు"ను ప్రారంభించారు. ఈ క్యాంప్‌లో ఉచితంగా బీపీ, షుగర్, ఎస్పీవో 2 పరీక్షలతో పాటు దగ్గు, జలుబు, జ్వరం, నొప్పులు మొదలైన అన్ని రకాల పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, బస్తీ దవాఖానలో సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ..మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న సిబ్బందికి అనారోగ్య సమస్యలు రాకుండా వైద్య పరీక్షల కోసం హెల్త్ క్యాంప్ నిర్వహించామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మద్ది యుగేందర్ రెడ్డి, బచ్చ రాజు, అమర్ సింగ్, డాక్టర్ ప్రతిభ, డాక్టర్ భార్గవి, డాక్టర్ హేమలత, సుజాత స్టాఫ్ నర్స్, చంద్రకళ, నర్సింహా, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధ, స్ఫూర్తి కళాశాల్లో తెలంగాణ సాంస్కృతిక వేడుకలు



నవతెలంగాణ-కీసర

కీసర మండల కేంద్రం లోని శ్రద్ధ, స్ఫూర్తి కళాశాల్లో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు అమ్మవార్ల వేషధారణ, ఆటా పాటలతో విద్యార్థుల నృత్యాలు అలరించాయి. అనంతరం విద్యార్థులు బోనాలతో కళాశాల నుంచి కీసర బంగారు మైసమ్మ ఆలయం వరకు పోతురాజుల నృత్యాలు బ్యాండ్ మేళాల మధ్య వైభవంగా తీసుకెళ్లి మొక్కులు చెలించుకున్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ మధార్, తీన్మార్ మల్లన్న, ఆలేరు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు బీర్ల ఐలయ్య, కీసర సర్పంచ్ నాయకపు మాధురి, బీజేపీ నాయకులు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, నల్ల వెంకట్ రెడ్డిలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు సహకారం అందిస్తా: శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-కీసర

ప్రజా సమస్యలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని నాగారం మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు న్యూ హనుమాన్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో (కాంక్రీట్) ఫ్లోరింగ్ పనులను సొంత నిధులతో చేయించారు. దీంతో కాలనీవాలసులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్, శ్రవణ్‌కుమార్, ప్రమోద్, శ్యాంసుందర్, నాగేశ్వరరావు, రఘు యాదవ్, ప్రవీణ్ యాదవ్, ఎండీ.గౌస్, భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కౌంటింగ్ సెంటర్ల పరిశీలన



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు రిసిప్షన్, కౌంటింగ్ సెంటర్లను నూతనంగా ఏర్పాటు చేయడానికి అవసరమైన కేంద్రాన్ని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ పరిశీలించారు. శుక్రవారం జిల్లాలోని కీసర మండలం బోగారం హెూలీమేరీ ఇంజినీరింగ్ కాలేజీలో జిల్లాకు చెందిన ఐదు నియోజకవర్గాలకు సంబంధించి రిసిప్షన్, కౌంటింగ్ సెంటర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన వసతులు ఉన్నాయా..? లేవా..? అనే విషయాలను స్వయంగా కలెక్టర్ వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలేజీ ఆవరణతోపాటు కాలేజీలో రిసిప్షన్, కౌంటింగ్ సెంటర్లకు సంబంధించి బందోబస్తు, స్ట్రాంగ్ రూం, హాల్‌ను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. ఈవీఎం స్ట్రాంగ్ రూం ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రం అన్ని రకాలుగా సౌకర్యవంతంగా ఉండేలా ఉంటే దీన్ని ఐదు నియోజకవర్గాలకు రిసిప్షన్, కౌంటింగ్ సెంటర్ కేంద్రంగా ఏర్పాటు చేయనున్నట్టు స్పష్టం చేశారు. కాలేజీలో రిసిప్షన్, కౌంటింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తే అందుకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, ప్రత్యేకంగా బ్యారీకేడ్లు, తదితరాలు ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ కాలేజీ ఆవరణను పరిశీలించి ఆర్‌వో, ఈఆర్‌వో, ఏఆర్‌వో, ఏఈఆర్‌వో, అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. కలెక్టర్ వెంట డిప్యూటీ కలెక్టర్ సైదులు, కీసర, మల్కాజిగిరి ఆర్డీవోలు శ్యాంప్రకాశ్, రాజేశ్‌కుమార్, ఎన్నికల అధికారులు, పోలీసు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

టెట్ ప్రశాంతం : డీఈవో విజయాకుమారి

నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష-2023 (టెట్) ప్రశాతంగా నిర్వహించినట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాధికారి విజయకుమారి తెలిపారు. మొదటి పేపర్‌కు 32 కేంద్రాలు, రెండో పేపర్‌కు 25 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మొదటి పేపర్‌కు 7,560 మంది అభ్యర్థులు అలాట్ చేయగా, 6,100 మంది హాజరై 1,460 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్టు తెలిపారు. రెండో పేపర్‌కు 5766 మంది అభ్యర్థులు అలాట్ చేయగా, 5,106మంది అభ్యర్థులు హాజరుకాగా, 660 గైర్హాజరైనట్టు డీఈవో తెలిపారు.

అభివృద్ధి పనులపై కార్పొరేటర్ సమావేశం



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్‌లోని పలు కాలనీలకు మంజూరు చేసిన సీసీ రోడ్ల నిర్మాణాలు, కొత్తగా చేపట్టాల్సిన రోడ్ల నిర్మాణ పనులపై ఇంజనీరింగ్ ఏఈ స్వరూప, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌తో స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ సమావేశం అయ్యారు. పనులను త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రెడ్డి, విద్యా సాగర్, శ్రీకాంత్ యాదవ్, కొమ్ము సురేష్, ధనుంజయగౌడ్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



● మాజీ కార్పొరేటర్ గంధం జోత్స్న

నవతెలంగాణ-ఉప్పల్

సీఎం సహాయనిధి పేద ప్రజలకు వరం లాంటిదని రామంతపూర్ మాజీ కార్పొరేటర్ గంధం జోత్స్న అన్నారు. శుక్రవారం రామంతాపూర్‌లో పలువురు లబ్దిదారులకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. ఉదయశ్రీకి రూ.60 వేలు, అబిదాబేగంకు రూ.60వేలు, బాల జోసెఫ్‌కు రూ.60వేలు, వేణుకు రూ.60వేలు, విజయ్ భాస్కర్‌కు రూ.59,500వేలు, శైలజకు రూ.20వేల చెక్కులను అందజేశారు. అనంతరం జోత్స్న మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పేదవాడిని ఆదుకుంటూ అండగా ఉంటుందన్నారు. సీఎం సహాయనిధితో ఎంతో మంది పేదలు లబ్ది పొందుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మనీష్, ఆనంద్, బాబురావు పాల్గొన్నారు.

'ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి'



నవతెలంగాణ-మేడ్చల్

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ మున్సిపాల్టీల్లో పని చేస్తున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని ఔవుట్ సోర్సిగ్ యూనియన్ అధ్యక్షుడు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు తిరుపతి రెడ్డిలు అన్నారు. మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని మున్సిపల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుతో మేడ్చల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు శుక్రవారం మేడ్చల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మున్సిపాల్టీలో మూడేండ్ల నుంచి 25ఏండ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలోని వివిధ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేసినట్టుగా మున్సిపల్ ఉద్యోగులను సైతం క్రమబద్ధీకరించాలని కోరారు. హెల్త్ కార్డులు, ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కార్యదర్శులు జీ.లావణ్య, విఘ్నేష్, సహాయ కార్యదర్శులు పెంటయ్య, కె.లావణ్య, దివ్య, సుందర్ రెడ్డి, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజశేఖర్‌రెడ్డిని కలిసిన మెప్మా ఆర్పీలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

బీఆర్ఎస్ కంటోన్మెంట్ అసెంబ్లీ, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డిని కంటోన్మెంట్, మేడ్చల్ జిల్లాకి చెందిన మెప్మా ఆర్పీలు కలిశారు. ఈ సందర్భంగా తమకు వేతనాలు పెంచేలా కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు. అతి తక్కువ వేతనాలు ఉన్న తమకు కనీస వేతనం రూ.18 వేలు వచ్చేలా సహకరించాలని కోరారు. 18 ఏండ్లుగా పేద మహిళలకు వివిధ రకాల సేవలు అందిస్తున్న తమకు వచ్చే రూ.4 వేల వేతనం దేనికీ సరిపోవడం లేదన్నారు. హెల్త్ కార్డులు మంజూరు చేయించాలని, డ్రెస్ కోడ్ ఇప్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, మెప్మా ప్రాజెక్టు నుంచి అందరికీ గుర్తింపు ఐడీ కార్డులు ఇప్పించాలని వినతిపత్రంలో కోరారు. సమస్యలను మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటానని మర్రి హామీనిచ్చారు. ఈ కార్యక్ర మంలో బీఆర్‌టీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సంబు ప్రభాకర్, మెప్మా ఆర్పీలు మంగాదేవి, లోకాక్షి, శాంత, కవిత, వినోద, రాజేశ్వరి, అంజు, యధలక్ష్మి, పాల్గొన్నారు.

ఘనంగా మోక్షగుండ విశ్వేశ్వరయ్య జయంతి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీసులో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజనీర్స్ డే నిర్వహించారు. ట్రేడ్ యూనియన్ నాయకులు నర్సింగరావు, మహిళా నాయకురాలు శోభ విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ.. భారతదేశానికి స్వావలంబన దిశగా అనేక ప్రాజెక్టులను కట్టడంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య కృషి ఎంతో ఉందని చెప్పారు. హైదరాబాదు నగర అభివృద్ధికి ప్రణాళికలు ఆయన రూపొందించారని చెప్పారు. మైసూరు కేంద్రంగా అనేక శాస్త్ర సాంకేతిక సమాజాల నిర్మించి, శాస్త్ర విజ్ఞానానికి ఎంతో కృషి చేశారని చెప్పారు. బెంగళూరు సిటీ నిర్మాణానికి, దేశంలో అనేక ప్రాజెక్టులను నిర్మించడంలో ఆయన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో గౌసియా, అంజలి, వెంకటరమణయ్య, ఉన్నీకృష్ణన్, శివరామ కృష్ణ, శ్రీనివాస్, పరుశురాం పాల్గొన్నారు.

బోడుప్పల్‌లో..

ఇంజనీర్స్‌డే సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎస్‌వీఎం గ్రాండ్‌లో భారతి సిమెంట్, నవేరా ఏజెన్సీస్ సంయుక్తంగా ఇంజనీర్లకు సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ జక్కా వెంకట్ రెడ్డి ఇంజనీర్ల సేవలను పొగిడారు. అనంతరం పలువురు ఇంజనీర్లు మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను గుర్తుచేసుకున్నారు. అనంతరం 20మంది ఇంజనీర్లకు మేయర్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో టి.శంకర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, మల్లారెడ్డి, రమేష్, సుధాకర్, నాగరాజు పాల్గొన్నారు.



పదోన్నతి పొందిన పోలీసులకు సన్మానం



నవతెలంగాణ-బోడుప్పల్

విధి నిర్వహణలో పదోన్నతులు అనేవి చాలా ఆనందాన్ని ఇస్తాయని మేడిపల్లి సీఐ పీ.సైదులు అన్నారు. రాచకొండ కమిషనరేట్ మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐలుగా పనిచేస్తున్న దశరథ్, నర్సిరెడ్డిలు ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి పొందారు. దీంతో వారిని ఇన్‌స్పెక్టర్ సైదులు తన సిబ్బందితో కలిసి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా స్వీట్స్ పంపిణీ చేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారికి కొన్ని సూచనలు చేశారు. వృత్తి నిర్వాహణలో కర్తవ్యదీక్షతో, అంకితభావంతో పనిచేయాలన్నారు. దర్యాప్తు అధికారిగా మంచి నాలెడ్జ్‌ను పెంచుకోవాలని, ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించాలని సూచించారు.

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించండి

● కార్పొరేటర్ బన్నాల గీత



నవతెలంగాణ-ఉప్పల్

డివిజన్‌లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని కార్పొరేటర్ బన్నాల గీత విద్యుత్ అధికారులకు సూచించారు. శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా విద్యుత్ అధికారులతో కలిసి డివిజన్‌లో పర్యటించారు. డివిజన్‌లోని బీరప్ప గడ్డ, మండే మార్కెట్, అన్నపూర్ణ కాలనీ, సాయిరాం నగర్ కాలనీ, వార్డు ఆఫీస్ ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాల స్థానంలో నూతన పోల్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వార్డు కార్యాలయానికి అడ్డంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఏదుల కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోకోకండ జగన్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, ఫోటోబాలు, శ్యామ్, బాలు, అన్నపూర్ణ కాలనీ, సాయిరాం నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు

హకీంపేట్ డిపోలో ఆర్టీసీ ఉద్యోగుల సంబురాలు



నవతెలంగాణ-శామీర్‌పేట

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ అసెంబ్లీలో బిల్ ఆమోదం పొందడంతో తూంకుంట మున్సిపాలిటీ హకింపేట ఆర్టీసీ ఉద్యోగులు హర్షం శుక్రవారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి మిఠాయిలు తినిపించుకొని సంబురా లు జరుపుకున్నారు. అనంతరం వారు మాట్లాడు తూ.. ఉద్యోగులు కేసీఆర్‌కు ఎల్లవేళలా రుణపడి ఉంటారని చెప్పారు. గవర్నర్ తమిళసైకి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలలో తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర నాయకులు బాలరాజ్ గౌడ్, డిపో కార్యదర్శి గోపు శ్రీనివాస్, పవన్ కుమార్, సుగుణచారి, శామీర్ పేట సెక్టార్ ఇన్‌చార్జి ఎండీ మౌలానా, బొట్టు శీను, మహిళలు సుజాత, పుష్పలత, నవనీత, సంపూర్ణ, సునీత, విద్యారాణి పాల్గొన్నారు.

24న కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ సమావేశం



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ పట్టణంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో ఈనెల 24వ తేదీన నిర్వహించే కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు గువ్వ రవి ముదిరాజ్ కోరారు. శుక్రవారం ఆయన అధ్యక్షతన ఓబీసీ సెల్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మేడ్చల్‌లో నిర్వహించే సమావేశానికి ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు అజయ్ సింగ్ యాదవ్, టీపీసీసీ అధ్యక్షుడు ఎంపీ రేవంత్ రెడ్డి, ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్ హాజరవుతున్నట్లు తెలిపారు.

ఒకే రోజు వెయ్యి డబ్ల్యూటీసీ మెషిన్‌లు అమ్మకం

● అసాధారణమైన మైలురాయిని సాధించిన ఓపెన్‌క్యూబ్ టెక్నాలజీస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

దేశంలోనే ఒక వినూత్న టెక్నాలజీని తీసుకొచ్చి, మార్కెట్‌లో దూసుకుపోతున్న జెమ్ ఓపెన్‌క్యూబ్ టెక్నాలజీస్ అసాధారణమైన మైలురాయిని సాధించింది. సనాతన్ వరల్డ్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ కోసం యునైటెడ్ కింగ్డమ్‌కి చెందిన ఎస్ఆర్ఎఎమ్ అండ్ ఎంఆర్ఎఎం సంస్థ వైస్ చైర్మెన్, సనాతన్ వరల్డ్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ గురూజీ కుమారన్ స్వామిజీ వెయ్యి మెషిన్లు కొని దేశవ్యాప్తంగా వివిధ ఎయిర్‌పోర్టులు, షాపింగ్ మాల్స్‌తోపాటు జనాలు రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ డబ్ల్యూటీసీ మిషన్లు ఏర్పాటు చేయబోతున్నారు. ఇందులో కొన్ని మిషన్లను నిరుద్యోగ యువతను ఎంపిక చేసి వారి ఉపాధి కోసం ఉచితంగా అందించనున్నారు. ఇందుకు సంబంధించిన ఒప్పంద కార్యక్రమం నగరంలోని మెర్క్యూర్ హెూటల్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జెమ్ ఓపెన్‌క్యూబ్ టెక్నాలజీస్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థ సీఈఓ పి.వినోద్ కుమార్ మాట్లాడుతూ "రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే 600కిపైగా మెషీన్లు అమ్ముడయ్యాయని, సనాతన్ వరల్డ్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ ఒప్పందంతొ ఒక్కరోజే 1600 వందలకు చేరిందని, ఈ త్రైమాసికంలో 10వేల డబ్ల్యూటీసీ మెషీన్‌లను ఇన్‌స్టాల్ చేయాలనే లక్ష్యంతో, జెమ్ ఓపెన్‌క్యూబ్ ముందుకు వెళ్తుందని, దేశవ్యాప్తంగా బుకింగ్‌లు వస్తున్నాయని, లక్షా 67 వేలకు లభ్యమయ్యే ఈ మెషీన్‌ను టీ లవర్స్ ఉండే ప్రతిచోటకు అందుబాటులోకి తీసుకువెళ్లడమే మా లక్ష్యం" అని పేర్కొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ దినోత్సవం

నవతెలంగాణ-సిటీబ్యూరో



మోక్షగుండం విశ్వేశ్వరయ్య 152వ జన్మదినం సందర్భంగా అసోసియేషన్ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ ఆధ్వర్యంలో బంజారా హిల్స్‌లోని రాడిసన్ బ్లూ హెూటల్లో ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కే.ఎల్. సుబ్రహ్మణ్యం, చెరుకూరి సత్యనా రాయణ, టీ.చంద్రశేఖర రావులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మహేందర్ రెడ్డి, కాశీరాం, నర్మదా, రాజ్ కుమార్, భీమ్ రావు, రమేష్, సుధాకర్, మమతతో పాటు పలువురు ఇంజనీర్లు పాల్గొన్నారు.

'బీజేపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలి'

నవతెలంగాణ-బంజారాహిల్స్



ఎమ్మెల్సీ కవిత కు అక్రమంగా ఈడి నోటీసులు జారీ చేసిందని ప్రజా సంఘాల జేఏసీ చైర్మెన్ గజ్జెల కాంతం అన్నారు. సోమజిగూడా ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లా డారు. కేంద్ర ప్రభుత్వం అరాచక పాలన కొనసాగిస్తోందనీ, త్వరలోనే జరిగే ఎన్నికల్లో శాశ్వత చరమగీతం పాడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బీజేపీ దక్షిణాది రాష్ట్రాల ప్రజలు ఇష్టం లేదనీ విమర్శించారు. తెలంగాణలో బీజేపీచరిష్మా మసక బారడంతో మరొక సారి కవిత మీద ఈడి దాడులు చేయించి ప్రజల సానుభూతి పొందాలని చూస్తుందన్నారు. ఈ నెల 18 వ తేదీ నుండి జరిగే అత్యవసర పార్లమెంట్ సమావేశాలలో దమ్ము ఉంటే మణిపూర్ , హర్యానా రాష్ట్రాల్లో జరిగిన అల్లర్ల ప్రస్తావన తీసుకు వచ్చి చర్చించాలని పేర్కొన్నారు. ప్రయివేటు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాములు,పూసలు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోలా శ్రీనివాస్,ఉస్మానియా జేఏసీ నేత డా.సంజీవ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆందోళనలు



- ఆందోళనకు టీజీయంఈయూ మద్దతు

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ వైద్యవిధాన పరిషత్‌లో నెలకొన్న సమస్యల సాధనలో భాగంగా తెలంగాణ వైద్యవిధాన పరిషత్ ఉద్యోగుల అసోసియేషన్ (జేఏసీ) ఆధ్వర్యంలో ఈ నెల 21-27వ తేదీ వరకు నిర్వహించనున్న ఆందోళనా కార్యక్రమాలకు ఏఐటీయూసీ అనుబంధ సంస్థ తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎచ్-1725) పూర్తి మద్దతు ఇస్తుందని రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ ఆందోళనా కార్రక్రమాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వైద్యవిధాన పరిషత్ ఆధీనంలోని జిల్లా, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ ఆస్పత్రుల ఎదుట ఉదయం హాజరు సమయంలో జేఏసీ తరపున నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు తెలిపారు. గత గురువారం హిమాయత్‌నగర్‌లోని కామ్రేడ్ సత్యనారాయణరెడ్డి భవన్‌లో తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను ఆమోదించారు. వాటిలో ప్రధానంగా వైద్య విధాన పరిషత్‌ను వెంటనే రద్దు చేసి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్‌గా మార్చాలని, వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు 010 పద్దు కింద ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలని, మెడికల్ కాలేజీలుగా అప్ గ్రేడ్ అయిన తెలంగాణ వైద్యవిధాన పరిషత్ వైద్యశాలల్లోని ప్రమోషన్ పోస్టులను యధావిధిగా ఉంచి ప్రమోషన్స్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వైద్యవిధాన పరిషత్‌కు అవసరమయ్యే పోస్టులను ఏర్పాటు చేస్తూ స్టాఫ్ రిస్ట్రక్చర్ చేయాలని, వైద్య విధాన పరిషత్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, తెలంగాణ వైద్యవిధాన పరిషత్ ఉద్యోగులను డీఎంఈలో విలీనమయ్యేందుకు ఆప్షన్ ఇవ్వాలని, 317 జీఓ అమలు చేసి వెంటనే ప్రమోషన్స్ ఇవ్వాలని కోరారు. ప్రతి జిల్లాకో డీసీహెచ్ఎస్ పోస్టు చొప్పున 33 జిల్లాలకు క్రియేట్ చేయాలని, వైద్య విధాన పరిషత్‌లో పదోన్నతుల్లేని కేటగిరీ ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలని, వైద్య విధాన పరిషత్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ప్రతి నెలా మొదటి తారీఖున వేతనాలు ఇవ్వాలని, వైద్య విధాన పరిషత్ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పీఆర్‌సీని అమలు చేయాలనే డిమాండ్లపై కులంకషంగా చర్చించి వాటి సాధన కోసం వారం రోజుల ఆందోళన కార్యక్రమాలను నిర్వహిచనున్నట్టు సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎండీ. యూసూఫ్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు వి.వేణు కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఇందిరా, శ్రీలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంసీఎస్ రాజు, ఎం.యాదయ్య, వి.కరుణాకర్, డిప్యూటి ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌చారి, రాష్ట్ర కార్యదర్శులు ఎం. మధుసూధన్‌రెడ్డి, బి.సరస్వతి, ఐ.అమతరావు, బి.వెంకటేశ్వర్లు, అర్.జగన్మోహన్‌రావ్, రాష్ట్ర కోశాధికారి శాంత్‌కుమార్, యూనియన్ నాయకులు వెంకట్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీసీ-డీటీసీయూలో నిరసన

- ముజీబ్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన ప్రదర్శన

నవతెలంగాణ-సిటీబ్యూరో

డాక్టర్ కల్పనా కాంటే ప్రవర్తనలో ఎలాంటి మార్పులేదని, ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఆమెపై తక్షణమే చర్యలు తీసుకోవాలని టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం హుస్సేని(ముజీబ్) డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్టీసీ-డీటీసీయూ యూనిట్‌లో రెండవ రోజు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటి డాక్టర్ కల్పనా కాంటే ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేస్తున్నారని ఆయన తెలిపారు. ఉద్యోగులకు సరైన సమయంలో సంవత్సరిక ఇంక్రిమెంట్ కానీ జీపీఎఫ్‌లోన్ గాని చివరికి బస్సు పాస్‌పై సంతకం చేయని పరిస్థితిపై ఉద్యోగుల ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఇద్దరు కాంట్రాక్టు ఉద్యోగులు చెప్పిన మాటలు విని ఇతర ఉద్యోగులపై ప్రతాపం చూపించడం, కిందిస్థాయి ఉద్యోగులనూ వదిలిపెట్టకపోవడం దారుణమన్నారు. తక్షణమే ప్రభుత్వం ఆమెపై చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్. విక్రమ్ కుమార్, సభ్యులు ఉమర్ ఖాన్, కుర్రాడి శ్రీనివాస్, మొహమ్మద్ అబ్దుల్ ముజీబ్, ఖాలీద్ అహ్మద్, బొల్లిగిద్ద శంకర్, శ్రీధర్ నాయుడు, ముఖీం ఖురేషి, గెజిటెడ్ ఆఫీసర్లు రాణి, వెంకట్ రెడ్డి, నాల్గవ తరగతి నాయకులు మహమ్మద్ అబ్దుల్ ముజీబ్, సెంట్రల్ లైబ్రరీ, మానసిక వైద్యశాల, ఛాతి వైద్యశాల, ఆయుష్ విభాగం, తెలంగాణ వక్ఫ్ బోర్డు, ఐటీఐ కళాశాల ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

టెట్ పరీక్ష ప్రశాంతం : డీఈవో ఆర్.రోహిణీ

నవతెలంగాణ-సిటీబ్యూరో



హైదరాబాద్ జిల్లాలో టెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని డీఈవో ఆర్.రోహిణి తెలిపారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పేపర్-1,2 పరీక్షలకు మొత్తం అభ్యర్థులు 45,561 మందికి గాను, 38,472 మంది హాజర య్యారని చెప్పారు. ఇందులో పేపర్-1కు 23,760 మంది హాజరుకావాల్సి ఉండగా, 18,901 మంది హాజరయ్యారని, 4,859 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. అదే విధంగా పేపర్-2 పరీక్షకు 21,840 మంది గాను, 19,574 మంది హాజరయ్యారని, 2,266 మంది పరీక్షకు గైర్హాజరైనట్టు వివరించారు. పేపర్-1 పరీక్షను 99 కేంద్రాల్లో, పేపర్-2 పరీక్షను 91 కేంద్రాల్లో నిర్వహించినట్టు వివరించారు. ఎలాంటి మాల్‌ప్రాక్టిస్ కేసులు నమోదు కాలేదని డీఈవో తెలిపారు.

ఆత్మీయ ప్రజా పాదయాత్రకు అపూర్వ ఆదరణ



- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్ ముదిరాజ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈ నెల 17న తుక్కుగూడలో జరిగే సోనియా గాంధీ విజయభేరీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం అచ్యుత్ రెడ్డి మార్గ్, విద్యానగర్, సైచరన్ కాలనీ, నాగసాయి కుంట, అడిక్ మెట్ డివిజన్‌లో 'ఆత్మీయ ప్రజా పాదయాత్ర' నిర్వహించారు. ఈ సంద ర్భంగా నగేష్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను సాకారం చేయడంతో పాటు సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుచేసి భవిష్యత్తుకు బాటలు వేశా రని, ప్రస్తుతం రాష్ట్రంలో రాక్షస కుటుంబ పాలన నడుస్తు న్నదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రజాక్షేత్రంలో పల్చబడి ప్రజల విశ్వాసం కోల్పోయిందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో బీఆర్ఎస్ పార్టీ విఫల మైందని, ప్రజల్ని ఐక్యంచేసి రానున్న ఎన్నికలలో కేసీఆర్ ప్రభుత్వాన్ని ఓడించాలని, కాంగ్రెస్ పార్టీ జెండా ఈ గడ్డ మీద ఎగురవేయాలని 'ఆత్మీయ ప్రజా పాదయాత్ర' పేరుతో పాదయాత్ర చేపట్టినట్టు ఆయన తెలిపారు. రాష్ట్రం నుంచి కేసీఆర్‌ను సాగనంపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ పాదయాత్రలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు వై.శ్రీనివాస్, రాజు, వర్మ, వరదరాజు, నాగసాయి, ఆనంద్, రాములు, పర్వతాలు, ఉదయ్, మహమ్మద్ పాషా, గోవర్ధన్ సత్య, మధు, వెంకటేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించకపోతే నోటీసు జారీ చేస్తాం

- నిమ్స్ డైరెక్టర్ బీరప్ప



నవతెలంగాణ-బంజారాహిల్స్

నిమ్స్‌లో కాంట్రాక్టు బేస్‌గా పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు సరైన సమయంలో వేతనాలు చెల్లించనప్పుడు నోటీసులు జారీ చేస్తామని డైరెక్టర్ డాక్టర్ బీరప్ప అన్నారు. శుక్రవారం నిమ్స్ సెక్యూరిటీ సిబ్బంది, సీఐటీయూ నాయకులు ఆయన కార్యాలయంలో కలిసి డాక్టర్ బీరప్పకు వినతిపత్రం అందజేశారు. అనంతరం బీరప్ప మాట్లా డుతూ క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రయివేటు లిమిటెడ్ కాంట్రాక్ట్ సంస్థ వారు బిల్లులు పెట్టడం లేదని,పాత చెక్కులు రెడీగా ఉన్నా తీసుకు వెళ్లడం లేదని అన్నారు. సెక్యూరిటీ గార్డులకు సమయానికి వేతనాలు ఇవ్వాలని ఎంత ఒత్తిడి చేసిన స్పందించడం లేదని కావున కాంట్రాక్టర్‌కు నోటీసు ఇచ్చి అగ్రిమెంట్ రద్దు చేస్తామని అన్నారు. వీలైనంత తొందరలో సెక్యూరిటీ గార్డులకు వేతనాలు ఇప్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు ఎం.వెంకటేష్, ఉపాధ్యక్షురాలు కుర్ర లక్ష్మి, కోశాధికారి ఏ కవిత అంబయ్య సోనాలి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత నిజాయితీ వార్తలు అందించటం విలేకరుల కర్తవ్యం

నవతెలంగాణ-కల్చరల్



నిజాయితీ నిబద్ధత తో కూడిన వార్తలు అందించటం విలేకరుల ప్రధాన కర్తవ్యం అని ప్రముఖ పత్రికా రచయితలు పేర్కొన్నారు రవీంద్రభారతి సమావేశ మందిరంలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వయోధిక పాత్రికేయ సంఘం నిర్వహణలో డాక్టర్ చిల్లర భవానీ దేవి రచించిన కలం యోధుడు కోటం రాజు రామారావు జీవిత చరిత్ర సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది ముఖ్య అతిథిగా ప్రముఖ పత్రికా రచయిత కే.రామచంద్ర మూర్తి పాల్గొని సంపుటిని ఆవిష్కరించి ప్రసంగించారు. జీవితమంతా పల పరిశోధనత్మక సమాచారాన్ని సేకరించి ప్రజలకు అందించటం కర్తవ్యంగా భావించిన రామా రావు నిజాన్ని నిర్భయంగా రాయటంలో ఎంతటి వారినైనా వదల లేదని అన్నారు.నేటి పత్రికా రచయితలు ఆయన ను స్ఫూర్తి గా గ్రహించాలని కోరారు.అధ్యక్షత వహించిన సీనియర్ పాత్రికేయుడు దాసు కేశవ రావు సంపుటి లో రామారావు గురించిన విశేషాలు రచయిత్రి ఆసక్తి కరం గా చెప్పారని అన్నారు.సీనియర్ పాత్రికేయులు జీ.వల్లీశ్వర్, ఉదయవర్లు మాట్లాడుతూ రామారావు పాత్రికేయ రంగంలో తొలి తరం కు చెందిన వారని పేర్కొన్నారు. సంఘం కార్యదర్శి కే.లక్ష్మణ రావు నివేదిక తొలుత స్వాగతం పలికారు.

ప్రజల హితం కోసం సమృద్ధి యజ్ఞం



- మాధవీలత

నవతెలంగాణ-బంజారా హిల్స్

భారత భాగ్య సమృద్ధి యజ్ఞం పేరుతో 45 రోజుల పాటూ భాగ్యనగరంలోని సీతారాం భాగ్ రామ మందిరంలో భారత దేశ సర్వతోముఖాభివద్దినీ కాంక్షిస్తూ 15 అక్టోబర్ నుంచి 27 నవంబర్ వరకు మహాయజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్టు లతామా ఫౌండేషన్ వారు తెలిపారు. ప్రపంచ శాంతి, సామరస్యాన్ని కాపాడడానికి భాగ్యనగర పురోభివద్దిని కోరుకుంటూ సనాతన ధర్మ సాంప్రదాయలకు అనుగుణంగా 45 రోజుల పాటూ మహా యజ్ఞాన్ని నిర్వహించాలని లతామా ఫౌండేషన్ నిర్ణయించింది.

ఈ మహా యజ్ఞానికి సంబంధించిన ప్రచార సామగ్రిని శుక్రవారం బంజారా హిల్స్ లోని విరించి గ్రూపు కార్యాలయంలో మాధవి లత, మేనేజింగ్ ట్రస్టీ, లతామా ఫౌండేషన్, ఛైర్ పర్సన్, విరించి హాస్పిటల్ వారు ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ పలు హిందూ ధార్మిక సంస్థలతో కలసి భాగ్యనగరంలో హిందువుల హితం కోరుతూ ఈ యజ్ఞం నిర్వహిస్తున్నామని తెలిపారు. వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించబడే ఈ భారత భాగ్య సమద్ధి యజ్ఞం లో ప్రధానంగా 45 రోజుల పాటూ సర్వ కార్యసిద్ధి సహస్ర చండీసహిత మహా రుద్ర కామేశ్వరి యాగం జరుగుతుందని చెప్పారు. ఇలా సమాజ మంచి కోరుతూ నిర్వహించబడే ఈ యజ్ఞంలో ప్రతి కుటుంబ శ్రేయస్సు, భాగ్య సమద్ధి, వారి జీవితంలోని పలు సమస్యల నివారణ కోసం వైదిక ధర్మంలో పేర్కొనబడిన 36 రకాల వైదిక విధులు, 12 రకములైన కళ్యాణాలతో పాటూ పలు విధములైన హెూమాలు కూడా చేయించబడతాయిని చెప్పారు. దీనికి సంబంధించిన ప్రచార కార్యక్రమాన్ని రేపటి నుండి భాగ్యనగరంలోని పలు ప్రాంతాలలో నిర్వహించనున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో మాధవి లత, మేనేజింగ్ ట్రస్టీ, లతామా ఫౌండేషన్ చైర్‌పర్సన్ విరించి హాస్పిటల్ తో పాటూ యమన్ సింగ్,సామాజిక కార్యకర్త,లతామా ఫౌండేషన్ ప్రమోద్ కుమార్, నిర్వాహకులు, లతామా ఫౌండేషన్‌తో పాటూ రాజశేఖర్, శ్యాంసుందర్ లు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
శనివారం | సెప్టెంబర్ 16, 2023 | www.navatelangana.com

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఇందిరా నగర్ బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 2 (జూబ్లీహిల్స్ డివిజన్) పరిధిలోని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కిరణ్, వీరునాయక్, సోను, శ్రీరాములు నాయక్, జగదీష్, కిట్టు నాయక్‌తో పాటు మరో 20 మంది యువకులు శుక్రవారం కార్పొరేటర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి విజయారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జూబ్లీహిల్స్ డివిజన్ సీనియర్ నాయకులు మోహన్ యాదవ్, బాబా గౌడ్, పవన్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-ఓయూ

తార్నాకలోని వీధి నెంబర్ 10, 11 నివాసితులు వారి ఇండ్ల దగ్గర ఉన్న ప్రమాదకరమైన హై టెన్షన్ ఎలక్ట్రికల్ లైన్ పోల్ 33 కెవి వైర్లను తరలించాలని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు శ్రీ మోతె శోభన్ రెడ్డిలను శుక్రవారం విన్నవించుకున్నారు. దాంతో వారు అధికారులతో కలిసి పరిశీలించారు.అ లాగే ఈ సమస్యను త్వరగా పరిష్కార అయ్యేటట్టు చూస్తానని విద్యుత్ శాఖ అధికారులు డిప్యూటీ మేయర్‌కు తెలిపారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ 33 కేవీ తీగల షిఫ్టింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు విద్యుత్ శాఖ చేస్తుందని, అలాగే విషయం పై విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్ రెడ్డితో మాట్లాడి అవసరమైన అనుమతులు వచ్చే విధంగా చూస్తానని అన్నారు.

ఆహ్వాన పత్రికలు అందజేసిన కార్పొరేటర్ దీపిక



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఈనెల 17న పెరేడ్ గ్రౌండ్లో బీజేపీ ఆధ్వర్యంలో విమోచన దిన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను శుక్రవారం కార్పొరేటర్ దీపిక నరేష్ వ్యాపారస్తులకు, స్థానికులకు ఇంటింటికి వెళ్లి అందజేశారు.

పర్యావరణ రక్షణకు మట్టి గణపతులను ప్రతిష్టించాలి



బీఆర్ఎస్ కంటోన్మెంట్ అభ్యర్థి లాస్య నందిత

నవతెలంగాణ-కంటోన్మెంట్

ప్రజలంతా పర్యావరణహితంగా మట్టి గణపతులను ప్రతిష్టించుకోవాలని బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత పిలుపునిచ్చారు శుక్రవారం దివంగత ఎమ్మెల్యే సాయన్న క్యాంపు ఆలయంలో ఆమె మట్టి గణపతి ప్రతిమల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి గణపతి పూజ చేయటం శ్రేష్టమైనదని, అంతేకాకుండా పర్యావరణ పరిరక్షించడానికి దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు టీఎన్ శ్రీనివాస్, పనస సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కిషన్ రెడ్డి దీక్ష ఓ డ్రామా :తుంగ బాలు



నవతెలంగాణ-ఓయూ

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి చేసిన దీక్షను ఓ డ్రామాగా బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు ఒక ప్రకటనలో అభివర్ణించారు. కిషన్ రెడ్డి దీక్ష చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబాన్ని వ్యక్తిగతంగా విమర్శించడాన్ని తీవ్రంగా ఖండించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ తొమ్మిదేండ్లలో నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయిందని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్రమోడీ జన్మదినం సందర్భంగా దేశ నిరుద్యోగ యువత అన్‌ఎంప్లాయ్ మెంట్ డేగా సామాజిక మాధ్యమాల్లో ఎత్తిచూపిన విషయాన్ని మరిచిపోయారా అని ప్రశ్నించారు. కేంద్రప్రభుత్వంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయకుండా, రాష్ట్రంలో రెండు లక్షల ఇరవై వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసిన కేసీఆర్ ప్రభుత్వంపై నిందలు వేయడం సూర్యునిపై ఉమ్మివేసిన చందంగా ఉందని ఎద్దేవా చేశారు. ఉద్యోగాలు అడిగితే పకోడీలు వేసుకోమన్న మోడీ అహంకారంపై వ్యాఖ్యానించాలని సూచించారు. ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులకు ఆమోద ముద్ర వేయకుండా యూనివర్సిటీలలో బోధన, బోధనేతర సిబ్బంది భర్తీని గవర్నర్ ద్వారా బీజేపీయే అడ్డుకుంటోందని ఆరోపించారు. దేశంలో నూతన విద్యా విధానాన్ని తీసుకువచ్చి బడుగు, బలహీనవర్గాలకు ఉన్నత విద్యను దూరం చేసే కుట్రను ఆచరణలోకి తీసుకువచ్చారని దుయ్యబట్టారు. అయినాకిషన్ రెడ్డి స్పందించకపోవడం తెలంగాణ సమాజం గమనిస్తోందని అన్నారు. భారత రాజ్యాంగ వ్యవస్థలను తన గుప్పిట్లో పెట్టుకుని ప్రతిపక్ష పార్టీల నాయకులను లక్ష్యంగా చేసుకుని కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. తొమ్మిదేండ్లలో దేశ యువత బాగుకోసం చేసిన ఒక మంచి పనిని చెప్పాలని సవాల్ చేశారు. కిషన్ రెడ్డికి, బీజేపీకి తగిన గుణపాఠం చెప్పేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తెలంగాణలో మరోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఉద్ఘాటించారు.

శ్రీ సద్గురు జగలింగేశ్వర స్వామి పూజలో శ్రీ గణేష్

నవతెలంగాణ కంటోన్మెంట్

ఈస్ట్ మారేడ్ పల్లి గాంధీ నగర్ లో శ్రీ సద్గురు జగలింగేశ్వర ప్రసన్న స్వామి పూజా వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి శ్రీ గణేష్ ఫౌండేషన్ శ్రీ గణేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులు శ్రీ గణేష్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెద్ద మల్లప్ప, లింగప్ప, శేఖర్, భవంతు, పూజరి బాబు, నరేష్ పాల్గొన్నారు.

ఎంపీ కృష్ణయ్యను పరామర్శించిన ఎమ్మెల్యే సీతక్క

నవతెలంగాణ-ముషీరాబాద్



ఇటీవల వనపర్తి సభలో స్వల్ప అస్వస్థతకు గురైన రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్యను విద్యానగర్ లోని బీసీ భవన్ లో ములుగు ఎమ్మెల్యే సీతక్క కలిసి పరామర్శించారు



బల్కంపేట దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన రామ్ గోపాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ చీర చిత్ర శ్రీకాంత్.

నవతెలంగాణ-బేగంపేట

మట్టి గణపతులను పంపిణీ చేసిన కార్పొరేటర్ దీపిక



నవతెలంగాణ కంటోన్మెంట్

జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయం వద్ద జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో కార్పొరేటర్ దీపికా నరేష్ వార్డు ఏవో గాయత్రీ దేవి, ఎస్ఎఫ్ఏ సుధీర, సూపర్వైజర్ నర్సింగ్ రావు తో కలిసి మట్టి గణేశులను పంపిణీ చేశారు. పర్యావరణాన్ని కాపాడే బాధ్యత మనందరిదని, మట్టి వినాయకుడ *కి పూజించుకుందాం మన పర్యావరణాన్ని కాపాడుకుందామని కార్పొరేటర్ చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్టు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం రాంగోపాల్ పేట డివిజన్ కాచిబౌలిలో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తీలో ఏ సమస్య ఉన్నా పరిష్కరిస్తామని హామీ ఇచ్చా రు. బస్తీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరగా, 3 రోజుల్లో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదేవిధంగా సీవరేజ్, రోడ్డు నిర్మాణ పనులను కూడా త్వరలోనే పూర్తి చేయడం జరుగు తుందని చెప్పారు. బస్తీ వాసుల సౌకర్యార్థం కమ్యునిటీ హాల్ నిర్మాణం కోసం రూ. 60 లక్షలు మంజూరైయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తా మని వివరించారు. బస్తీలో అవసరమైన ప్రాంతాల లో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని, శిథిలమైన స్తంభాల స్థానంలో నూతన స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. గతంలో ప్రతి ఏడాది వర్షాకాలంలో బస్తీలోని నాలాకు వచ్చే వరదనీరు నాలా పరిసరలాలోని ఇండ్లలోకి, కాలనీలోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడేవారని చెప్పారు. నాలా అభివృద్ధి, పూడిక తొలగింపు చేపట్టి వరద సమస్యను పరిష్కరించినట్టు వివరించారు. నాలాలో నీటి ప్రవాహం సాఫీగా సాగే విధంగా నాలాపై ఉన్న బ్రిడ్జిని మరింత ఎత్తులో నిర్మించే పనులను కూడా త్వరలోనే ప్రారంభించనున్నట్టు తెలిపారు. చెత్త, ఇతర వ్యర్థాలు నాలాలో వేయడం వల్ల పరిసర ప్రాంత ప్రజలకే సమస్యలు ఏర్పడతా యని, నాలాలో చెత్త వేయవద్దని కోరారు. నాలాకు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జేఎన్ఎన్‌యూఆర్ఎం వాంబే పథకాల కింద ఎన్నో ఏండ్ల క్రితం నిర్మించిన ఇండ్లు శిథిలావస్థకు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. అవసరమైన మరమ్మతు లు చేపట్టేందుకు అధికారులు సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. మంత్రి వెంట జోనల్ కమిషనర్ రవి కిరణ్, డీసీ శంకర్, మాజీ కార్పొరేటర్లు అత్తిలి అరుణ గౌడ్, కిరణ్మయి, ఈఈ సుదర్శన్, వాటర్ వర్క్స్ సీజీఎం ప్రభు, ఎలెక్ట్రికల్ డీఈ శ్రీధర్, స్ట్రీట్ లైట్ డీఈ భరత్, బస్తీ అధ్యక్షుడు జగదీశ్, మహేష్, శ్రవణ్ కుమార్, వెంకటేష్, మహేష్, రాజేందర్ ఉన్నారు.

గణేష్ నవరాత్రుల నిర్వహణకు ఏర్పాట్లు

గణేష్ నవరాత్రులను అత్యంత ఘనంగా నిర్వహించే విధంగా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను చేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద సికింద్రాబాద్‌లోని గణేష్ టెంపుల్ వద్ద జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని పిలుపునిచ్చారు. పర్యావరణానికి హాని చేసే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను ప్రతిష్టించవద్దని కోరారు. మట్టి విగ్రహాలను ప్రతిష్టించే విధంగా ప్రజలను ప్రోత్సహించే లక్ష్యంతో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పోల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ల ఆధ్వర్యంలో 4.64 లక్షల మట్టి విగ్రహాలను జీహెచ్ఎంసీ పరిధిలో పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ విగ్రహాల పంపిణీ కోసం సర్కిల్‌కు ఏఎంఓహెచ్‌ను ప్రత్యేక అధికారిగా, వార్డ్‌కు ఒక వార్డ్ స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించినట్టు చెప్పా రు. ఒక్కో వార్డ్‌లో 2500 విగ్రహాలను పంపిణీ చేయ డం జరుగుతుందని పేర్కొన్నారు. బేగంపేట సర్కిల్ లో 11,800 విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గణేష్ టెంపుల్ చైర్మెన్ సత్యనారాయణ, మాజీ చైర్మెన్ జయరాజ్, హన్మంత రావు, శానిటేషన్ డీఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.



కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

- ప్రజాస్వామ్యబద్ధంగా వారు చేస్తున్న ఉద్యమానికి వీసీ అడ్డుపడటం సరికాదు
- తెలుగు హెడ్ ప్రొఫెసర్ ఖాసీం



నవతెలంగాణ-ఓయూ

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో గత కొంతకాలంగా చేస్తున్న ఉద్యమంలో భాగంగా ఆర్ట్స్ కళాశాల బస్‌స్టాప్‌లో శుక్రవారం కార్యక్రమం కొనసాగింది. ఓయూ పరిధిలో ఉన్న అన్ని కళాశాలల అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఓయూ తెలుగు విభాగం హెడ్ ప్రొఫెసర్ ఖాసీం సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ అనే పదం లేకుండా చేస్తానని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ వెంటనే విశ్వవిద్యాలయ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసి వారి మాటను నిలబెట్టుకోవాలన్నారు. అనేక ఏండ్లుగా విశ్వవిద్యాలయాలను నమ్ముకొని పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను విస్మరించటం సరికాదన్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకులు అన్ని రకాలుగా క్వాలిఫికేషన్ కలిగి ఉన్నారని, అకాడమీక్‌గా, అడ్మినిస్ట్రేషన్ పరంగా అన్ని సేవలు అందిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా చేస్తున్న ఉద్యమానికి వీసీ అనుమతించకుండా ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. విశ్వవిద్యాలయంలో అధ్యాపకుల సమస్యలపై వారు నిరసన తెలపటం రాజ్యాంగపరంగా వచ్చిన హక్కని ఆ హక్కును కాలరాసే అధికారం ఎవరికీ లేదని తెలిపారు. ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయి కాబట్టి రెగ్యులరైజ్ అయ్యే వరకు మీరు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆ ఉద్యమంలో మీ వెంట తానుంటా అని ఆయన హామీ ఇచ్చారు. ఒక అధ్యాపకుడిగా అది తన బాధ్యత అని తెలిపారు. విశ్వవిద్యాలయ విద్యకు సంబంధంలేని కార్యక్రమాలను ఆర్ట్స్ కాలేజీ ఎదుట అనుమతిస్తూ ఉపాధ్యాయులు చేస్తున్న కార్యక్రమాలకు అనుమతి నిరాకరించటం ముమ్మాటికీ సరికాదన్నారు. కావున వెంటనే ఉద్యమానికి వీసీ టెంటు, మైకుకు అనుమతి నివ్వాలని కోరారు. వెంటనే ప్రభుత్వం సమస్యను పరిష్కరించా లని కోరారు. సదానంద రెడ్డి పీపుల్స్ ప్రొటెక్షన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ధర్నాకు హాజరై ప్రసంగించి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ధర్మ తేజ, డా. వేల్పుల కుమార్, డా. విజయేందర్ రెడ్డి, డా. సిహెచ్ వెంకటేష్, డా. ఈ ఉపేంద్రరావు, డా. అశోక్ బసవ, డా. స్రవంతి రెడ్డి, డా. రేష్మా రెడ్డి, డా. ఏ సత్యం, డా. జి వెంకటేశ్వర్లు,డాక్టర్ నరసింహారావు డా. మాధవి, డా. నవీన్ రెడ్డి, డా. ఎం. కిరణ్, తాళ్లపల్లి వెంకటేశం డాక్టర్ ఓ కష్ణయ్య. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ ధర్మ తేజ మరియు డాక్టర్ సిహెచ్ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించి నడిపించారు.

మాజీ మేయర్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



నవతెలంగాణ-ఓయూ

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్ నుంచి పరకాల వరకు నిర్వహిస్తున్న బైక్ ర్యాలీలో మాజీ మేయర్ బండ కార్తీక రెడ్డి పాల్గొన్నారు. పరేడ్ గ్రౌండ్ నుంచి బైక్ ర్యాలీని తెలంగాణ ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్ జెండా ఊపి ప్రారంభించారు.అంతకుముందు తార్నాక చౌరస్తా నుంచి భారీగా బైక్ ర్యాలీతో పెరేడ్ గ్రౌండ్ కు చేరుకున్న బండ కార్తీక్ రెడ్డి, సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్, తార్నాక, ఉప్పల్, భైరాన్‌పల్లి, ఖిలాషాపూర్, పరకాల వరకు బైక్ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, యువ మోర్చా నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భవిష్యత్తు కోసం కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలి

- తమిళనాడు ఎమ్మెల్యే రూబి మనోహరన్



నవతెలంగాణ-బేగంపేట్

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, భవిష్యత్ నిర్మాణం కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని సనత్‌నగర్ నియోజకవర్గం ఏఐసీసీ పర్యవేక్షకులు, తమిళనాడు కాంగ్రెస్ ఎమ్మెల్యే రూబీ మనోహరన్ అన్నారు. సనత్ నగర్ డివిజన్‌లోని సెయింట్ థెరిస్సా హాస్పిటల్‌లో ఉద్యోగులు, వైద్య సిబ్బంది, నర్సులతో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రూబీ మనోహర్ మాట్లాడుతూ.. 17వ తేదీన తుక్కుగూడలో నిర్వహించే విజయభేరి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం నియంతత్వ పాలన సాగిస్తుందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రహస్య ఒప్పందంతోనే పనిచేస్తున్నాయని అన్నారు. డాక్టర్ కోట నీలిమ మాట్లాడుతూ మహిళలు, బహుజన వర్గాల సమస్యలను కాంగ్రెస్ మాత్రమే అర్థం చేసుకుంటుందని అన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన మిమ్మల్ని ప్రభుత్వం విస్మరిచ్చిందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తనకు అవకాశం ఇవ్వాలని ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఇవాన్ వాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో థామస్ అమ్మ, అబ్బాస్ షరీఫ్, ఇబ్రహీం పటేల్ తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట వారసత్వాన్ని బీజేపీ లూటీకి యత్నం

సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి శ్రీనివాస్



నవతెలంగాణ-ఓయూ

వేలాదిమంది ప్రాణ త్యాగాలు చేసి నిరంకుశ నిజాంను తరిమికొట్టిన కమ్యూనిస్టుల తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని బీజేపీ లూటీ చేసే ప్రయత్నాలు చేస్తున్నదని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం 75 వసంతాల వజ్రోత్సవాలలో భాగంగా శుక్రవారం వారసిగూడ చౌరస్తాలో సాయుధ పోరాట వారోత్సవాలకు సంబంధించిన కటౌట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలందరికీ తెలిసిన కమ్యూనిస్టుల తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను కూడా బీజేపీ దోచుకుని హైదరాబాద్ విమోచన దినోత్సవం నిర్వహించడం దుర్మార్గమన్నారు. నిజాం వ్యతరేక పోరాటానికి, హైదరాబాద్ విమోచనానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు ఏమైనా సంబంధం ఉందా అని ప్రశ్నించారు. కేవలం బీజేపీ తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని లాక్కునే ప్రయత్నాలు చేస్తే ప్రజలు తరమితరమి కొడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రషీద్, ఖదీర్, అలిముద్దీన్, ఇంతియాజ్, జహంగీర్, జాకీర్ పాల్గొన్నారు.

'అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర మరువలేనిది'

నవతెలంగాణ-ఓయూ

సమాజ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర మరువలేనిదని, గత శతాబ్ద కాలంగా దేశం అన్ని రంగాల్లో గణనీయమైన పురోగతి సాధిస్తోందంటే దానికి కారణం వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఇంజినీర్లే అని దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు ప్రశంసించారు. హైదరాబాద్ నార్త్ లాలా గూడలోని జెడ్‌సీఈటీఐలోని సెమినార్ హాల్ లో ఇంజినీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాలకు దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ కె. రామకష్ణ, ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ పి.డి. మిశ్రా, చీఫ్ ఎలక్ట్రికల్ డిస్ట్రిబ్యూషన్ ఇంజినీర్ సిహెచ్.ఎస్.రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీర్ ఇన్ చీఫ్ నల్ల వెంకటేశ్వర్లు ఈ వేడుకలకు ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ప్రాజెక్టు గొప్పదనాన్ని, దానికి సంబంధించిన అనేక విశేషాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం పలువురు ఇంజినీర్లను సన్మానించారు. హైదరాబాద్ ప్రాంతాన్ని వరదల నుంచి రక్షించడానికి ప్రత్యేక వ్యవస్థ రూపొందించిన సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఇంజినీర్లందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ డీకొండ పద్మనాభం, ప్రధాన కార్యదర్శి వై.లోకేశ్వర్, ఇతర నాయకుల నేతత్వంలో జరిగిన ఈ ఇంజినీర్స్ డే వేడుకల్లో దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ ప్రొఫెసర్లకు విశ్వేశ్వరయ్య స్మారక అవార్డు



నవతెలంగాణ-ఓయూ

డాక్టర్ విశ్వేశ్వరయ్య చూపిన బాటలో నేటి ఇంజనీర్లు, విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీలో అభివద్ధి సాధించాలని అనురాగ్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొ. ఎస్. రామచంద్రం అన్నారు. తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం జాతీయ ఇంజనీర్ల దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ హుస్సేన్ మాట్లాడుతూ.. విశ్వేశ్వరయ్య నదులపై వంతెనలు నిర్మాణంతో అంతర్జాతీయంగా పేరు పొందారని తెలపారు. రాష్ట్ర మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రాజనారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ.. దేశంలోని 8 యూనివర్సిటీలు డాక్టరేట్లను ప్రదానం చేసిందన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొ. శ్రీరామ్ వెంకటేష్, ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల డీన్ గడ్డం మల్లేశం, నాంపల్లిలోని కమలా నెహ్రూ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పుప్పాల అనిల్ కుమార్‌కు ఈ ఏడాది భారతరత్న డాక్టర్ ఎం విశ్వేశ్వరయ్య స్మారక అవార్డు 2023ను అనురాగ్ యూనివర్సిటీ వీసీ ప్రొ. రామచంద్రం జ్ఞాపికతో సత్కరించారు. సందర్భంగా తెలంగాణ మేధావుల రాష్ట్ర శాఖ కార్యదర్శి డాక్టర్ మొహమ్మద్ అక్తర్ అలీ,ప్రముఖ విద్యావేత్త జక్కుల విజ్జలత ఎస్ రామకష్ణ శాస్త్రి, కాశ్మోని శ్యామ్ రావు ముదిరాజ్ తో పాటు ప్రొఫెసర్లు,యూనివర్సిటీ ఇంజినీరింగ్ విద్యార్థులు అధ్యాపకులు పాల్గొని ప్రసంగించారు.

బహుజన డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఓయూ

ఈ నెల 22,23 న ఖమ్మంలో బహుజన డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ప్రథమ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీడీఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు ధనవెంధర్ యాదవ్ మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు, ఉద్యోగాలకు అలాగే అధికారానికి అణగారిన కులాల వారిని దూరంగా ఉంచుతున్నాయని తెలిపారు. వాటికోసం మనమే పోరాడి మన హక్కులను మనం సాధించుకోవాలన్నారు. ఖమ్మంలో జరగనున్న ప్రథమ రాష్ట్ర మహా సభలకు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీడీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్,రాష్ట్ర కమిటీ సభ్యులు ధనవేందర్, మురళీ కృష్ణ, బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి పర్వతాలు,టి. సంజీవ్, బహుజన పొలిటికల్ నాయకులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీకి బీజేపీ నాయకుల ఘన స్వాగతం



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ విమోచన దినోత్సవం కోసం పోరాడిన అమరుల చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని డిమాండ్‌తో పరకాలలోని అమరదామం వరకు బైక్ ర్యాలీ సందర్భంగా హబ్సిగూడ చౌరస్తా వద్ద హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్, బీజేపీ రాష్ట్ర పాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌లు ఘనంగా స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సంజయ్ పటేల్, వేములకొండ సోమశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి చెల్మోజు ఎల్లాచారి, జిల్లేల రవీందర్ రెడ్డి, న్యాలకోండ సుమన్ రావు,రాగి వెంకట్ రెడ్డి , వేములకోండ వెంకన్న, గడ్డం సాయి కిరణ్, పడతియ నాయక్, పూజారి సోమయ్యగౌడ్, అదిమల్ల వెంకటయ్య, అల్కాపురి సురేష్, కట్ట భాస్కర్ శాంతికుమార్, సుధాకర్, శంకర్, పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
శనివారం | సెప్టెంబర్ 16, 2023 | www.navatelangana.com



గడ్డం గంగాధర్ యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈడెన్ గార్డెన్ లో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాలో 85 కు పైగా కంపెనీలు పైగా కంపెనీలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా పాల్గొన్న నిరుద్యోగులకు ఉద్యోగ నియామక పత్రాలను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, శాసనమండలి చైర్మెన్, ఎమ్మెల్సీ బండ ప్రకాష్, బీసీ కమిషన్ చైర్మెన్ డాక్టర్ వకుళభరణం కృష్ణమోహన్, మాజీగ్రంథాలయం చైర్మెన్ బీఆర్ఎస్ సీనియర్ నేత గడ్డం శ్రీనివాస్ యాదవ్, ఆర్ వి మహేందర్ కుమార్ తదితరులు అందజేశారు. నవతెలంగాణ -సుల్తాన్ బజార్



ట్రాఫిక్ నిబంధనలు ప్రతొక్కరు పాటించాలని ఏసీపీ శంకర్‌రాజు తెలిపారు. శుక్రవారం అబిడ్స్‌లోని స్టాన్లీ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతోనే అధిక సంఖ్యలో రోడ్డుప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. త్రిబుల్ రైడింగ్, రాంగ్‌రూట్‌లో వెళ్లడం ప్రమాదకరమన్నారు. 360 మంది విద్యార్థులు, సిబ్బందితోపాటు కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న రాణి తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ -సిటీబ్యూరో

కార్మిక వ్యతిరేక విధానాలతో సంక్షోభంలో బీడీ పరిశ్రమ



- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, బీఎల్ఎఫ్ చైర్మెన్ సూర్యప్రకాష్, తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం అధ్యక్షులు సిద్ధరాములు

నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాల ఫలితంగా బీడీ పరిశ్రమ సంక్షోభంలో పడిందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, బీఎల్ఎఫ్ చైర్మెన్ నల్ల సూర్యప్రకాష్, తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం అధ్యక్షులు సిద్ధ గాద సిద్ధరాములు అన్నారు. తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద 'బీడీ కార్మికుల ఆకలి కేక' పేరున మహా ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు పాలడుగు భాస్కర్ హాజరై మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 60 లక్షల మంది బీడీ కార్మికులు ఉంటే కేవలం తెలంగాణలోనే 10 లక్షల పైగా బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాలో 30 మంది ఎమ్మెల్యేలు ఐదుగురు ఎంపీలు గెలవాలన్న ఓడాలన్న బీడీ కార్మికుల కుటుంబాల ఓట్లే కీలకంగా ఉన్నాయి అని గుర్తు చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాల ఫలితంగా బీడీ పరిశ్రమ సంక్షోభంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విదేశీ బహుళ జాతి సిగరెట్ గుట్కా కంపెనీలతో కేంద్ర ప్రభుత్వం బీడీ పరిశ్రమపై అనేక ఆంక్షలు పెట్టారన్నారు. బ్రాందీ లాంటి మద్యపానంపై లేని ఆంక్షలు బీడీ కట్టలపై పెట్టడం, జీఎస్టీ కోప్టా చట్టం విధించడం మూలంగా బీడీ కార్మికులకు నెలలో పది రోజులు కూడా పని దొరకడం లేదన్నారు. బీఎల్ఎఫ్ చైర్మెన్ నల్ల సూర్యప్రకాష్, తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం అధ్యక్షులు సిద్ధ గాద సిద్ధరాములు మాట్లాడుతూ బీడీ కార్మికుల పోరాటం ద్వారా సాధించుకున్న జీవో నెంబర్ 41 వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు అమలు చేసి బీడీ కార్మికులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని కోరారు. బీడీ కార్మికుల డిమాండ్‌లు పరిష్కరించని యెడల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ మహా ధర్నాలో ఎం సీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి పర్వతాలు, బీఎల్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు గోవర్ధన్, ప్రసాద్, సబ్బని లత, ఆంజనేయులు ,వడ్ల సాయి, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో మరిన్ని అభివృద్ధి పనులు ప్రారంభం



- ఎమ్మెల్యే ముఠా గోపాల్

నవతెలంగాణ -ముషీరాబాద్

త్వరలో నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు ప్రారంభం చేయనున్నట్టు ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. నియోజకవర్గంలోని ముషీరాబాద్ డివిజన్ చేపల మార్కెట్‌లో నూతనంగా నిర్మించిన చేపలు కట్ చేసే ప్రాంగణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకు ముందు భోలక్‌పూర్ డివిజన్ గౌరి శివాలయం వద్ద రూ. 10 లక్షలతో నిర్మించనున్న మంచినీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. నియోజకవర్గంలో అభివద్ధి పనులు విరివిగా కొనసాగుతాయి అన్నారు. అత్యధిక నిధులతో ప్రారంభమవుతున్న పనులను త్వరలో పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు తాండ్ర అమత్ రాజ్, ప్రధాన కార్యదర్శి గుండు శంకర్, కోశాధికారి పూస చిన్న శ్రీ రాములు, బీఆర్ఎస్ పార్టీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్ ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ రెడ్డి, గంగపుత్ర సంఘం నాయకులు పూస గోరఖ్నాథ్, భీమర్తి అశోక్, రుద్ర ప్రవీణ్, గాండ్ల గణేష్, బీఆస్ పార్టీ నాయకులు ఎయిర్‌టెల్ రాజు, ముచ్చకుర్తి ప్రభాకర్, పులిగిల్ల శ్రీధర్ చారి, రాజేందర్, డింభ, గంటల రాజు, లక్ష్మణ్ గౌడ్, పరుశురాం యాదవ్, ఉమా కాంత్, శ్రీకాంత్, జివై.గిరి, ప్రశాంత్, దీన్‌దయాల్‌రెడ్డి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు సర్టిఫికెట్లు అందజేత

ముషీరాబాద్ : మహిళలు అన్ని రంగాలలో శిక్షణ పొంది నైపుణ్యత సాధించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. హెల్ప్ ఫర్ టుడే సంస్థ 25వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం రామ్ నగర్‌లోని ఎస్ఆర్‌టీ కమ్యూనిటీ హాల్లో బీఆర్ఎస్ రామ్ నగర్ డివిజన్ అధ్యక్షులు మోసెస్ ఆధ్వర్యంలో హెల్ప్ ఫర్ టుడే సంస్థ ద్వారా కుట్టు మిషన్ కేంద్రాల్లో శిక్షణ పొందిన 50 మంది మహిళలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ మహిళ మగవారికి దీటుగా అనేక రంగాలలో శిక్షణ పొంది స్వయం శక్తితో అభివద్ధి చెందాలన్నారు. మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదన్నారు. మహిళలకు అన్ని రకాలుగా ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. హెల్ప్ ఫర్ టుడే సంస్థ మహిళా అభ్యున్నతికి చేస్తున్న సేవలు హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ బహిరంగ సభకు అధిక సంఖ్యలో హాజరవుతాం



బీఆర్ఎస్ పార్టీ కొల్లాపూర్ బహిరంగ సభకు ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేస్తామని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ముఖ్య నాయకులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ. ముఖ్యమంత్రి కేసీఆర్ అతి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు ఎత్తిపోతల పథకం పంపు ప్రారంభించి అనంతరం కొల్లాపూర్ లో బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ సభకు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు. డివిజన్ ల అధ్యక్షులు బల్ల శ్రీనివాస్ రెడ్డి, మోజస్, వల్లాల శ్యామ్ యాదవ్, వై శ్రీనివాస్, రాకేష్ కుమార్, ఎర్రం శ్రీనివాస్ గుప్తా, పోతుల శ్రీకాంత్, మచ్చకుర్తి ప్రభాకర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగించుకోవాలి



- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నవతెలంగాణ-అంబర్‌పేట

అర్హులైన వారందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి కలిసి పనిచేయాలని సూచించారు. శుక్రవారం కాచిగూడ డివిజన్ పరిధిలోని బాలప్ప బడిలో సుమారు కోటి రూపాయలు అంచనా వ్యయంతో చేపట్టనున్న సివరేజ్ పైప్‌లైన్, డ్రయినేజీ, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో 6000 మందికి గహలక్ష్మి, 4000 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు విడతలవారిగా మంజూరవుతాయని, రాజకీయాలకు అతీతంగా దరఖాస్తులు చేసుకోవాలని ఏమైనా ఉంటే నేరుగా తనని కలవాలని సూచించారు. మౌలిక సదుపాయాల కల్పనలో అంబర్ పేట నియోజకవర్గం నగరంలో ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డాక్టర్ శిరీష యాదవ్, డాక్టర్ ఓం ప్రకాష్ యాదవ్, మాజీ కార్పొరేటర్ దిడ్డి రాంబాబు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఎర్ర భీష్మ దేవ్, సీనియర్ నాయకులు ధాత్రిక్ నాగేందర్ బాబ్జి,సదానందు, మన్నె శ్రీనివాస్ యాదవ్, అంటో, రాజేష్, శివ, బబ్లు సింగ్, సునీల్ తదితరు నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరికలు

సీఎం కేసీఆర్ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని, సంక్షేమ పథకాలను చూసి వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శుక్రవారం గోల్నాక డివిజన్ చెందిన పలువురు బీజేపీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యే సమక్షంలో చేరారు. ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. కేసీఆర్ అద్భుతమైన పాలన, అభివద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులమై బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. కేసీఆర్ అభివృద్ధి పితామహుడని, తెలంగాణ రాష్ట్రాన్ని



ప్రగతిపథంలో అగ్రగామిగా నిలిపిన దార్శనిక పాలకుడని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను దేశంలోనే అత్యుత్తమగా నగరంగా అభివృద్ధి నిలిచే విధంగా కృషి చేశారన్నారు. కేసీఆర్ నాయకత్వమే ఈ రాష్ట్రానికి, దేశానికి శరణ్యమన్నారు. బీఆర్ఎస్‌ది నూరుశాతం అభివద్ధి అజెండా అని, బీజేపీ, కాంగ్రెస్‌లది అభివృద్ధి, ప్రజాసంక్షేమాన్ని చూసి ఓర్వలేని దుర్బుద్ధి అని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే అని, ఈ రెండు ఏడుపుగొట్టు పార్టీలేనని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి నర్సింగ్ యాదవ్, ఆశలత, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి



- కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్

నవతెలంగాణ-అంబర్‌పేట

స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని బాపు నగర్ లో సి బ్లాక్‌లో స్థానిక అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఇండ్ల మధ్యలో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి అని గుర్తించి, సంబంధిత అధికారులను పిలిపించి వారికి సమస్యను వివరించి వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇబ్బందికరంగా, ప్రమాదకరంగా ఉన్నటువంటి విద్యుత్ వైర్లని తొలగించి 11 కేవీ విద్యుత్ కేబుల్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. దశలవారీగా డివిజన్ పరిధిలోని అన్ని సమస్యలు పరిష్కరిస్తున్నానని, ఏదైనా సమస్యలు తలెత్తితే నేరుగా తనని కలవాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు హైమద్, వినయ్ సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.

'గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి'

- నారాయణగూడ సీఐ యూ.చంద్రశేఖర్

నవతెలంగాణ-హిమాయత్ నగర్



ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలని నారాయణగూడ సీఐ యూ.చంద్రశేఖర్ సూచించారు. నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో దాదాపు 120 వినాయక విగ్రహాలను ప్రతిష్టించి ఉత్సవాలను జరుపుకోనున్నారని, ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి గొడవలు, ఆటంకాలు లేకుండా జరుపుకోవాలని, రాత్రి సమయంలో మండపం నిర్వాహకులు మండపం వద్దనే ఉండాలన్నారు. డీజేలు ఎక్కువ సౌండ్ వచ్చేలా వాడరాదని సూచించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనుమతి కొరకు దరఖాస్తు ఆన్ లైన్ లో నమోదు చేసుకుని సదరు సమాచారం స్థానిక పోలీసులకు ఇవ్వాలని కోరారు. వివాదాలు ఉన్న లేదా ప్రజలకు ఇబ్బంది కలిగించే స్థలాలలో ఎలాంటి విగ్రహాలు పెట్టరాదని, బలవంతపు చందాలు వసూలు చేయరాదని సూచించారు .నిమజ్జనం సమయంలో చెరువులు, లేక్స్ దగ్గర తగిన జాగ్రత్తలు తీసుకుంటూ నిమజ్జనం చేయాలని కోరారు. తమ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటారని, ఎలాంటి సమస్య తలెత్తినా డయల్-100 లేదా తమను నేరుగా సంప్రదించాలన్నారు.

మహిళా రిజర్వేషన్‌ల ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ

నవతెలంగాణ-ముషీరాబాద్



బీసీ మహిళా కోటా లేకుండా మహిళా రిజర్వేషన్ ల నిర్ణయంపై జాతీయ వ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ తెలిపారు. పార్లమెంటులో ప్రవేశ పెట్టబోతున్న ప్రతిపాదిత మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సమాన వాటా కల్పిస్తూ చట్టసభలలో అవకాశాలు కల్పించాలనే డిమాండ్ చేస్తూ శుక్రవారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ దీక్షకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ. చట్టసభలన్నిటిలో బీసీ మహిళల ప్రాధాన్యత దాదాపు శూన్యమైందన్నారు ఈ అన్యాయాన్ని రూపుమాపడానికి అందరూ కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు.బీసీ మహిళా కోటా లేకుండా రిజర్వేషన్ల నిర్ణయంపై జాతీయ స్థాయిలో ఉద్యమిం చాలన్నారు. చట్టసభలలో బీసీల ప్రాతినిధ్యం 18 శాతానికి పడిపోయి ఉండగా ఇది ఈ చర్య ద్వారా 10 శాతం లోపలికి కుదించుకుపోయి 5 శాతం ఉన్న అగ్రకులాల ప్రాతినిత్యం 65 శాతానికి పెరిగే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు. గతంలో సోనియాగాంధీ నేతృత్వంలో యూపీఏ ప్రభుత్వం బీజేపీ సహకారంతో ఈ ప్రయత్నం చేస్తే దేశంలోని సోషలిస్టు నేతలైన లాలు ప్రసాద్ యాదవ్ తదితరులంతా పెద్ద ఎత్తున ఉద్యమించి విజయవంతంగా బీసీ విద్రోహాన్ని అడ్డుకున్న అంశాన్ని ఆయన గుర్తు చేశారు. బీసీల పట్ల మొదటి నుంచి వ్యతిరేక వైఖరితో ఉన్న నేటి బీజేపీ ప్రభుత్వం అగ్రకులాలకు 10 శాతం 'ఈ బీసీ రిజర్వేషన్ కల్పించి, బీజే జనగణను విజయవంతంగా పెండింగ్ లో పెట్టిన అగ్ర అనుకూలతానందంలో తమ చివరి సెషన్ లో మహిళల పేర మరో 33 శాతం తమ వర్గాల వారికి స్థిరికరించే ప్రయత్నం చేస్తున్నాయని తెలిపారు. దేశంలో అన్ని వర్గాల కంటే ఎక్కువ అణగారిన వారు బీసీ మహిళలే కాబట్టి వారికే చట్టసభలలో పాటు అన్ని రంగాలలో 50 శాతం రిజర్వేషన్లు కొనసాగాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో నాయకురాళ్లు ఇందిరా శోభన్, భాగ్యలక్ష్మి, నాయకులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, జి అంజి, దీపిక, దుష్యాంత, పి. సుధాకర్ ముదిరాజ్, నరసింహ గౌడ్, అనంతయ్య, నిఖిల్ పాల్గొన్నారు..

'పేదరికంలో జీవిస్తున్న వీరశైవ లింగాయతులు లింగ బలిజలు'



నవతెలంగాణ - ముషీరాబాద్/సుల్తాన్‌బజార్

తెలంగాణలో వీరశైవ లింగాయత్ లింగ బలిజలు 90 శాతం మంది కడు పేదరికంలో జీవనం కొనసాగిస్తున్నారని రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వెన్న ఈశ్వరప్ప అన్నారు. శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో వీరశైవ లింగాయతులు, లింగ బలిజలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా చాలా వెనుకబడి ఉన్నారని, వీరు అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని అన్నారు. వీరశైవులకు ప్రత్యేకంగా ఎలాంటి వృత్తి లేదని చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు.2009 సంవత్సరంలో వీరశైవ లింగాయత్ లను, లింగ బలిజలను రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడి తరగతులలో చేర్చిందని, 14 సంవత్సరాలు గడచినప్పటికీ కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చలేదని దాంతో తెలంగాణ రాష్ట్రంలోని వీరశైవలింగాయతులు, లింగ బలిజలు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలలో, ప్రభుత్వ పథకాలలో చాలా నష్టం జరుగుతుందన్నారు. వీరశైవ లింగాయత్ లింగ బలిజల సమస్యలకు సానుకూలంగా స్పందించిన రాష్ట్రపతి .. సమస్యల పరిష్కారం కోసం తప్పకుండా కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు పంపిస్తానని హామీ ఇవ్వడం జరిగింది అని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి శివకుమార్, రాష్ట్ర కోశాధికారి జి దినేష్ పాటిల్, రాష్ట్ర యువజన అధ్యక్షులు కల్లెపల్లి రాచప్ప , కేంద్ర కమిటీ చైర్మన్ మాజీ ఉప లోకాయుక్త శ్రీ ఎం శివరత్న, అడ్వైజర్ కల్వ మల్లికార్జునప్ప, సభ్యులు డాక్టర్ కోటి శివప్ప, రాష్ట్ర ప్రతినిధులు కర్నే రాజశేఖర్, ఆవిటి మధుసూదన్, మిరియాల అనిల్ కుమార్, కే సోమేశ్వర్ పాల్గొన్నారు.

అర్హులైన వారికి ఇండ్లు అందేలా చూడాలి

- బీఆర్ఎస్ అంబర్‌పేట ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్ రెడ్డి

నవతెలంగాణ-అంబర్ పేట



అర్హులైన వారందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అందేల చూడాలి అని బీఆర్ఎస్ అంబర్ పేట ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్ రెడ్డి జిల్లా కలెక్టర్ అనుదీప్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల రెండో విడుత డ్రా కార్యక్రమానికి వెళ్లిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి విడతలో సరైన లబ్దిదారులకు రాలేదని, ఇండ్లు ఉన్నవారికే వచ్చాయన్నారు. నియోజకవర్గంలోని నిరుపేదలకు అన్యాయం జరుగుతోందని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. వారు సానుకూలంగా స్పందిస్తూ తప్పకుండా పరిశీలిస్తామని. అర్హులు అయినవారికి లబ్ది చెందే విధంగా చూస్తామన్నారు. అలట్ అయిన లిస్ట్ వెబ్‌సైట్‌లో, నోటీస్ బోర్డు లో మండల ఆఫీస్ లో పొందుపరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా నాయకురాలు దేవిరెడ్డి విజిత రెడ్డి, సీనియర్ నాయకులు జనార్ధన్, జేడి రాహుల్, ఖలేద్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

17న కాంగ్రెస్ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలి

- ఎమ్మెల్యే, కాంగ్రెస్ -గోషామహల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ జగ్గారెడ్డి



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ఈనెల 17న తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, గోషామహల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. గోషామహల్ నియోజకవర్గం పీసీసీ కార్యదర్శి సంజయ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జాంబాగ్ యాదవ భవన్‌లో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సభకు రావాలన్నారు. ప్రజలను తరలించాలని నాయకులకు సూచించారు. అందరూ ఒకటిగా పని చేస్తే గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి సంజయ్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీధర్ గౌడ్, ఆర్ నరేందర్, సీకే మూర్తి,నిర్మల్ యాదవ్, బండ అశోక్, కన్నా లాల్, అనిల్ సింగ్, పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చీకోటి ప్రవీణ్ కుమార్‌ను అవమానపరిచిన బీజేపీ

- తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ

నవతెలంగాణ-హిమాయత్ నగర్



ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన చీకోటి ప్రవీణ్ కుమార్‌ను బీజేపీ అధిష్టానం ఆహ్వానించి పార్టీలో చేర్చుకోకుండా అవమానపరిచిందని తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ మండిపడింది. శుక్రవారం మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ గణేష్ గుప్తా మాట్లాడుతూ చీకోటి ప్రవీణ్ కుమార్‌ను బీజేపీ అవమానపరచడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రవీణ్ కుమార్‌ను బీజేపీలోకి చేర్చుకునేందుకు తొలుత అపాయింట్ మెంట్ ఇచ్చిందని, దీంతో ప్రవీణ్ కుమార్ అన్ని ఏర్పాట్లు చేసుకుని లక్షలాది రూపాయలు ఖర్చు చేసి హోర్డింగ్‌లు నగరమంతా ఏర్పాటు చేసుకుని వేలాది మందితో ఊరేగింపు నిర్వహించి నాంపల్లిలోని బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యాలయానికి వస్తే ఎవరూ పట్టించుకోకుండా అవమానించారన్నారు. ఇది కేవలం చీకోటి ప్రవీణ్ కు జరిగిన అవమానం కాదని, రాష్ట్రంలోని ఆర్యవైశ్యులందరికి జరిగిన అవమానంగా భావిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా 5 శాతం నుంచి 6 శాతం వరకు ఆర్యవైశ్యుల ఓట్లు ఉన్నాయని, తమకు పొలిటికల్ వింగ్ ఉందని, అవసరమైతే తాము ఓటర్లను ప్రభావితం చేస్తామని హెచ్చరించారు. తమ మహాసభలో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఉన్నారన్నారు. బీజేపీ అవమానంచినదాన్ని తమ సంఘం తీవ్రంగా పరిగణలోకి తీసుకుని, రానున్న రోజుల్లో తమను గుర్తించిన పార్టీకే మద్దతు ఇస్తామని, ప్రవీణ్ ను బీజేపీ విస్మరిస్తే, తాము కూడా పార్టీని విస్మరిస్తామని వారు హెచ్చరించారు. రాష్ట్రంలోని కొన్ని నియోజకవర్గాలలో 25 నుంచి 30 వేల వరకు ఓటర్లు ఉన్నారని, అవసరమైతే చీకోటి ప్రవీణ్ కుమార్ ను రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి నిలబెట్టి గెలిపించుకునే సత్తా తమకు ఉందన్నారు. ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి కొండ్లు మల్లికార్జున్, రాష్ట్ర నాయకులు ఉప్పల చంద్రశేఖర్ గుప్త, చింతల రవికుమార్, ఆగిరి వెంకటేష్, మొగుళ్లపల్లి ఉపేంద్ర, కుమారస్వామి, సామ్రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

యోగా బార్‌లో కొత్తగా 'యోగా బేబీ'

నవతెలంగాణ-సిటీబ్యూరో



దేశంలోని ఆహార బ్రాండ్‌లలో ఒకటైన యోగా బార్, తమ విభిన్న ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోను విస్తరిస్తోంది. కుటుంబాల్లోని చిన్నారులకు ప్రత్యేక పోషకాహార అవసరాలను తీర్చేందుకు యోగా బేబీని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో చిరు ధాన్యాలు, ఓట్స్, ఇంకా రాగి వంటి పోషకాలతో కూడిన తణ ధాన్యాలు ఉపయోగించి తయారు చేశామని, ఇది ఎంతో ప్రయోజన కరంగా ఉంటుందని నిర్వాహకులు సుహాసిని సంపత్, అనిందితా సంపత్ తెలి పారు. రుచికరమైన పిండి మిశ్రమాలతో ఐదు వేరియంట్లలో లభిస్తుందన్నారు. మన వారసత్వంలో అంతర్భాగంగా ఉన్న చిరు ధాన్యాలు కలిగి ఉందన్నారు. వివిధ ఆహార అవసరాలకు అనుగుణంగా విభిన్న ఉత్పత్తులను యోగా బార్ అందిస్తోందని గుర్తు చేశారు. యోగా బేబీని అందరికి అందుబాటులోకి తీసుకురావడం తమకు చాలా గర్వంగా, సంతోషంగా ఉందన్నారు. ఈ ఉత్పత్తి ఆన్‌లైన్, ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉంటుందన్నారు. త్వరలోనే రిటైల్ షాపుల్లో కూడా లభిస్తుందన్నారు.

'బీఆర్ఎస్ హయాంలో అంబర్‌పేటలో కుంటుపడిన అభివృద్ధి'

నవతెలంగాణ-అంబర్‌పేట



రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అంబర్‌పేట నియోజకవర్గంలో అభివద్ధి కుంటుపడిందని, చిన్నపాటి వర్షానికే రహదారులు గోదారులను తలపిస్తున్నాయని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. ఎస్. గౌతమ్ రావు ఆరోపించారు. అనంతరం అంబర్ పేట నియోజకవర్గంలోని ప్రేమ్ నగర్ కు చెందిన దాదాపు 50 మంది మహిళలు బీజేపీ నగర కార్యాలయంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా గౌతమ్‌రావు మాట్లాడుతూ వరద నీటి కాలువలకు మర మ్మతులు లేని కారణంగా వర్షాలకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నాలుగేండ్ల నుంచి నియోజకవర్గంలో అభివద్ధి పనులకు మోక్షం లభించలేదని, ఎన్నికలు సమీపిస్తుండటంతో హడావిడిగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్నారని అన్నారు. పనులు అర్ధాంతరంగా నిలిచిపోతుండటంతో స్థానికులు మరిన్ని బాధలు పడుతున్నారని తెలిపారు. అంబర్ పేటలో నెలకొన్న సమస్యలపై బీజేపీ పోరాడుతుందని ప్రజలకు ఎప్పుడైనా అండగా ఉంటామన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీజేపీని ఆశీర్వదించాలి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళల సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శ్యామ్ రాజ్, అంబర్ పేట డివిజన్ అధ్యక్షులు నాగభూషణం చారి, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి, శిరీష, ఆర్తీ, జ్యోతి, రత్నప్రభ, తిరుపతి గుప్తా, లాస్య, రేఖా, వసంత, శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఇందిరా నగర్ బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 2 (జూబ్లీహిల్స్ డివిజన్) పరిధిలోని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కిరణ్, వీరునాయక్, సోను, శ్రీరాములు నాయక్, జగదీష్, కిట్టు నాయక్‌తో పాటు మరో 20 మంది యువకులు శుక్రవారం కార్పొరేటర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి విజయారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జూబ్లీహిల్స్ డివిజన్ సీనియర్ నాయకులు మోహన్ యాదవ్, బాబా గౌడ్, పవన్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి గణపతులను పంపిణీ చేసిన కార్పొరేటర్ దీపిక



నవతెలంగాణ కంటోన్మెంట్

జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయం వద్ద జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో కార్పొరేటర్ దీపికా నరేష్ వార్డు ఏవో గాయత్రీ దేవి, ఎస్ఎఫ్ఏ సుధీర, సూపర్వైజర్ నర్సింగ్ రావు తో కలిసి మట్టి గణేశులను పంపిణీ చేశారు. పర్యావరణాన్ని కాపాడే బాధ్యత మనందరిదని, మట్టి వినాయకుడి కి పూజించుకుందాం మన పర్యావరణాన్ని కాపాడుకుందామని కార్పొరేటర్ చెప్పారు.

సమస్యల పరిష్కారానికి కృషి : డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-ఓయూ

తార్నాకలోని వీధి నెంబర్ 10, 11 నివాసితులు వారి ఇండ్ల దగ్గర ఉన్న ప్రమాదకరమైన హై టెన్షన్ ఎలక్ట్రికల్ లైన్ పోల్ 33 కెవి వైర్లను తరలించాలని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు శ్రీ మోతె శోభన్ రెడ్డిలను శుక్రవారం విన్నవించుకున్నారు. దాంతో వారు అధికారులతో కలిసి పరిశీలించారు.అ లాగే ఈ సమస్యను త్వరగా పరిష్కార అయ్యేటట్టు చూస్తానని విద్యుత్ శాఖ అధికారులు డిప్యూటీ మేయర్‌కు తెలిపారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ 33 కేవీ తీగల షిఫ్టింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు విద్యుత్ శాఖ చేస్తుందని, అలాగే విషయం పై విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్ రెడ్డితో మాట్లాడి అవసరమైన అనుమతులు వచ్చే విధంగా చూస్తానని అన్నారు.

ఆహ్వాన పత్రికలు అందజేసిన కార్పొరేటర్ దీపిక



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఈనెల 17న పెరేడ్ గ్రౌండ్లో బీజేపీ ఆధ్వర్యంలో విమోచన దిన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను శుక్రవారం కార్పొరేటర్ దీపిక నరేష్ వ్యాపారస్తులకు, స్థానికులకు ఇంటింటికి వెళ్లి అందజేశారు.

పర్యావరణ రక్షణకు మట్టి గణపతులను ప్రతిష్టించాలి



బీఆర్ఎస్ కంటోన్మెంట్ అభ్యర్థి లాస్య నందిత

నవతెలంగాణ-కంటోన్మెంట్

ప్రజలంతా పర్యావరణహితంగా మట్టి గణపతులను ప్రతిష్టించుకోవాలని బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత పిలుపునిచ్చారు శుక్రవారం దివంగత ఎమ్మెల్యే సాయన్న క్యాంపు ఆలయంలో ఆమె మట్టి గణపతి ప్రతిమల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి గణపతి పూజ చేయటం శ్రేష్టమైనదని, అంతేకాకుండా పర్యావరణ పరిరక్షించడానికి దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు టీఎన్ శ్రీనివాస్, పనస సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కిషన్ రెడ్డి దీక్ష ఓ డ్రామా :తుంగ బాలు



నవతెలంగాణ-ఓయూ

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి చేసిన దీక్షను ఓ డ్రామాగా బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు ఒక ప్రకటనలో అభివర్ణించారు. కిషన్ రెడ్డి దీక్ష చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబాన్ని వ్యక్తిగతంగా విమర్శించడాన్ని తీవ్రంగా ఖండించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ తొమ్మిదేండ్లలో నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయిందని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్రమోడీ జన్మదినం సందర్భంగా దేశ నిరుద్యోగ యువత అన్ఎంప్లాయ్ మెంట్ డేగా సామాజిక మాధ్యమాల్లో ఎత్తిచూపిన విషయాన్ని మరిచిపోయారా అని ప్రశ్నించారు. కేంద్రప్రభుత్వంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయకుండా, రాష్ట్రంలో రెండు లక్షల ఇరవై వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసిన కేసీఆర్ ప్రభుత్వంపై నిందలు వేయడం సూర్యునిపై ఉమ్మివేసిన చందంగా ఉందని ఎద్దేవా చేశారు. ఉద్యోగాలు అడిగితే పకోడీలు వేసుకోమన్న మోడీ అహంకారంపై వ్యాఖ్యానించాలని సూచించారు. ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులకు ఆమోద ముద్ర వేయకుండా యూనివర్సిటీలలో బోధన, బోధనేతర సిబ్బంది భర్తీని గవర్నర్ ద్వారా బీజేపీయే అడ్డుకుంటోందని ఆరోపించారు. దేశంలో నూతన విద్యా విధానాన్ని తీసుకువచ్చి బడుగు, బలహీనవర్గాలకు ఉన్నత విద్యను దూరం చేసే కుట్రను ఆచరణలోకి తీసుకువచ్చారని దుయ్యబట్టారు. అయినాకిషన్ రెడ్డి స్పందించకపోవడం తెలంగాణ సమాజం గమనిస్తోందని అన్నారు. భారత రాజ్యాంగ వ్యవస్థలను తన గుప్పిట్లో పెట్టుకుని ప్రతిపక్ష పార్టీల నాయకులను లక్ష్యంగా చేసుకుని కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. తొమ్మిదేండ్లలో దేశ యువత బాగుకోసం చేసిన ఒక మంచి పనిని చెప్పాలని సవాల్ చేశారు. కిషన్ రెడ్డికి, బీజేపీకి తగిన గుణపాఠం చెప్పేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తెలంగాణలో మరోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఉద్ఘాటించారు.

శ్రీ సద్గురు జగలింగేశ్వర స్వామి పూజలో శ్రీ గణేష్

నవతెలంగాణ కంటోన్మెంట్

ఈస్ట్ మారేడ్ పల్లి గాంధీ నగర్ లో శ్రీ సద్గురు జగలింగేశ్వర ప్రసన్న స్వామి పూజా వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి శ్రీ గణేష్ ఫౌండేషన్ శ్రీ గణేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులు శ్రీ గణేష్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెద్ద మల్లప్ప, లింగప్ప, శేఖర్, భవంతు, పూజరి బాబు, నరేష్ పాల్గొన్నారు.

ఎంపీ కృష్ణయ్యను పరామర్శించిన ఎమ్మెల్యే సీతక్క

నవతెలంగాణ-ముషీరాబాద్



ఇటీవల వనపర్తి సభలో స్వల్ప అస్వస్థతకు గురైన రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్యను విద్యానగర్ లోని బీసీ భవన్ లో ములుగు ఎమ్మెల్యే సీతక్క కలిసి పరామర్శించారు



బల్కంపేట దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన రామ్ గోపాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ చీర చిత్ర శ్రీకాంత్.

నవతెలంగాణ-బేగంపేట

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్టు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం రాంగోపాల్ పేట డివిజన్ కాచిబౌలిలో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తీలో ఏ సమస్య ఉన్నా పరిష్కరిస్తామని హామీ ఇచ్చా రు. బస్తీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరగా, 3 రోజుల్లో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదేవిధంగా సీవరేజ్, రోడ్ల నిర్మాణ పనులను కూడా త్వరలోనే పూర్తి చేయడం జరుగు తుందని చెప్పారు. బస్తీ వాసుల సౌకర్యార్థం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ. 60 లక్షలు మంజూరైయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తా మని వివరించారు. బస్తీలో అవసరమైన ప్రాంతాల లో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని, శిథిలమైన స్తంభాల స్థానంలో నూతన స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. గతంలో ప్రతి ఏడాది వర్షాకాలంలో బస్తీలోని నాలాకు వచ్చే వరదనీరు నాలా పరిసరలాలోని ఇండ్లలోకి, కాలనీలోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడేవారని చెప్పారు. నాలా అభివృద్ధి, పూడిక తొలగింపు చేపట్టి వరద సమస్యను పరిష్కరించినట్టు వివరించారు. నాలాలో నీటి ప్రవాహం సాఫీగా సాగే విధంగా నాలాపై ఉన్న బ్రిడ్జిని మరింత ఎత్తులో నిర్మించే పనులను కూడా త్వరలోనే ప్రారంభించనున్నట్టు తెలిపారు. చెత్త, ఇతర వ్యర్థాలు నాలాలో వేయడం వల్ల పరిసర ప్రాంత ప్రజలకే సమస్యలు ఏర్పడతా యని, నాలాలో చెత్త వేయవద్దని కోరారు. నాలాకు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జేఎన్ఎన్‌యూఆర్ఎం వాంబే పథకాల కింద ఎన్నో ఏండ్ల క్రితం నిర్మించిన ఇండ్లు శిథిలావస్థకు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. అవసరమైన మరమ్మతు లు చేపట్టేందుకు అధికారులు సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. మంత్రి వెంట జోనల్ కమిషనర్ రవి కిరణ్, డీసీ శంకర్, మాజీ కార్పొరేటర్లు అత్తిలి అరుణ గౌడ్, కిరణ్మయి, ఈఈ సుదర్శన్, వాటర్ వర్క్స్ సీజీఎం ప్రభు, ఎలెక్ట్రికల్ డీఈ శ్రీధర్, స్ట్రీట్ లైట్ డీఈ భరత్, బస్తీ అధ్యక్షుడు జగదీశ్, మహేష్, శ్రవణ్ కుమార్, వెంకటేష్, మహేష్, రాజేందర్ ఉన్నారు.

గణేష్ నవరాత్రుల నిర్వహణకు ఏర్పాట్లు

గణేష్ నవరాత్రులను అత్యంత ఘనంగా నిర్వహించే విధంగా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను చేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద సికింద్రాబాద్‌లోని గణేష్ టెంపుల్ వద్ద జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని పిలుపునిచ్చారు. పర్యావరణానికి హాని చేసే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను ప్రతిష్టించవద్దని కోరారు. మట్టి విగ్రహాలను ప్రతిష్టించే విధంగా ప్రజలను ప్రోత్సహించే లక్ష్యంతో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పోల్యుషన్ కంట్రోల్ బోర్డ్ ల ఆధ్వర్యంలో 4.64 లక్షల మట్టి విగ్రహాలను జీహెచ్ఎంసీ పరిధిలో పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ విగ్రహాల పంపిణీ కోసం సర్కిల్‌కు ఏఎంఓహెచ్‌ను ప్రత్యేక అధికారిగా, వార్డ్‌కు ఒక వార్డ్ స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించినట్టు చెప్పా రు. ఒక్కో వార్డ్‌లో 2500 విగ్రహాలను పంపిణీ చేయ డం జరుగుతుందని పేర్కొన్నారు. బేగంపేట సర్కిల్ లో 11,800 విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గణేష్ టెంపుల్ చైర్మెన్ సత్యనారాయణ, మాజీ చైర్మెన్ జయరాజ్, హన్మంత రావు, శానిటేషన్ డీఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.



కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

- ప్రజాస్వామ్యబద్ధంగా వారు చేస్తున్న ఉద్యమానికి వీసీ అడ్డుపడటం సరికాదు
- తెలుగు హెడ్ ప్రొఫెసర్ ఖాసీం



నవతెలంగాణ-ఓయూ

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో గత కొంతకాలంగా చేస్తున్న ఉద్యమంలో భాగంగా ఆర్ట్స్ కళాశాల బస్‌స్టాప్‌లో శుక్రవారం కార్యక్రమం కొనసాగింది. ఓయూ పరిధిలోఉన్న అన్ని కళాశాలల అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఓయూ తెలుగు విభాగం హెడ్ ప్రొఫెసర్ ఖాసీం సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ అనే పదం లేకుండా చేస్తానని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ వెంటనే విశ్వవిద్యాలయ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసి వారి మాటను నిలబెట్టుకోవాలన్నారు. అనేక ఏండ్లుగా విశ్వవిద్యాలయాలను నమ్ముకొని పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను విస్మరించటం సరికాదన్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకులు అన్ని రకాలుగా క్వాలిఫికేషన్ కలిగి ఉన్నారని, అకాడమీక్‌గా, అడ్మినిస్ట్రేషన్ పరంగా అన్ని సేవలు అందిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా చేస్తున్న ఉద్యమానికి వీసీ అనుమతించకుండా ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. విశ్వవిద్యాలయంలో అధ్యాపకుల సమస్యలపై వారు నిరసన తెలపటం రాజ్యాంగపరంగా వచ్చిన హక్కని ఆ హక్కును కాలరాసే అధికారం ఎవరికీ లేదని తెలిపారు. ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయి కాబట్టి రెగ్యులరైజ్ అయ్యే వరకు మీరు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆ ఉద్యమంలో మీ వెంట తానుంటా అని ఆయన హామీ ఇచ్చారు. ఒక అధ్యాపకుడిగా అది తన బాధ్యత అని తెలిపారు. విశ్వవిద్యాలయ విద్యకు సంబంధంలేని కార్యక్రమాలను ఆర్ట్స్ కాలేజీ ఎదుట అనుమతిస్తూ ఉపాధ్యాయులు చేస్తున్న కార్యక్రమాలకు అనుమతి నిరాకరించటం ముమ్మాటికీ సరికాదన్నారు. కావున వెంటనే ఉద్యమానికి వీసీ టెంటు, మైకుకు అనుమతి నివ్వాలని కోరారు. వెంటనే ప్రభుత్వం సమస్యను పరిష్కరించా లని కోరారు. సదానంద రెడ్డి పీపుల్స్ ప్రొటెక్షన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ధర్నాకు హాజరై ప్రసంగించి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ధర్మ తేజ, డా. వేల్పుల కుమార్, డా. విజయేందర్ రెడ్డి, డా. సిహెచ్ వెంకటేష్, డా. ఈ ఉపేంద్రరావు, డా. అశోక్ బసవ, డా. స్రవంతి రెడ్డి, డా. రేష్మా రెడ్డి, డా. ఏ సత్యం, డా. జి వెంకటేశ్వర్లు,డాక్టర్ నరసింహారావు డా. మాధవి, డా. నవీన్ రెడ్డి, డా. ఎం. కిరణ్, తాళ్లపల్లి వెంకటేశం డాక్టర్ ఓ కృష్ణయ్య. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ ధర్మ తేజ మరియు డాక్టర్ సిహెచ్ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించి నడిపించారు.

మాజీ మేయర్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



నవతెలంగాణ-ఓయూ

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్ నుంచి పరకాల వరకు నిర్వహిస్తున్న బైక్ ర్యాలీలో మాజీ మేయర్ బండ కార్తీక రెడ్డి పాల్గొన్నారు. పరేడ్ గ్రౌండ్ నుంచి బైక్ ర్యాలీని తెలంగాణ ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్ జెండా ఊపి ప్రారంభించారు.అంతకుముందు తార్నాక చౌరస్తా నుంచి భారీగా బైక్ ర్యాలీతో పెరేడ్ గ్రౌండ్ కు చేరుకున్న బండ కార్తీక్ రెడ్డి, సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్, తార్నాక, ఉప్పల్, ఘైరాన్‌పల్లి, ఖిలాషాపూర్, పరకాల వరకు బైక్ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, యువ మోర్చా నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భవిష్యత్తు కోసం కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలి

- తమిళనాడు ఎమ్మెల్యే రూబి మనోహరన్



నవతెలంగాణ-బేగంపేట్

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, భవిష్యత్ నిర్మాణం కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని సనత్‌నగర్ నియోజకవర్గం ఏఐసీసీ పర్యవేక్షకులు, తమిళనాడు కాంగ్రెస్ ఎమ్మెల్యే రూబీ మనోహరన్ అన్నారు. సనత్ నగర్ డివిజన్‌లోని సెయింట్ థెరిస్సా హాస్పిటల్‌లో ఉద్యోగులు, వైద్య సిబ్బంది, నర్సులతో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రూబీ మనోహర్ మాట్లాడుతూ.. 17వ తేదీన తుక్కుగూడలో నిర్వహించే విజయభేరి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం నియంతత్వ పాలన సాగిస్తుందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రహస్య ఒప్పందంతోనే పనిచేస్తున్నాయని అన్నారు. డాక్టర్ కోట నీలిమ మాట్లాడుతూ మహిళలు, బహుజన వర్గాల సమస్యలను కాంగ్రెస్ మాత్రమే అర్థం చేసుకుంటుందని అన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన మిమ్మల్ని ప్రభుత్వం విస్మరించిందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తనకు అవకాశం ఇవ్వాలని ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఇవాన్ వాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో థామస్ అమ్మ, అబ్బాస్ షరీఫ్, ఇబ్రహీం పటేల్ తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట వారసత్వాన్ని బీజేపీ లూటీకి యత్నం

సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి శ్రీనివాస్



నవతెలంగాణ-ఓయూ

వేలాదిమంది ప్రాణ త్యాగాలు చేసి నిరంకుశ నిజాంను తరిమికొట్టిన కమ్యూనిస్టుల తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని బీజేపీ లూటీ చేసే ప్రయత్నాలు చేస్తున్నదని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం 75 వసంతాల వజ్రోత్సవాలలో భాగంగా శుక్రవారం వారసిగూడ చౌరస్తాలో సాయుధ పోరాట వారోత్సవాలకు సంబంధించిన కటౌట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలందరికీ తెలిసిన కమ్యూనిస్టుల తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను కూడా బీజేపీ దోచుకుని హైదరాబాద్ విమోచన దినోత్సవం నిర్వహించడం దుర్మార్గమన్నారు. నిజాం వ్యతిరేక పోరాటానికి, హైదరాబాద్ విమోచనానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు ఏమైనా సంబంధం ఉందా అని ప్రశ్నించారు. కేవలం బీజేపీ తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని లాక్కునే ప్రయత్నాలు చేస్తే ప్రజలు తరమితరమి కొడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రషీద్, ఖదీర్, అలిముద్దీన్, ఇంతియాజ్, జహంగీర్, జాకీర్ పాల్గొన్నారు.

'అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర మరువలేనిది'

నవతెలంగాణ-ఓయూ

సమాజ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర మరువలేనిదని, గత శతాబ్ద కాలంగా దేశం అన్ని రంగాల్లో గణనీయమైన పురోగతి సాధిస్తోందంటే దానికి కారణం వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఇంజినీర్లే అని దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు ప్రశంసించారు. హైదరాబాద్ నార్త్ లాలా గూడలోని జెడ్‌సీఈటీఐలోని సెమినార్ హాల్ లో ఇంజినీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాలకు దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ కె. రామకృష్ణ, ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ పి.డి. మిశ్రా, చీఫ్ ఎలక్ట్రికల్ డిస్ట్రిబ్యూషన్ ఇంజినీర్ సిహెచ్.ఎస్.రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీర్ ఇన్ చీఫ్ నల్ల వెంకటేశ్వర్లు ఈ వేడుకలకు ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ప్రాజెక్టు గొప్పదనాన్ని, దానికి సంబంధించిన అనేక విశేషాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం పలువురు ఇంజినీర్లను సన్మానించారు. హైదరాబాద్ ప్రాంతాన్ని వరదల నుంచి రక్షించడానికి ప్రత్యేక వ్యవస్థ రూపొందించిన సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఇంజినీర్లందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ డీకొండ పద్మనాభం, ప్రధాన కార్యదర్శి వై.లోకేశ్వర్, ఇతర నాయకుల నేతత్వంలో జరిగిన ఈ ఇంజినీర్స్ డే వేడుకల్లో దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ ప్రొఫెసర్లకు విశ్వేశ్వరయ్య స్మారక అవార్డు



నవతెలంగాణ-ఓయూ

డాక్టర్ విశ్వేశ్వరయ్య చూపిన బాటలో నేటి ఇంజనీర్లు, విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీలో అభివద్ధి సాధించాలని అనురాగ్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వీసీ ప్రో. ఎస్. రామచంద్రం అన్నారు. తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం జాతీయ ఇంజనీర్ల దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ హుస్సేన్ మాట్లాడుతూ.. విశ్వేశ్వరయ్య నదులపై వంతెనలు నిర్మాణంతో అంతర్జాతీయంగా పేరు పొందారని తెలపారు. రాష్ట్ర మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రాజనారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ.. దేశంలోని 8 యూనివర్సిటీలు డాక్టరేట్లను ప్రదానం చేసిందన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొ. శ్రీరామ్ వెంకటేష్, ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల డీన్ గడ్డం మల్లేశం, నాంపల్లిలోని కమలా నెహ్రూ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పుష్పాల అనిల్ కుమార్‌కు ఈ ఏడాది భారతరత్న డాక్టర్ ఎం విశ్వేశ్వరయ్య స్మారక అవార్డు 2023ను అనురాగ్ యూనివర్సిటీ వీసీ ప్రో. రామచంద్రం జ్ఞాపికతో సత్కరించారు. సందర్భంగా తెలంగాణ మేధావుల రాష్ట్ర శాఖ కార్యదర్శి డాక్టర్ మొహమ్మద్ అత్తర్ అలీ,ప్రముఖ విద్యావేత్త జక్కుల విజ్జలత ఎస్ రామకృష్ణ శాస్త్రి, కాష్మోని శ్యామ్ రావు ముదిరాజ్ తో పాటు ప్రొఫెసర్లు,యూనివర్సిటీ ఇంజనీరింగ్ విద్యార్థులు అధ్యాపకులు పాల్గొని ప్రసంగించారు.

బహుజన డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఓయూ

ఈ నెల 22,23 న ఖమ్మంలో బహుజన డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ప్రథమ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా బీడీఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు ధనవెంధర్ యాదవ్ మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు, ఉద్యోగాలకు అలాగే అధికారానికి అణగారిన కులాల వారిని దూరంగా ఉంచుతున్నాయని తెలిపారు. వాటికోసం మనమే పోరాడి మన హక్కులను మనం సాధించుకోవాలన్నారు. ఖమ్మంలో జరగనున్న ప్రథమ రాష్ట్ర మహా సభలకు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీడీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్,రాష్ట్ర కమిటీ సభ్యులు ధనవేందర్, మురళీ కృష్ణ, బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి పర్వతాలు,టి. సంజీవ్, బహుజన పొలిటికల్ నాయకులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీకి బీజేపీ నాయకుల ఘన స్వాగతం



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ విమోచన దినోత్సవం కోసం పోరాడిన అమరుల చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని డిమాండ్‌తో పరకాలలోని అమరదామం వరకు బైక్ ర్యాలీ సందర్భంగా హబ్సిగూడ చౌరస్తా వద్ద హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్, బీజేపీ రాష్ట్ర పాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌లు ఘనంగా స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సంజయ్ పటేల్, వేములకొండ సోమశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి చెల్లోజు ఎల్లాచారి, జిల్లేల రవీందర్ రెడ్డి, న్యాలకోండ సుమన్ రావు,రాగి వెంకట్ రెడ్డి , వేములకోండ వెంకన్న, గడ్డం సాయి కిరణ్, పడతియ నాయక్, పూజారి సోమయ్యగౌడ్, అదిమల్ల వెంకటయ్య, అల్కాపురి సురేష్, కట్ట భాస్కర్ శాంతికుమార్, సుధాకర్, శంకర్, పాల్గొన్నారు.



మెరుపు మీసొంతం

ముఖం మెరుపులీనాలని అందరికీ ఉంటుంది. ఇందుకు ఏవేవో క్రీములని, ఫౌండేషన్స్ అని చాలా ఖర్చు చేస్తుంటారు. అలా కాకుండా, సింపుల్‌గా, నాచురల్‌గా ముఖం కాంతులీనాలంటే కొన్ని చిన్న చిట్కాలు పాటిస్తే సరి..

బియ్యం పిండి, మిల్క్ క్రీమ్ రెండూ ముఖం మెరిసిపోవడానికి అద్భుతంగా పనిచేస్తాయి. ఇవి మంచి ఫేస్ స్క్రబ్‌లా కూడా ఉపయోగపడతాయి. ఒక టీస్పూన్ బియ్యం పిండిని తీసుకుని కాస్తంత మిల్క్ క్రీమ్‌ను కలపండి. ఆ తర్వాత ముఖంపై, మెడపై ఈ మిశ్రమంతో సర్క్యులర్ మోషన్‌లో మసాజ్ చేయండి. తర్వాత ముఖాన్ని శుభ్రం చేసుకోండి.


చిటికెడు పసుపును, శనగపిండిని కలిపి చిక్కగా పేస్ట్‌లా చేసుకుని, ముఖంపై మసాజ్ చేసుకోవాలి. ముఖ్యంగా మొటిమలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్న ప్రాంతంలో కచ్చితంగా మసాజ్ చేయాలి. ఇది ముఖంపై నుంచి అదనపు నూనెను గ్రహిస్తుంది. చర్మాన్ని హైడ్రేటెడ్‌గా, క్లీన్‌గా ఉంచుతుంది.

మిల్క్ క్రీమ్‌ను కాస్తంత తేనెతో కలపండి. ముఖంపై అప్లై చేసుకోండి. కొద్ది సేపు ఆరనివ్వండి. కొన్ని నిమిషాల తరువాత నీటితో కడిగేయండి. బ్యూటీపార్లర్‌కు వెళ్ళినంత మెరుపు మీ ముఖంపై గమనిస్తారు.

ఇట్ల చేద్దాం



ఇడ్లీలు మృదువుగా, రావాలంటే ఐదు కప్పుల బియ్యానికి ఒక కప్పు అటుకులు నానబెట్టుకోవాలి. రుబ్బుకునేపుడు వీటిని కలిపితే ఇడ్లీలు మృదువుగా వస్తాయి.



మానసికంగా కుంగదీశారు

సునీతకు 35 ఏండ్లు ఉంటాయి. తన తల్లిని తీసుకుని ఐద్వా అదాలత్‌కు వచ్చింది. వారికి సునీత ఒక్కతే కూతురు. తల్లి బట్టల మిల్లులో ఉద్యోగం చేస్తుంది. తండ్రి తన చిన్నతనంలోనే కుటుంబాన్ని వదిలేసి ఎటో వెళ్ళిపోయాడు. ఇంట్లో తల్లి, కూతురు మాత్రమే ఉంటారు. సునీతకు 17 ఏండ్లకే పెండ్లి చేసింది తల్లి. పెండ్లి తర్వాత ఒక ఏడాది వరకూ బాగున్నారు. వాళ్ళది పల్లెటూరు. భర్తకు వచ్చే జీతంతో ఇల్లు గడవడం కష్టంగా ఉండేది. అందుకే ఆమె కూడా ఏదో ఒక పని చేయాలనుకుంది. కొన్ని రోజులు వ్యవసాయం పనులకు వెళ్ళింది. తర్వాత చిన్న కిరాణ షాపు పెట్టుకుంది. దుకాణం బాగానే నడుస్తుంది. కానీ ఇక్కడి నుండే సమస్య మొదలైంది.

ఊరు కాబట్టి కిరాణా షాపులో మద్యం అమ్మితే ఎక్కువ డబ్బులు వస్తాయంటూ తోటి కోడలు సునీతకు చెప్పింది. కానీ దానికి ఆమె ఒప్పుకోలేదు. దాంతో సునీతను పక్కన బెట్టి అత్త, తోడి కోడలు షాపులో కూర్చునేవారు. సునీత ఎండు మిర్చి పౌడర్ చేసే మిషన్ తెచ్చుకుంది. పసుపు, మిర్చి పౌడర్ చేసేది. వచ్చిన డబ్బులు కొంత ఇంటికి ఖర్చు పెట్టి మిగిలిన వాటితో బంగారం కొనుక్కుంది. సునీతకు బాబు పుట్టాడు. దాంతో పుట్టింటికి వచ్చింది. డెలివరీ తర్వాత మూడు నెలల అక్కడే ఉంది. తర్వాత అత్తగారింటికి వెళ్ళింది. తను వెళ్ళే సరికి పరిస్థితి మొత్తం మారిపోయింది. కిరాణా షాపుపై పూర్తి ఆధిపత్యం వాళ్ళ తోడికోడలు తీసుకుంది. మిర్చి మిషన్ అమ్మేశారు. వచ్చిన డబ్బులతో భర్త కార్పెంటర్ మిషన్ తీసుకున్నాడు.

'నాకు చెప్పకుండా ఇలా చేశారేంటి' అని అడిగితే 'నీకెందుకు చెప్పాలి? నేను నీ మిషన్ అమ్మేసి వర్క్ చేసుకుంటాను. అన్నయ్యకు కూడా పని లేదు. వదినా, పిల్లలు ఎలా బతుకుతారు. అందుకే షాపు వాళ్ళకు ఇచ్చేశాను. షాపులో మందు అమ్మమంటే అమ్మడం లేదు. కానీ వదిన అలా కాదు. సరుకులతో పాటు మందు కూడా అమ్ముతుంది. ఎక్కువ డబ్బులు వస్తున్నాయి' అన్నాడు. దానికి ఆమె 'మరి ఇప్పుడు నేనేం చేయాలి. మనకూ ఇప్పుడు బాబు ఉన్నాడు. వాడి భవిష్యత్ గురించి ఆలోచించరా' అంటే 'నీకు పొలం పనులు కూడా వస్తాయిగా, నువ్వు ఆ పనులకు వెళ్ళు' అన్నాడు.

బాబు చిన్నగా ఉన్నాడని ఇక సునీత ఏం మాట్లాడలేదు. ఏడాది తర్వాత కుట్టు పనులు నేర్చుకుని మిషన్ తెచ్చుకుంది. బట్టలు కుట్టడం మొదలుపెట్టింది. కానీ ఆమె ఇంట్లో ఉండటం, భర్తకు, తోడి కోడలికి ఏ మాత్రం ఇష్టం లేదు. ఎప్పుడు ఏదో ఒక విషయానికి గొడవ పెట్టుకుంటారు. భర్త అయితే కొట్టడం ప్రారంభించాడు. అనవసరంగా తిట్టడం, మీ అమ్మ దగ్గరకు వెళ్ళి డబ్బులు తీసుకురా, బంగారం తీసుకురా అంటూ గొడవలు చేసేవారు. చివరకు కొట్టి పుట్టింటికి పంపించేశారు. సునీత తల్లి వేరే వాళ్ళ దగ్గర అప్పు చేసి లక్ష రూపాయలు తీసుకువచ్చి ఇచ్చింది. ఇలా 4, 5 సార్లు జరిగింది. చివరకు పెద్ద మనుషుల్లో పంచాయితీ కూడా పెట్టించింది.

వాళ్ళ ముందు 'ఇక పై అలా చెయ్యను' అనేవాడు. ఇంటికి వచ్చిన తర్వాత మళ్ళీ అలాగే చేసేవాడు. వాళ్ళు కూడా అతని ప్రవర్తనతో విసిగిపోయారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయమన్నారు. కానీ సునీత ఆ పని చేయలేకపోయింది. అసలు భర్త ఎందుకు ఇలా ప్రవర్తిస్తున్నాడో ఆమెకు చాలా రోజులు అర్థం కాలేదు. తన భర్తా, తోడి కోడలు ఎప్పుడూ సరదాగా మాట్లాడుకునే వారు. సునీత పెద్దగా పట్టించుకోలేదు. వాళ్లిద్దరూ మొదటి నుంచి ఒక్కటే స్కూల్, ఒక్కటే కాలేజీ, ఒకే క్లాస్. అందుకే అంత చనువుగా ఉంటారు అనుకునేది. కానీ ఒక రోజు 'నువ్వు ఇంట్లో బట్టలు కుట్టడానికి వీలు లేదు. మిషన్ సౌండ్‌కి, ఇంటికి వచ్చే వారితో చాలా ఇబ్బందిగా ఉంది అని' గొడవ చేశారు.

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

'మిషన్ కోసం కరెంటు ఉపయోగిస్తాను. కాబట్టి సౌండ్ రాదు. బట్టలు తీసుకోవడానికి వచ్చే వాళ్ళు కూడా మధ్యాహ్నం వస్తారు. వాళ్ళతో ఈయనకు ఇబ్బంది ఏంటో తెలీదు. ఒక రోజు లైనింగ్ కోసం నేను బయటకు వెళ్ళాను. వచ్చే సరికి ఇంట్లో మా ఆయన్ని, వాళ్ళ వదినను చూడకూడని స్థితిలో చూశాను. ఎందుకిలా చేశారని అడిగితే విపరీతంగా కొట్టారు. 'నువ్వు నాకు అవసరం లేదు పో' అన్నాడు. వాళ్ళ ఇద్దరి మధ్య వున్న సంబంధం ఇంట్లో అందరికీ తెలుసు. నాకూ ఎలాగో తెలిసిపోయింది కదా అని 'మా వదినతో నేను ఇలాగే ఉంటాను. నీకు ఇష్టమైతే ఇక్కడ ఉండు, లేదంటే పో' అన్నాడు.



సునీత పరిస్థితి మరింతగా క్షీణించింది. డాక్టర్లు మానసిక వైద్యులకు చూపించాలన్నారు. అదే విషయం భర్తకు చెపితే 'ఆమె పిచ్చిది అందుకే అలా చెప్పారు. మీరు చూయించుకుంటే చూపించుకోండి. నేను మాత్రం రాను' అన్నాడు.తల్లే సునీతకు చికిత్స చేయిస్తూ ఓ చిన్న పిల్లలా చూసుకుంటుంది. ఒంటిపైన బట్టలు ఉన్నాయో, లేదో కూడా తెలిసేది కాదు. తల్లి పనికి వెలుతూ సునీతను ఇంట్లో పెట్టి తాళం వేసి వెళ్ళేది. ఆమె పరిస్థితి తెలిసిన మిల్లు యజమానులు, తోటి ఉద్యోగులు సాయంగా ఉన్నారు.

దాంతో సునీత పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టింది. వదినకు, మరిదికి సంబంధం పెట్టి తప్పుగా మాట్లాడుతుందని అక్కడ నమ్మించారు. ఆమెకు పిచ్చి పట్టిందని, ఆస్పత్రికి తీసుకువెళ్ళి చికిత్స చేయించాలని నిర్ణయించారు. భర్త, కుటుంబ సభ్యులు కొట్టడం, తిట్టడంతో ఆమె మానసికంగా కుంగిపోయింది. పరిస్థితి విషమంగా మారడంతో ఆమెను పుట్టింట్లో వదిలేశారు. డాక్టరు పరీక్షలు చేసి 'ఈమె మానసిక పరిస్థితి బాగాలేదు. దేని గురించో బాగా ఆలోచిస్తుంది. కోలుకోవడానికి కొంచెం సమయం పడుతుంది' అన్నాడు. ఇదే మంచి అవకాశం అని భర్త ఆమెను వదిలేసి ఊరికి వెళ్ళిపోయాడు. అంతే తిరిగి రాలేదు.

సునీత పరిస్థితి మరింతగా క్షీణించింది. డాక్టర్లు మానసిక వైద్యులకు చూపించాలన్నారు. అదే విషయం భర్తకు చెబితే 'ఆమె పిచ్చిది అందుకే అలా చెప్పారు. మీరు చూయించుకుంటే చూపించుకోండి. నేను మాత్రం రాను' అన్నాడు. తల్లే సునీతకు చికిత్స చేయిస్తూ ఓ చిన్న పిల్లలా చూసుకుంటుంది. ఒంటిపైన బట్టలు ఉన్నాయో, లేదో కూడా తెలిసేది కాదు. తల్లి పనికి వెళుతూ సునీతను ఇంట్లో పెట్టి తాళం వేసి వెళ్ళేది. ఆమె పరిస్థితి తెలిసిన మిల్లు యజమానులు, తోటి ఉద్యోగులు సాయంగా ఉన్నారు. అందులో ఒకరి ద్వారా ఐద్వా గురించి చెప్పడంతో సునీతను తీసుకుని తల్లి మా దగ్గరకు వచ్చింది.

సునీత మాత్రం 'నాకు నా భర్త కావాలి, బాబు కావాలి ఇంక ఏమీ వద్దు' అంటుంది. 'డాక్టర్లతో కూడా పదే పదే ఇదే చెబుతుంది. వాళ్ళు ముందులు వాడితే మళ్ళీ మామూలు పనికి అవుతుందని చెప్పారు' అని తల్లి చెప్పింది.

మేము సునీతతో నీవు ప్రతి రోజు మందులు వేసుకుంటే నీ భర్తను, నీ బాబును నీ దగ్గరకు తీసుకువస్తామని చెప్పాం. మధ్య మధ్యలో సునీత వాళ్ళ అమ్మకు ఫోన్ చేసి మాట్లాడాం. ఆమె ఆరోగ్య పరిస్థితి కొంత మెరుగు పడిన తర్వాత సునీతను ఆఫీసుకు పిలిచాం. అప్పుడు జరిగింది మొత్తం తనే చెప్పింది.

మేము సునీత భర్తను పిలిస్తే రాలేదు. 'ఆమె పిచ్చిది, ఆమె చెప్పిన మాటలు మీరు ఎలా నమ్ముతారు. నేను రాను మేడం' అంటూ ఎన్ని సార్లు పిలిచినా రాలేదు. ఇక లాభం లేదని ఆ ఊరి సర్పంచ్‌కి ఫోన్ చేశాం. 'వాడు మేం చెప్పినా వినడం లేదు. మీరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోండి' అని చెప్పారు. మేము వెంటనే పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేసి విషయం చెప్పాము. సునీతతో 'నీ గురించి పట్టించుకోని వాడి గురించి నువ్వెందుకు ఆలోచిస్తావు. అతను నిన్ను వదిలేసి దాదాపుగా ఆరేండ్లు అవుతుంది. నీ బాబు కూడా నిన్ను మర్చిపోయాడు. బాబుతో మాట్లాడి నీతో పంపించే ప్రయత్నం చేస్తాం' అని చెప్పాం. దానికి సునీత కూడా అంగీకరించింది.

స్థానిక ఐద్వా వాళ్ళ సహాయంతో పోలీసులలో మాట్లాడి బాబును సునీతతో పంపించాం. కానీ బాబు వాళ్ళ అమ్మను పూర్తిగా మరిచిపోయాడు. ఆమెతో ఉండటానికి ఇష్టపడటం లేదు. దాంతో పదిహేను రోజుల తర్వాత బాబును తండ్రితో పంపించాం. ఇక సునీత భర్తతో మాట్లాడి పెండ్లిలో పెట్టిన బంగారం, కట్నంతో పాటుగా 5 లక్షల రూపాయలు ఇప్పించాం. అతని నుండి విడాకులు తీసుకుంది. ఇప్పుడు ఆమె తిరిగి చదువుకోవడం మొదలుపెట్టింది.

- వై. వరలక్ష్మి, 9948794051

వీరతెలంగాణ సాయుధ పోరాటం అజరామరం

(మొదటిపేజీ తరువాయి)

సీపీఐ(ఎం) లక్ష్యమన్నారు. సీట్ల కోసం, పొత్తుల కోసం కమ్యూనిస్టు పార్టీ వెంపర్లాడదని, ప్రజల కోసమే పనిచేస్తుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అన్న ప్రచారంతో బీఆర్ఎస్‌కు మైనార్టీ వర్గాలు దూరమయ్యే పరిస్థితి ఉంటుందని, ముస్లింల ఓట్లు పడకపోతే బీఆర్ఎస్ పార్టీ ఓడిపోతుందన్నారు. కవితకు మళ్ళీ ఈడీ నోటీసులు వచ్చిన సంగతిని గుర్తు చేశారు. ఈడీ నోటీసులు మళ్లీ రావడం వెనుక ఆంతర్యం ఏమిటో బీజేపీ, బీఆర్ఎస్ చెప్పాలన్నారు. తెలంగాణ వచ్చినంక దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఉద్యోగాలు ఇస్తామని హామీలిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం, వాటిని నెరవేర్చడంలో విఫలమైందన్నారు.

దళిత బంధు ఇస్తానని అక్కడక్కడ శాంపిల్ చూయించి దళితులను ఆగం చేస్తున్నారని, జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇస్తానని ఇప్పటివరకు ఇవ్వలేదని ఆరోపించారు. భవిష్యత్తు ఎన్నికల్లో సీపీఐతో కలిసి పోరాడుతామని, ఇతరపక్షాలతో అవసరమైన విధంగా పొత్తులు పెట్టుకుంటామన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కరాములు, పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాలస్వామి, జిల్లా నాయకులు శశిధర్, కళావతి, రవికుమార్, భాస్కర్, ఎల్లయ్య, యాదవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ హింసాకాండలో 175 మంది మృతి : పోలీసుల నివేదిక

(మొదటిపేజీ తరువాయి)

మందిలో ఇప్పటికీ గుర్తించని 96 మృతదేహాలు మార్చురీలో ఉన్నట్టు చెప్పారు. మణిపూర్‌లో గత కొన్ని నెలలుగా హింసాత్మక పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. నివేదిక ప్రకారం.. ఈ హింసలో కనీసం 5,172 అగ్ని ప్రమాద ఘటనలు జరిగాయి.

వాటిలో 4,786 నివాసాలు, 386 మతపరమైన ప్రదేశాలు (254 చర్చిలు, 132 దేవాలయాలు) అల్లరి మూకలు నిప్పు పెట్టాయి. హింస ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్ర ఆయుధగారం నుంచి 5,668 ఆయుధాలు లూటీకి గురయ్యాయనీ, వాటిలో 1,329 ఆయుధాలను భద్రతా బలగాలు తిరిగి స్వాధీనం చేసుకున్నాయని అన్నారు.

అలాగే 15,050 మందుగుండు సామగ్రి, 400 బాంబులు భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. రాష్ట్రంలో కనీసం 360 అక్రమ బంకర్లను భద్రతా బలగాలు ధ్వంసం చేశారు.బిష్ణుపూర్ జిల్లాలోని ఫౌగక్‌చావో ఇఖారు నుంచి చురచంద్‌పూర్ జిల్లాలోని కాంగ్‌వై వరకు బారికేడ్‌లను తొలగించామనీ, జాతీయ రహదారులపై భద్రతను ఏర్పాటు చేశామని చెప్పారు. 32, 2 నెంబర్ల జాతీయ రహదారులపై రాకపోకలు సాగించేందుకు అనుకూలంగా ఉన్నాయని అన్నారు. ఇప్పటివరకు 9,332 కేసులు నమోదు కాగా, 325 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు.

పేపర్-1 సులభం..పేపర్-2 కఠినం

- పేపర్-1కు 84.12 శాతం, పేపర్-2కు 91.11 శాతం హాజరు
- 27న ఫలితాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రశాంతంగా ముగిసింది. పేపర్-1 సులభంగా, పేపర్-2 ప్రశ్నాపత్రం గతంకంటే కొంచం కఠినంగా వచ్చినట్టు నిపుణులు చెప్తున్నారు. పేపర్-2 ప్రశ్నాపత్రం గణితం, సైన్స్ గత టెట్ కంటే కఠినంగా వచ్చినట్టు తెలుస్తున్నది. సోషల్ స్టడీస్ ప్రశ్నాపత్రం కూడా కఠినంగానే వచ్చింది. అయితే ఈనెల 27న టెట్ ఫలితాలను విడుదల చేయాలని నోటిఫికేషన్‌లోనే అధికారులు ప్రకటించారు. ఈ మేరకు ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్, టెట్ కన్వీనర్ ఎం రాధారెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టెట్ పేపర్-1కు 2,69,557 మంది దరఖాస్తు చేస్తే వారిలో 2,26,744 (84.12 శాతం) మంది హాజరయ్యారని తెలిపారు. అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 15,490 మంది దరఖాస్తు చేయగా, 14,771 (95.36 శాతం) మంది అభ్యర్థులు పరీక్ష రాశారని వివరించారు. అత్యల్పంగా నల్లగొండ జిల్లాలో 12,423 మంది దరఖాస్తు చేస్తే, 9,614 (77.39 శాతం) మంది హాజరయ్యారని పేర్కొన్నారు. పేపర్-2కు 2,08,498 మంది దరఖాస్తు చేయగా, వారిలో 1,89,963 (91.11 శాతం) మంది అభ్యర్థులు పరీక్ష రాశారని తెలిపారు. అత్యధికంగా వికారాబాద్‌లో 3,846 మంది దరఖాస్తు చేస్తే, 3,689 (95.92 శాతం) మంది హాజరయ్యారని పేర్కొన్నారు. అత్యల్పంగా రంగారెడ్డి జిల్లాలో 13,386 మంది దరఖాస్తు చేయగా, 11,071 (82.71 శాతం) మంది పరీక్ష రాశారని వివరించారు.

ఇక అందరిదృష్టి డీఎస్సీపైనే...

ఉపాధ్యాయ అభ్యర్థులందరి దృష్టి ఇక నుంచి డీఎస్సీపైనే ఉండనుంది. రాష్ట్రంలో 6,612 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో 5,089 ఉపాధ్యాయ పోస్టులు, 1,523 ప్రత్యేక (డిజెబుల్డ్) టీచర్లకు సంబంధించిన ఖాళీలున్నాయి. వాటికి భర్తీకి సంబంధించి ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చింది. అయితే తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఆధ్వర్యంలో ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) కాకుండా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలోనే జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ) ద్వారా నియామకాల ప్రక్రియను చేపట్టనున్న విషయం తెలిసిందే. అయితే 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకే డీఎస్సీ నోటిఫికేషన్ ఈనెల ఏడో తేదీన విడుదలైంది. ఇందులో 1,739 స్కూల్ అసిస్టెంట్, 2,575 ఎస్జీటీ, 611 భాషా పండితులు, 164 పీఈటీ పోస్టులున్నాయి. మొదటిసారిగా డీఎస్సీ రాతపరీక్షలను నవంబర్ 20 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష (సీబీఆర్టీ) విధానంలో నిర్వహిస్తున్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 20 నుంచి వచ్చేనెల 21 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

సిరిసిల్లలో 'టెట్' గందరగోళం

- మారిన పరీక్ష బుక్‌లెట్
- ఆందోళనకు దిగిన అభ్యర్థులు

నవతెలంగాణ - సిరిసిల్ల క్రైం

సిరిసిల్లలో శుక్రవారం టెట్ పరీక్ష నిర్వహణ గందరగోళంగా మారింది. ఉదయం పేపర్-1 పరీక్షను సజావుగా నిర్వహించిన అధికారులు మధ్యాహ్నం పేపర్-2 పరీక్ష నిర్వహణలో నిర్లక్ష్యం వహించారు. అభ్యర్థులకు ఒక బుక్‌లెట్ బదులు మరో బుక్‌లెట్ అందింది. అభ్యర్థులంతా కేంద్రంలో ఓఎమ్మార్ షీట్స్ తీసుకుని అందులో హాల్ టికెట్, పేపర్ బుక్‌లెట్‌లోని దాదాపు 40 ప్రశ్నలకు జవాబులను బబ్లింగ్ చేశారు. ఇంతలోనే జిల్లా కేంద్రంలోని 14 పరీక్ష కేంద్రాల పర్యవేక్షణ అధికారులకు ఓ సమాచారం అందింది. అధికారికంగా అందాల్సిన ప్రశ్నపత్రం బుక్‌లెట్-2 కాగా.. దానికి బదులుగా బుక్లెట్-1 ఇచ్చారని తెలుసుకున్నారు. వెంటనే వాటిని మార్చుతామని, సంబంధిత ప్రశ్నపత్రాలు సరఫరా చేస్తున్నట్టు జిల్లా అధికారులు ప్రకటించారు. అప్పటికే కొన్ని పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు ఓఎమ్మార్ షీట్స్‌లో హాల్ టికెట్



నంబర్, క్వశ్చన్ పేపర్ బుక్‌లెట్ నంబర్, కొన్ని ప్రశ్నలకు సమాధానాలను బబ్లింగ్ చేశారు. వీటన్నింటినీ సరిచేయడానికి ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకుంటామని చెప్పి పరీక్ష కేంద్రాల్లోని అభ్యర్థులను ఇన్విజిలేటర్ సముదాయించారు. ప్రశ్నపత్రం మార్పు చేయడానికి, నిర్ణీత సమయానికి జరిగిన ఆలస్యానికి సమానంగా అభ్యర్థులకు సమయం ఎక్కువ ఇస్తామని తెలపడంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగింది. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించాల్సిన పరీక్షను సిరిసిల్లలో ఒక్కో కేంద్రానికి ఒక్కో విధంగా ముగించారు.

సిరిసిల్ల పత్తిపాక వీధిలోని సిద్ధార్థ పాఠశాల పరీక్ష కేంద్రంలో అభ్యర్థుల ఓఎమ్మార్ షీట్‌ను వైట్‌నర్ వేసి సర్దుబాటు చేయడంతో వాటిని పరిగణలోకి తీసుకోరన్న వాదనతో అభ్యర్థులు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో పోలీసులకు, వివిధ పార్టీల నాయకులకు వాగ్వావాదం జరిగింది. సిరిసిల్ల పట్టణ మధ్యలో మంత్రి కేటీఆర్ మెడికల్ కాలేజీ ప్రారంభ సభ వేదిక పెట్టడం వల్ల.. తారుమారైన ప్రశ్నపత్రాలను కేంద్రాలకు సకాలంలో చేరవేయడానికి అధికారులకు కుదరలేదని పొంతనలేని సమాధానాలు చెప్పారు. ట్రాఫిక్ జామ్, అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమ భవిష్యత్ అగమ్యగోచరంగా మారిందని పలువురు అభ్యర్థులు నిరసనకు దిగారు. భేషరతుగా టెట్ పరీక్షను రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు, అభ్యర్థులు డిమాండ్ చేశారు. నిరసనకు దిగిన ప్రతిపక్ష పార్టీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పరీక్ష కోసం వచ్చి..ప్రాణాలు విడిచి

- ఆయాసం, బీపీ ఎక్కువై.. కుప్పకూలిన 8 నెలల నిండు గర్భిణి
- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి
- ఇస్నాపూర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో ఘటన

నవతెలంగాణ-పటాన్‌చెరు

టెట్ పరీక్ష రాసేందుకు వచ్చిన ఓ ఎనిమిది నెలల నిండు గర్భిణి.. పరీక్షా హాల్‌లోకి వెళ్లే తొందరపాటులో మెట్లు ఎక్కుతూ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇందిరానగర్‌కు చెందిన బంటు రాధిక(32) టెట్ పరీక్ష రాయడం కోసం భర్త అరుణ్‌తో కలిసి పటాన్‌చెరు మండలంలోని ఇస్నాపూర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలకు వచ్చింది. ఉదయం 9 గంటలకు సెంటర్‌కు చేరుకున్న ఆమె.. రెండో అంతస్తులోని పరీక్ష హాల్‌కు మెట్ల వైపుగా వెళ్లింది. ప్రస్తుతం ఆమె ఎనిమిది నెలల గర్భిణి కాగా.. మొదటి అంతస్తుకు చేరుకునేసరికి కొంత ఆయాసంతో బీపీ ఎక్కువై, చెమటతో ఒక్కసారిగా కుప్పకూలిపోయింది.

వెంటనే అక్కడున్న వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. ఆమె భర్త అరుణ్ హుటాహుటిన కారులో ముత్తంగిలోని ప్రణం ఆస్పత్రికి.. అక్కడి నుంచి పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు చేసిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్టు ధృవీకరించారు. మృతురాలికి రెండేండ్లు, నాలుగేండ్లు ఉన్న ఇద్దరు ఆడపిల్లలున్నారు. భార్య మృతితో భర్త అరుణ్ కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ ఘటనతో పరీక్షాకేంద్రంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

వైద్యరంగంలో దేశానికే ఆదర్శం

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రానికే కాకుండా దేశ ఆరోగ్య వ్యవస్థకు కూడా అదే పద్దతిలో పని చేస్తారని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటున్నామని ఆయన తెలిపారు. కరోనా లాంటి వైరస్‌లు భవిష్యత్తులో వస్తే ఎక్కడైతే వైద్యారోగ్య వ్యవస్థ పకడ్బందీగా, పటిష్టంగా ఉంటుందో అక్కడ తక్కువ ప్రాణ నష్టం ఉంటుందనీ, ఎక్కడైతే ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తాయో ఆ సమాజం ఎక్కువ నష్టపోతుందన్నారు. తెలంగాణలో 34 వైద్య కళాశాలలు అంటే 34 పెద్ద దవాఖానాలు వస్తాయని తెలిపారు. 2014లో 17 వేలున్న పడకలు 34 వేలకు చేరాయనీ, మరో ఆరు ఆస్పత్రులు, వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించుకుంటున్నామని తెలిపారు. నిమ్స్ పడకలను 4 వేలకు పెంచడంతో పాటు నాలుగు టిమ్స్ ఆస్పత్రులు రాబోతున్నాయన్నారు. 50 వేల ఆక్సిజన్ బెడ్లు అందుబాటులో ఉంచడంతో పాటు 10 వేల సూపర్ స్పెషాలిటీ బెడ్లు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నిటి అయోగ్ నివేదిక ప్రకారం 2014లో వైద్యారోగ్య రంగంలో 11వ స్థానంలో ఉన్న తెలంగాణ ప్రస్తుతం మూడో స్థానానికి చేరుకుందని తెలిపారు. ప్రయివేటు దోపిడీ నుంచి ప్రజలను బయటపడేయాలనే ఆలోచనతోనే కేసీఆర్ కిట్ తెచ్చినట్టు సీఎం కేసీఆర్ గుర్తుచేశారు. కేసీఆర్ కిట్ మానవీయ కోణంలో తీసుకొచ్చామని తెలిపారు. అమ్మఒడి వాహనాలతో మారుమూల ప్రాంతాలకు చెందిన గర్భవతులు, బాలింతలకు రవాణా సౌకర్యం కల్పించబడిందని తెలిపారు. కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉండేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. మాతా, శిశు మరణాలను మరింతగా తగ్గిస్తుందన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావాలని వైద్య విద్యార్థులకు సూచించారు. ఏవైనా కొరతలుంటే ఎంత ఖర్చు చేయడానికైనా వెనుకాడేది లేదని సీఎం హామీ ఇచ్చారు. రాబోయే ఆర్థిక సంవత్సరం 2024-25లో మరో ఎనిమిది మెడికల్ కాలేజీలు జోగులాంబ గద్వాల, ములుగు, మెదక్, నారాయణపేట, వరంగల్(నర్సంపేట), యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సీఎం కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ తదితరులు పాల్గొన్నారు. ఆయా జిల్లాల్లో మంత్రులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పార్లమెంటులో మహిళా, బీసీ బిల్లులు పెట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

లేఖ రాయాలని నిర్ణయించారు. శుక్రవారం ప్రగతిభవన్‌లో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సంయుక్త సమావేశం ఆపార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన జరిగింది. పై అంశాలపై సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా లోక్‌సభ, రాజ్యసభల్లో బీఆర్ఎస్ సభ్యులు అనుసరించాల్సిన వ్యూహంపై ఆయన దిశానిర్దేశం చేస్తూ మాట్లాడారు. మహిళా సంక్షేమం, బీసీల అభ్యున్నతి కోసం బీఆర్ఎస్ పార్టీ కట్టుబడి వున్నదనీ, దేశవ్యాప్తంగా వారి హక్కులను కాపాడేందుకు కేంద్రానికి ఎప్పటికప్పుడు తమ గళాన్ని వినిపిస్తూనే ఉంటామని చెప్పారు. ఈ అంశాలను పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో లేవనెత్తాలని ఎంపీలకు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ బిల్లుపై చర్చించి ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపామని గుర్తుచేశారు.

ఈ తీర్మానం చేసి తొమ్మిదేండ్లు గడుస్తున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మౌనం వహించడాన్ని ఆయన తప్పుపట్టారు. ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటరీ ప్రత్యేక సమావేశాల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలనీ, దీనిపై కూడా తెలంగాణ రాష్ట్ర తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే ఏకగ్రీవ తీర్మానం చేసి పంపిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

నేడు సీడబ్ల్యూసీ సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీ సంస్థాగత అంశాలపై చర్చించి తగిన నిర్ణయాలు తీసుకోనున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాని అభ్యర్థిగా రాహుల్‌గాంధీ పేరుపై ప్రాథమికంగా చర్చించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. సీడబ్ల్యూసీ సమావేశంలో ఆ తీర్మానాన్ని చేసి ఇండియా కూటమి సమావేశంలో ప్రతిపాదించనున్నట్టు తెలిసింది. కాగా ఇప్పటికే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలనే ధృడ సంకల్పంతో ఉన్న కాంగ్రెస్ హై కమాండ్.. తెలంగాణపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. అందుకు అనుగుణంగా సీడబ్ల్యూసీలో కీలక నిర్ణయాలు చేసే అవకాశంఉంది. అగ్ర నాయకత్వం రెండు రోజుల పాటు హైదరాబాద్‌లోనే ఉండనున్న నేపథ్యంలో ఈ సమావేశం రాష్ట్ర ప్రజలతోపాటు జాతీయ స్థాయిలో కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ పాలిత ముఖ్యమంత్రులు, తదితరులు శుక్రవారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు రానున్నారు. కాంగ్రెస్ పార్టీలోని ఆయా కమిటీల నేతలు, ఇతర ముఖ్య నాయకులు నగరానికి ఇప్పటికే చేరుకున్నారు. సీడబ్ల్యూసీ సమావేశం సందర్భంగా తాజ్ కృష్ణతోపాటు సభ్యులు బస చేసే హైదరాబాద్‌లోని ప్రముఖ హోటల్స్ వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈనెల 17న తుక్కుగూడలో నిర్వహి ంచే విజయభేరి సభకు ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, మరో కీలక నేత జైరాం రమేష్...ఢిల్లీ నుంచి నేరుగా శంషాబాద్ విమానశ్రయం నుంచి తుక్కుగూడ సభాస్థలిని రేవంత్‌రెడ్డితోపాటు ఇతర నేతలతో కలిసి పరిశీలించారు. విజయభేరి సభలో సోనియాగాంధీ ఆరు హామీలను విడుదల చేయనున్నారు. అందులో కర్నాటక తరహాలో గృహలక్ష్మి, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, అసైన్డ్ భూములకు యాజమాన్యపు హక్కులు కల్పించడం, యువత, రైతులకు ప్రత్యేకంగా భరోసా కల్పించనున్నారు. ఇవి కాకుండా ఎస్సీ, ఎస్టీ, మహిళా, మైనార్టీ, బీసీ సామాజిక తరగతులకు డిక్లరేషన్లు సిద్ధం చేసింది. కొన్నింటిని ప్రకటించింది. వీటన్నింటి సమ్మేళనంతో ప్రజలను ఆకర్షించే మ్యానిఫెస్టోను అక్టోబర్ మాసంలో విడుదల చేయనున్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

హైకోర్టు, జిల్లా కోర్టుల జోక్యం తగదు!



- జస్టిస్ ఎల్.నాగేశ్వర రావు కమిటీ అంశంలో సుప్రీం
- కమిటీ విధులకు ఆటంకం కలిగించే ఆదేశాలు చెల్లవు
- హైదరాబాద్ క్రికెట్ సంఘం ఎన్నికలకు లైన్ క్లియర్

నవతెలంగాణ-న్యూఢిల్లీ



హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఎన్నికలు, సంస్కరణలకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏండ్లుగా హైదరాబాద్ క్రికెట్ సంఘంలో గ్రూపు రాజకీయాలు ఆట అభివృద్ధికి గొడ్డలిపెట్టుగా నిలుస్తుందని, హెచ్‌సీఏ సమూల సంస్కరణలు, భవిష్యత్‌లో వివాద రహిత అపెక్స్ కౌన్సిల్ ఎన్నికకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఈ ఏడాది ఫిబ్రవరి 14న జస్టిస్ లావు నాగేశ్వర రావుతో కూడిన ఏక సభ్య కమిటీని సుప్రీంకోర్టు నియమించిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ క్రికెట్ సంఘం సమస్యలను సమూలంగా అధ్యయనం చేసిన ఏకసభ్య కమిటీ.. అపెక్స్ కౌన్సిల్ ఎన్నికను ప్రభావితం చేస్తున్న బహుళ క్లబ్‌ల యజమానులను ఎన్నికల ప్రక్రియకు దూరం చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఏకసభ్య కమిటీ నిర్ణయంపై పలు క్లబ్‌లు జిల్లా, హైకోర్టును ఆశ్రయించాయి. దీంతో షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 15న నిర్వహించాల్సిన ఎన్నికలు పట్టాలెక్కలేదు. దిగువ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులపై జస్టిస్ లావు నాగేశ్వర రావు సుప్రీంకోర్టులో పిటిషను దాఖలు చేయగా.. జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సిదాన్షు ధులియలతో కూడిన ద్వి సభ్య ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు న్యాయ పరిధి మేరకు ఆర్టికల్ 142 ప్రకారం ప్రత్యేకంగా ఈ ఆదేశాలు జారీ చేస్తున్నాం. సంపూర్ణ న్యాయం అందించే ప్రక్రియలో భాగంగా ఆర్టికల్ 142ను వినియోగిస్తారు.

ఆ ఆదేశాలు చెల్లవు!

జస్టిస్ లావు నాగేశ్వర రావు కమిటీ హెచ్‌సీఏ ఎన్నికల్లో పాల్గొనకుండా బహుళ యాజమాన్యంలోని 57 క్లబ్‌లపై మూడేండ్ల పాటు నిషేధం విధిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. దీనిపై పలు క్లబ్‌లు న్యాయస్థానాలను ఆశ్రయించాయి. ఎలక్టోరల్ కాలేజ్ ఏర్పాటు తుది ప్రక్రియ ఖరారు చేసిన జస్టిస్ లావు నాగేశ్వర రావు.. ఎన్నికల అధికారిగా మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ వి.ఎస్ సంపత్‌ను నియమించారు. కానీ ఓటు హక్కు, ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేకుండా చేయటంపై కొన్ని క్లబ్‌లు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు సహా జిల్లా కోర్టులు పలు ఆదేశాలు జారీ చేశాయి. దీంతో హెచ్‌సీఏ ఎన్నికల ప్రక్రియకు బ్రేక్ పడింది. ఈ పరిస్థితిపై జస్టిస్ లావు నాగేశ్వరరావు సుప్రీంకోర్టులో పిటిషను దాఖలు చేయగా.. ద్వి సభ్య ధర్మాసనం దిగువ కోర్టుల ఆదేశాలు చెల్లవని పేర్కొంది. 'ఎలక్టోరల్ కాలేజ్ జాబితా మార్పులు, చేర్పులపై దిగువ కోర్టులు ఆదేశాలు చెల్లవు. ఏక సభ్య కమిటీ విధులకు విఘాతం కలిగించే ఆదేశాలు అమల్లోకి రాలేవు. హెచ్‌సీఏ ఎన్నికలు, సంస్కరణల అంశంలో ఏక సభ్య కమిటీకి సుప్రీంకోర్టు పూర్తి అధికారాలు ఇచ్చింది. సుప్రీంకోర్టు ఎదుట పెండింగ్‌లో ఉన్న పిటిషను సైతం ఎన్నికల నిర్వహణకు ఆటంకం కాబోదు. జస్టిస్ నాగేశ్వర రావు కమిటీ తన విధులను యథావిధిగా నిర్వర్తించాలి' అని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ అన్నారు.



రిటైర్డ్ జడ్జితో విచారణ కమిటీ!

విశ్రాంత జస్టిస్ లావు నాగేశ్వర రావు పిటిషను విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. హైదరాబాద్ క్రికెట్ సంఘం సహా ఇతర క్రీడా సంఘాల్లోనూ ఇదే తీరు కనిపిస్తుంది. కొందరు వ్యక్తులు శాశ్వతంగా పదవుల్లో కొనసాగేందుకు ఎన్నికల ప్రక్రియకు అడ్డుగా నిలుస్తున్నారు. గ్రూపు రాజకీయాలకు కేంద్రంగా మారిన హైదరాబాద్ క్రికెట్ సంఘంలోనూ ఇదే తీరు. గతంలో అంబుడ్స్‌మన్ ఎంపిక విషయంలో హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ సరైన రీతిలో వ్యవహరించలేదు. అంబుడ్స్‌మన్, ఎథిక్స్ ఆఫీసర్ ఎంపిక వివాదం సహా హెచ్‌సీఏ వ్యవహారాలపై సమగ్ర విచారణకు సుప్రీంకోర్టు లేదా హైకోర్టు మాజీ న్యాయమూర్తితో కమిటీ ఏర్పాటుకు ఆదేశిస్తామని ఈ సందర్భంగా జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ వ్యాఖ్యానించారు. ఈ కేసులో విచారణను అక్టోబర్ 31కి వాయిదా వేశారు.



స్పోర్ట్స్ హబ్‌గా తెలంగాణ

- శాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్
- థాయ్ బాక్సింగ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో తెలంగాణ స్పోర్ట్స్ హబ్‌గా తయారైందని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ అన్నారు. ఎల్బీ స్టేడియం వేదికగా జాతీయ థాయ్ బాక్సింగ్ పోటీలు నేటి నుంచి ఆరంభం కానుండగా.. టోర్నీకి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. 'క్రీడా రంగానికి తెలంగాణ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుంది. స్టేడియాల నిర్మాణం, మౌళిక వసతుల కల్పన సహా గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం అందించేందుకు క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశాం. ప్రతి గ్రామానికి సమగ్ర క్రీడా సామాగ్రితో కూడిన కెసిఆర్ స్పోర్ట్స్ కిట్‌ను అందజేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. జాతీయ థాయ్ బాక్సింగ్ పోటీలకు హైదరాబాద్‌ను ఎంచుకోవటం సంతోషం. క్రీడా పోటీలకు రాష్ట్ర ప్రభుత్వం, శాట్స్ నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని' ఆంజనేయ గౌడ్ అన్నారు. జాతీయ థాయ్ బాక్సింగ్ టోర్నీలో 16 రాష్ట్రాల నుంచి 390 మంది బాక్సర్లు పోటీపడుతున్నారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో మెన్, ఉమెన్ చాంపియన్‌షిప్స్ జరుగుతాయి. శనివారం పోటీలు ఆరంభం కానుండగా, ఆదివారం అన్ని విభాగాల్లో ఫైనల్స్ జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మహారాష్ట్ర ఎమ్మెల్యే గౌతమ్ చుబుకేశ్వర్, తెలంగాణ ఒలింపిక్ సంఘం కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్, థాయ్‌బాక్సింగ్ ఆఫ్ ఇండియా ఫెడరేషన్ అధ్యక్షుడు సంతోష్ ఖైర్నార్ తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ నం.2 భారత్

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్



దుబాయ్ : ఐసీసీ ప్రపంచకప్ ముంగిట టీమ్ ఇండియా ర్యాంకింగ్స్‌లో ఎగబాకుతుంది. ఆసియా కప్ ఫైనల్లోకి ప్రవేశించిన రోహిత్‌సేన.. తాజా ఐసీసీ వన్డే టీమ్ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి చేరుకుంది. భారత్ 116 పాయింట్లతో వరల్డ్ నం.2గా నిలువగా.. 118 పాయింట్లతో ఆస్ట్రేలియా అగ్రస్థానం సొంతం చేసుకుంది. వరల్డ్ నం.1గా ఆసియా కప్‌కు వచ్చిన పాకిస్థాన్.. సూపర్4 నుంచి నిష్క్రమించి మూడో స్థానానికి పడిపోయింది. సెప్టెంబర్ 22 నుంచి ఆస్ట్రేలియా, భారత్ వన్డే సిరీస్ ఉండటంతో.. ఐసీసీ వరల్డ్‌కప్ వేట ముంగిట అగ్రజట్లు సమర సన్నద్ధతతో పాటు అగ్రస్థానం కోసం పోటీపడనున్నాయి.



కొత్తగా మరో 22 మంది అథ్లెట్లు

ఆసియా క్రీడలకు భారత బృందం

న్యూఢిల్లీ : 2023 హాంగ్జౌ ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత అథ్లెట్ల బృందంలో కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ పలు మార్పులు చేసింది. ఆసియా క్రీడల్లో పోటీపడేందుకు కొత్తగా 22 మంది అథ్లెట్లకు అవకాశం కల్పించిన క్రీడాశాఖ.. కోచ్‌లు, సహాయక సిబ్బందిలోనూ పలు మార్పులు చేసింది. తొలుత వెల్లడించిన జాబితాలో 25 మంది సిబ్బందిని మార్చివేసింది. ఈ మేరకు సవరించిన ఆసియా క్రీడల భారత బృందం జాబితాను శుక్రవారం వెల్లడించారు. సెప్టెంబర్ 23 నుంచి ఆసియా క్రీడలు ఆరంభం కానున్నాయి.

శుభ్‌మన్ శతక్కొట్టినా..!

ఛేదనలో భారత్ పరాజయం ● సూపర్4లో బంగ్లాకు ఊరట విజయం



కొలంబో : శుభ్‌మన్ గిల్ సెంచరీ (121, 133 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌లు) శతకంతో చెలరేగినా ఛేదనలో టీమ్ ఇండియా చతికిల పడింది. 266 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ 49.5 ఓవర్లలో 259 పరుగులకే కుప్పకూలింది. 6 పరుగుల తేడాతో గెలుపొందిన బంగ్లాదేశ్ ఆసియా కప్ సూపర్4 ఊరట విజయం సాధించింది. ఓటమితో టీమ్ ఇండియా ఫైనల్స్‌కు చేరుకోగా.. గెలుపుతో బంగ్లాదేశ్ ఇంటిముఖం పట్టింది. రోహిత్ (0), తిలక్ వర్మ (5), రాహుల్ (19), కిషన్ (5), జడేజా (7), సూర్యకుమార్ యాదవ్ (26) నిరాశ పరిచినా.. ఓ ఎండ్‌లో గిల్ నిలబడ్డాడు. అక్షర్ పటేల్ (42, 34 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) భారత్‌ను గెలుపు తీరాలకు చేర్చేలా కనిపించినా.. ఆఖర్లో బంగ్లాదేశ్ పుంజుకుంది. భారత్‌ను ఆలౌట్ చేసి ఊరట విజయం దక్కించుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 265 పరుగులు చేసింది. బంగ్లాదేశ్ కెప్టెన్ షకిబ్ అల్ హసన్ (80, 85 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), తౌహిద్ (54, 81 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్థ సెంచరీలతో రాణించారు. టాస్ నెగ్గిన భారత్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, హార్దిక్ పాండ్య, జశ్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్‌లకు విశ్రాంతి లభించగా.. తెలుగు తేజం తిలక్ వర్మ వన్డే అరంగేటం చేశాడు. కొత్త బంతితో భారత పేసర్లు చెలరేగారు. షమి, శార్దుల్ వికెట్ల వేటలో దూకుడు చూపించారు. దీంతో 59 పరుగులకే బంగ్లాదేశ్ 4 వికెట్లు కోల్పోయింది. దీంతో బంగ్లాదేశ్ 150 పరుగులు చేయటం చేసినా గొప్పే అనిపించింది. కానీ కెప్టెన్ షకిబ్ అల్ హసన్ (80), తౌహిద్ (54), నసుం అహ్మద్ (44), మెహిది హసన్ (29)లు భారత బౌలర్లను ఎదురొడ్డి పరుగుల వేట సాగించారు. దీంతో బంగ్లాదేశ్ 265 పరుగుల మంచి స్కోరు నమోదు చేసింది. హసన్ (13), లిటన్ దాస్ (0), అనాముల్ (4), మెహిది మిరాజ్ (13), షమిమ్ (1)లు విఫలమయ్యారు. శార్దుల్ ఠాకూర్ (3/65), మహ్మద్ షమి (2/32) మెరువగా.. ప్రసిద్ కృష్ణ, అక్షర్, జడేజా తలా ఓ వికెట్ ఖాతాలో వేసుకున్నారు.

పది నగరాల్లో జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

మెంటార్లుగా స్టార్ షట్లర్లు సాత్విక్, చిరాగ్



హైదరాబాద్ : జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ (జెబిసి) 2023 ఈ నెల 15 నుంచి ఆరంభం కానుంది. విజయవంతంగా ఏడో సీజన్‌కు సిద్ధమైన జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఈ ఏడాది దేశవ్యాప్తంగా పది నగరాల్లో జరుగనుంది. ఈ మేరకు నిర్వాహకులు పిఎన్‌బి మెట్‌లైఫ్ ఎండీ, సీఈవో ఆశీష్ కుమార్ శ్రీవాత్సవ వెల్లడించారు. ఇందుకు సంబంధించిన టోర్నీ ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. భారత అగ్రశ్రేణి షట్లర్లు సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్ శెట్టిలు జెబిసి మెంటార్లుగా వ్యవహరించనున్నారు. గువహటిలో సెప్టెంబర్ 15 నుంచి ఆరంభం కానున్న ఈ టోర్నీ.. నవంబర్ 10న ఢిల్లీలో ముగియనుంది. కోచి, ముంబయి, బెంగళూర్, రాంచీ, అహ్మదాబాద్, లక్నో జలంధర్‌లో సైతం టోర్నీ నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లో అక్టోబర్ 19 నుంచి 23 వరకు జెబిసి పోటీలు నిర్వహించనున్నారు.

నవచిత్రం



భావోద్వేగ భరిత క్షణాలు..

100 కుటుంబాలకు రూ. కోటి సాయం

"ఖుషి' సినిమాకు ఘన విజయాన్ని అందించిన అభిమానులతో తన సంతోషాన్ని పంచుకున్నారు హీరో విజయ్ దేవరకొండ. 'ఖుషి' హ్యాపీనెస్‌ని షేర్ చేసేందుకు ఎంపిక చేసిన 100 లక్కీ ఫ్యామిలీస్‌కు లక్ష రూపాయల చొప్పున ఆయన చెక్స్ అందించారు. ఈ చెక్స్ అందుకున్న కుటుంబాలు ఉద్వేగానికి లోనై విజయ్‌ను హగ్ చేసుకున్నారు.

హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు శివ నిర్వాణ, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు నవీన్ యెర్నేని, వై రవిశంకర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ,'నాకు ఇంత ప్రేమ పంచుతున్న మీ కోసం ఎన్నో మంచి కార్యక్రమాలు చేయాలని ఉంటుంది. ఎందుకంటే నేను కూడా ఒకప్పుడు ఇలా ఎవరైనా మనకు హెల్ప్ చేస్తే బాగుండు అని అనుకున్న వాడినే. ఈ లక్ష రూపాయలు అందిన తర్వాత కొంచెం సంతోషం కలిగి ఒత్తిడి తగ్గి, బలాన్నిచ్చి మీకు ఆనందంగా అనిపిస్తే నాకు అదే సంతృప్తినిస్తుంది. ఈ చిన్న సాయం మీకు ఉపయోగపడితే నాకు హ్యాపీ. లాస్ట్ టైమ్ కొంతమంది పిల్లల్ని టూర్‌కు పంపించా. ఈ ప్రోగ్రాం అనౌన్స్ చేసినప్పటి నుంచి 50 వేలకు పైగా అప్లికేషన్స్ వచ్చాయి. అయితే 100 మందికి మాత్రమే చేయగలుగుతున్నాం. ప్రతి ఇయర్ ఇంకొందరికి హెల్ప్ చేస్తా. ఇలా నేను స్ట్రాంగ్‌గా ఉన్నంతవరకు, నేను సినిమాలు చేస్తున్నంతకాలం మీకు సపోర్ట్ చేస్తూనే ఉంటాను' అని తెలిపారు.

"ఖుషి' సినిమా సక్సెస్ మా అందరికీ ఎంత ఖుషిని పంచిందో మీకు తెలుసు. మీ అందరి ఆదరణ వల్లే సినిమా ఇంత సక్సెస్ అయ్యింది. మా సంతోషాన్ని మీతో కూడా పంచుకునేందుకు విజయ్ ఇలా చేయటం హ్యాపీగా ఉంది. ఆడియెన్స్, అభిమానులు ఇచ్చిన ప్రేమ వల్లే మా మైత్రి సంస్థ ఇంత మంచి పొజిషన్‌లో ఉంది. వారికి తిరిగి ఇవ్వడం అనే గుడ్ కాన్సెప్ట్‌ని విజయ్ తీసుకురావడం బాగుంది. ఇండస్ట్రీలోని మిగతా వారు కూడా ఇలాంటి అడుగు వేస్తారని ఆశిస్తున్నాం. భవిష్యత్‌లోనూ మా సంస్థ ఇలాంటి మరిన్ని మంచి కార్యక్రమాలను నిర్వహించేందుకు కృషి చేస్తుంది. మీ అందరి ఆదరణకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు' అని దర్శక, నిర్మాతలు శివ నిర్వాణ, వై రవిశంకర్, నవీన్ యెర్నేని అన్నారు.



బ్రహ్మానందం

కీడా కోలా రిలీజ్ డేట్ ఫిక్స్

దర్శకుడు తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వంలో రూపొందుతున్న క్రైమ్ కామెడీ మూవీ 'కీడా కోలా'. హీరో రానా ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్ర ఫస్ట్ లుక్, టీజర్‌తో క్యూరియాసిటీని పెంచింది. తాజాగా మేకర్స్ ఈ సినిమా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. నవంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానుంది. రిలీజ్ డేట్ పోస్టర్‌లో బ్రహ్మానందం, తరుణ్ భాస్కర్, చైతన్య రావు.. ప్రధాన తారాగణం అంతా సీరియస్ లుక్స్‌లో కనిపించడం ఆసక్తికరంగా ఉంది. ఇది విజి సైన్మా మొదటి ప్రొడక్షన్. కె.వివేక్ సుధాంషు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్ నండూరి, శ్రీపాద్ నందిరాజ్, ఉపేంద్ర వర్మ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బ్రహ్మానందం, రఘు రామ్, రవీంద్ర విజయ్, జీవన్ కుమార్, విష్ణు, తరుణ్ భాస్కర్, చైతన్య రావు మదాడి, రాగ్ మయూర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వివేక్ సాగర్, సినిమాటోగ్రఫీ: ఏజే ఆరోన్, ఎడిటర్: ఉపేంద్ర వర్మ.

భయం.. అత్యాశ.. కుట్ర



ఆనంద్ దేవరకొండ

హీరో ఆనంద్ దేవరకొండ నటిస్తున్న కొత్త సినిమా 'గం..గం.. గణేశా'. హై-లైఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మిస్తున్న ఈ చిత్రంతో ఉదయ్ శెట్టి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్ర టీజర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో రిలీజ్ చేశారు. ఈ వేడుకలో దర్శకులు శివ నిర్వాణ, అనుదీప్ కేవీ, కార్తీక్ దండు, వినోద్ అతిథులుగా పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ వంశీ కారుమంచి మాట్లాడుతూ, 'టీజర్ ఎంత ఎనర్జిటిక్‌గా, కామెడీగా ఉందో మూవీ కూడా అంతే యాక్షన్ కామెడీతో ఉంటుంది. ఈ సినిమా ఈ ఇయర్ ఆనంద్‌కు సెకండ్ సూపర్ హిట్ అవుతుంది' అని చెప్పారు. డైరెక్టర్ ఉదయ్ శెట్టి మాట్లాడుతూ, 'మన లైఫ్‌లో ఏదో ఒక సందర్భంలో క్రేజీ క్యారెక్టర్స్ చూస్తుంటాం. అలాంటి క్రేజీ క్యారెక్టర్స్ అన్నీ ఈ సినిమాలో ఉంటాయి. వినాయక చవితి చుట్టూ తిరిగే కథ ఇది' అని తెలిపారు. 'భయం, అత్యాశ, కుట్ర చుట్టూ ఈ సినిమా తిరుగుతుంటుంది. సినిమాలో అన్నీ గ్రే క్యారెక్టర్స్ ఉంటాయి. ఎవరి ప్లాన్స్‌తో వారు ఉంటారు. రేసీ, గ్రిప్పింగ్ స్క్రీన్ ప్లే చూస్తారు' అని హీరో ఆనంద్ దేవరకొండ అన్నారు.

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ తాజాగా ఓ కన్నడ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తోంది. రక్షిత్ శెట్టి హీరోగా నటిస్తూ నిర్మించిన చిత్రం 'సప్త సాగర దాచే ఎల్లో'. ఈ సినిమా కన్నడలో సూపర్ హిట్ అందుకుంది. హేమంత్ ఎం రావు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమా ఈనెల 1న కన్నడ ప్రేక్షకుల ముందుకి వచ్చి క్లాసిక్ లవ్ స్టోరీగా పేరు తెచ్చుకుంది. తాజాగా ఈ చిత్రానికి 'సప్త సాగరాలు దాటి' అనే టైటిల్‌ని అనౌన్స్ చేసిన పీపుల్ మీడియా

సప్త సముద్రాలు దాటి వస్తావా..



రక్షిత్ శెట్టి, రుక్మిణీ వసంత్

ఫ్యాక్టరీ ఈనెల 22న ఈ మూవీని తెలుగులో రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించింది. 'అతడే శ్రీమన్నారాయణ, 777 చార్లీ'లతో రక్షిత్‌శెట్టి తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరయ్యాడు. కన్నడలో మంచి విజయం సాధించిన ఈ చిత్రం తెలుగులోనూ సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉందని నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ చెప్పారు. దీనికి వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత.

నలుగురు దర్శకులతో కొత్త ప్రయోగం



'కాలా' సిరీస్‌లో ఒక దృశ్యం

వైట్ మనీని బ్లాక్ మనీగా మార్చే కథాంశంతో రూపొందిన 'కాలా' వెబ్‌సిరీస్ డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో ప్రసారం అవుతోంది. ఈ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్‌లో నివేత పేరురాజ్, రిత్విక్ ముఖర్జీతో పాటు నలుగురు దర్శకులు కూడా నటించడం విశేషం. ఇది కొత్త ప్రక్రియ అని, కొత్త కథలకు 'కాలా' స్ఫూర్తి అని హాట్‌స్టార్ ప్రతినిధులు అన్నారు.వీరి గురించి దర్శకుడు బెజోయ్ నంబియార్ మాట్లాడుతూ, 'డానిష్ అస్లాం, క్యూ అని పిలవబడే కౌషిక్ ముఖర్జీ, వినీల్ మాథ్యూ, శివ ఆనంద్ వీరంతా దర్శకులే. ఇది కావాలని తీసుకున్న నిర్ణయం కాదు. కాస్టింగ్ చేస్తున్నప్పుడు నా మనస్సులోకి వచ్చిన పేర్లు ఇవి. వీరిని ఉద్దేశ్యపూర్వకంగా తీసుకున్నారా! అని హాట్ స్టార్ బృందం అడిగింది. వారు మాత్రమే పాత్రలకు న్యాయం చేస్తారని భావించాను. సిరీస్‌కు కొత్తదనం వస్తుందని ఆలోచించానని అనగానే వారు అంగీకరించారు. సెట్‌లో నలుగురు దర్శకులుంటే స్క్రిప్ట్ మరింత మెరుగ్గా వస్తుందన్న పాయింట్ నచ్చి స్టార్ బృందం అభినందించారు. నేను క్రియేట్ చేసి రన్ చేస్తున్న షో ఇది. దాన్ని బేస్ చేసుకుని కొన్ని సిరీస్ కూడా రావచ్చు అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈనెల 15నుంచి డిస్నీలో ప్రసారం అవుతున్న ఈ మిస్టరీ సిరీస్ ఆదరణ మరింత పెరిగింది' అని అన్నారు.

అందాలు చదివే కళ్ళకైనా..



పంకరి గిద్వానీ, నవదీప్

నవదీప్ చాలా గ్యాప్ తరువాత నటిస్తున్న చిత్రం 'లవ్ మౌళి'. అవనీంద్ర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నైరా క్రియేషన్స్ బ్యానర్ పై ప్రశాంత్ రెడ్డి తాటికొండ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజైన నవదీప్ లుక్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. గుబురు గడ్డం.. ఒక బైక్.. ట్రావెలర్‌గా కనిపించి మెప్పించాడు.

తాజాగా ఈ సినిమా నుండి 'థ ఆంథమ్ ఆఫ్ లవ్ మౌళి' సాంగ్ ను రిలీజ్ చేశారు. 'అందాలు చదివే కళ్లకైనా.. కందాలు తిరిగే కాళ్లకైనా.. వందేళ్ల కదిలే గుండె కైనా.. ప్రేమన్న తీరం ఇదేనా..' అంటూ సాగే ఈ పాటలో నవదీప్ చాలా కొత్తగా కనిపిస్తున్నారు. గోవింద వసంత మ్యూజిక్ డైరెక్టర్‌గా ఈ చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నారు. ఆయన కంపోజ్ చేసిన ఈ పాటకు అనంత శ్రీరామ్ క్యాచీ లిరిక్స్ రాశారు. అనిల్ కృష్ణన్ పాడిన విధానం అందర్నీ ఆకట్టుకుంటుంది. మేఘాలయలోని చిరపుంజీలో ఈ సినిమా షూటింగ్ మొత్తాన్ని చిత్రీకరించాం. ఇలాంటి వెట్ ప్లేస్‌లో షూటింగ్ జరిగిన ఫస్ట్ ఇండియన్ ఫిల్మ్‌గా ఈ చిత్రం నిలవడం ఓ విశేషమైతే, థాయ్ కుడెం బ్రిడ్జి దగ్గర చిత్రీకరణ చేయటం మరో విశేషం అని నిర్మాత తాటికొండ ప్రశాంత్ రెడ్డి చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్



ఎగుమతుల వెలవెల

- ఆగస్టులో 7 శాతం పతనం
- 10 నెలల గరిష్టానికి వాణిజ్య లోటు

న్యూఢిల్లీ : ప్రపంచ మార్కెట్‌లో భారత సరుకులకు డిమాండ్ పడిపోతోంది. వరుసగా ఏడో మాసంలోనూ ఎగుమతులు డీలా పడ్డాయి. మరోవైపు ఎగుమతుల కంటే దిగుమతులు అధికంగా ఉండటంతో భారత వాణిజ్య లోటు ఎగిసి పడుతోంది. దీంతో అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయిపై ఒత్తిడి పెరుగుతోంది. ప్రస్తుత ఏడాది ఆగస్టులో దేశ ఎగుమతులు 7 శాతం పతనమై 34.48 బిలియన్ డాలర్లకు పరిమితమ య్యాయని శుక్రవారం ప్రభుత్వ గణంకాలు వెల్లడించాయి. గతేడాది ఇదే మాసంలో 37.02 బిలియన్ల ఎగుమతులు జరిగాయి. గడిచిన నెలలో దిగుమతులు 5.23 శాతం తగ్గి 58.64 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకున్నాయి. ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఉండటంతో దేశ వాణిజ్య లోటు 24.16 బిలియన్ డాలర్లకు ఎగిసింది. దీంతో వాణిజ్య లోటు 10 నెలల గరిష్ట స్థాయికి చేరింది. ఈ ఏడాది జులైలోనూ ఎగుమతులు 15.88 శాతం క్షీణించాయి. గడిచిన ఆగస్టులో భారత సరుకులు, సేవల ఎగుమతులు స్థూలంగా 4.2 శాతం తగ్గి 60.87 బిలియన్లుగా నమోదయ్యాయి. ఇదే సమయంలో స్థూల దిగుమతులు 5.97 శాతం తగ్గి 72.50 బిలియన్లుగా చోటు చేసుకున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఆగస్టు కాలంలో భారత సరుకుల ఎగుమతులు 11.9 శాతం క్షీణించి 172.95 బిలియన్లకు తగ్గగా.. అదే సమయంలో దిగుమతులు 2 శాతం తగ్గి 271.83 బిలియన్లుగా చోటు చేసుకున్నాయి. దీంతో గడిచిన ఐదు మాసాల్లో భారత వాణిజ్య లోటు 98.88 బిలియన్లకు ఎగిసింది. ప్రపంచ దేశాల ఉత్పత్తులతో పోటీ పడలేక పోవడం, గ్లోబల్ డిమాండ్‌లోనూ స్తబ్దత నేపథ్యంలో భారత ఎగుమతులు తగ్గిపోతున్నాయని పరిశ్రమ నిపుణులు పేర్కొంటున్నారు. మరోవైపు ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఉండటంతో భారత వాణిజ్య లోటు ప్రమాదకరంగా మారుతోంది.

కేంద్రానికి ఎన్‌టిపిసి రూ.1487 కోట్ల డివిడెండ్

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎన్‌టిపిసి శుక్రవారం కేంద్ర ప్రభుత్వానికి రూ.1487 కోట్ల డివిడెండ్‌ను అందించింది. 2022-23కు గాను తుది డివిడెండ్ కింద ఈ మొత్తాన్ని ప్రకటించింది. పెయిడ్ అప్ కాపిటల్ కింద మరో రూ.2,908.99 కోట్లు ఇచ్చింది. దీంతో 2022-23లో మొత్తంగా రూ.7,030.08 కోట్ల డివిడెండ్ కేంద్రానికి అందించినట్లయ్యింది. వరుసగా 30 ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్‌ను ప్రకటిస్తున్నట్లు ఎన్‌టిపిసి పేర్కొంది.

8.45 శాతానికే గృహ రుణాలు

- బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్

పూణె : వేతన జీవులకు 8.45 శాతం వడ్డీ రేటుకే గృహ రుణాలు అందించనున్నట్లు బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ తెలిపింది. ప్రస్తుత పండగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని రూ.1 లక్షకు కేవలం రూ.729 నుండి నెలసరి వాయిదా (ఇఎంఐ) ప్రారంభం అవుతుందని వెల్లడించింది. 750 లేదా అంతకంటే ఎక్కువ క్రెడిట్ స్కోర్ ఉన్న దరఖాస్తుదారులు తక్కువ వడ్డీకే రుణం పొందవచ్చని పేర్కొంది. ఈ ఆఫర్లు 2023 నవంబర్ 12 వరకు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. గరిష్ఠంగా 40 ఏళ్ల పరిమితిలో గృహ రుణాలు జారీ చేయబడతాయని తెలిపింది.

ఫ్రాన్స్‌లో ఐఫోన్ 12 నిషేధం..!

న్యూఢిల్లీ : ఆపిల్‌కు చెందిన ఐఫోన్ 12ను ఫ్రాన్స్ దేశం నిషేధించింది. ఆ ఫోన్‌లో యూరోపియన్ యూనియన్ నిర్దేశించిన ప్రమాణాల కంటే ఎలక్ట్రోమాగ్నటిక్ రేడియేషన్ ఎక్కువగా ఉండటమే ఇందుకు కారణం. దీంతో ఇటీవలే ఐఫోన్ 12 విక్రయాలు నిలిపివేయాలని ఆపిలను ఫ్రాన్స్ ఆదేశించింది. కాగా.. తమ ఫోన్‌ను అనేక కఠిన పరీక్షల తర్వాతనే మార్కెట్లోకి విడుదల చేశామని ఆపిల్ పేర్కొంది. ఫ్రాన్స్ బాటలోనే ఐఫోన్ 12పై తాజాగా బెల్జియం ఆందోళన వ్యక్తం చేసింది. ఆ ఫోన్ రేడియేషన్‌పై దర్యాప్తు చేయాలని నిర్ణయించింది. ఈ విషయమై ఆపిల్‌ను డచ్ కూడా వివరణ కోరింది.

హైదరాబాద్ ప్రాపర్టీ అమ్మకాల్లో వృద్ధి

- నైట్‌ఫ్రాంక్ రిపోర్ట్

హైదరాబాద్: ప్రస్తుత ఏడాది ఆగస్టులో హైదరాబాద్‌లో ఆస్తుల రిజిస్ట్రేషన్లలో 15 శాతం వృద్ధి చోటు చేసుకుందని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ నైట్‌ఫ్రాంక్ ఇండియా తెలిపింది. గడిచిన నెలలో 6,493 నివాస ప్రాపర్టీలు రిజిస్టర్ అయ్యాయని.. వీటి విలువ రూ.3,461 కోట్లుగా ఉందని తెలిపింది. గతేడాది ఇదే మాసంలో 5,656 ప్రాపర్టీలు రిజిస్టర్ అయ్యాయి. హైదరాబాద్ నివాస మార్కెట్‌లో హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలను పరిగణలోకి తీసుకుంది. అత్యధికంగా అమ్ముడయిన వాటిలో రెండు పడక గదులున్నాయి. 1000-2000 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ప్రాపర్టీలు 70 శాతం వాటాను కలిగి ఉన్నాయి.

2030 నాటికి మూడు రెట్ల తృణధాన్యాల ఉత్పత్తి

- నాబార్డ్ ఛైర్మన్ సాజీ అంచనా

హైదరాబాద్ : తృణ ధాన్యాల ఉత్పత్తి 2030 నాటికి మూడు రెట్లు పెరగనుందని నాబార్డ్ ఛైర్మన్ సాజీ కెవి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన మిల్లెట్స్ కాన్‌క్లేవ్‌లో సాజీ మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో 17 మిలియన్ టన్నుల తృణ ధాన్యాల ఉత్పత్తి జరుగుతుందని.. 2030 నాటికి 45 మిలియన్ టన్నులకు చేరొచ్చన్నారు. పౌష్టికహార భద్రతలో తృణధాన్యాలు కీలక పాత్ర పోశిస్తున్నాయన్నారు. ఇతర ధాన్యాల దిగుబడి కాలంతో పోల్చితే 60 శాతం సమయం ముందే తృణ ధాన్యాల పంట చేతికి వస్తుందన్నారు.

తమిళనాడులో దళితురాలికి అవమానం

గ్రామాధ్యక్షురాలిగా గెలిచి రెండేండ్లు

- అయినా జరగని ప్రమాణస్వీకారం
- దళితురాలికి బాసటగా సీపీఐ(ఎం), వీసీకే, టీఎన్‌యూఈఎఫ్

చెన్నై : తమిళనాడులో ఎన్నికల్లో గెలిచిన ఒక దళిత మహిళ వివక్షను ఎదుర్కొంటున్నది. ఎన్నికల్లో గెలిచి రెండేండ్లు గడుస్తున్నప్పటికీ.. ఇప్పటికీ ఆమె ప్రమాణస్వీకారానికి నోచుకోక అన్యాయానికి గురవుతున్నది. 2021 అక్టోబర్‌లో తిరుపత్తూరు జిల్లాలోని నాయకనేరి పంచాయతీ అధ్యక్షురాలిగా దళిత మహిళ ఎన్నికైంది. ఇందుకు సంబంధించిన ఎన్నికల సర్టిఫికేట్‌ను సైతం ఆమె ఎన్నికల అధికారుల నుంచి అందుకున్నది. ఇది జరిగి దాదాపు రెండేళ్లు దాటినా జిల్లా యంత్రాంగం మాత్రం ఆమెతో ఇంకా ప్రమాణ స్వీకారం చేయించలేదు. ఇది ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కే చర్యలో భాగమనీ, పెత్తందారీ కులమైన వన్నియార్ సామాజిక వర్గం ప్రాబల్యం ఉన్న పంచాయతీలో ప్రమాణం చేయడానికి ఆమెకు అనుమతి లభించటం లేదని దళిత సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ మహిళలకు పంచాయతీని రిజర్వ్ చేయాలనే ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరుతూ వన్నియార్ కులానికి చెందిన పంచాయతీ మాజీ అధ్యక్షుడు మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. కేసు కొట్టివేయబడినప్పటికీ, కేసు అప్పీల్ ఫలితం దళిత మహిళ ప్రమాణ స్వీకారంపై పడింది. పంచాయతీలో తక్కువ ఎస్సీ జనాభా ఉన్నందున పెత్తందారీ కులాల సభ్యులు కోర్టును ఆశ్రయించాలని నిర్ణయించుకున్నారు. కాగా, ఈ అంశంపై సీపీఐ(ఎం), తమిళనాడు అంటరానితనం నిర్మూలన ఫ్రంట్ (టీఎన్‌యూ ఈఎఫ్), విడుతలై చిరుతైగల్ కట్చి(వీసీకే)లు జోక్యం చేసుకున్నాయి. సెప్టెంబర్ 13న జిల్లా కలెక్టర్‌తో చర్చలు జరిపారు.

లక్ష్యానికి దూరంగా ఆయుష్మాన్ భారత్

సవాలక్ష నిబంధనలతో పథకానికి తూట్లు



- అర్హత ఉన్నా అవరోధాలు
- పేదలకు లభించని బీమా ధీమా
- అవినీతిని ఎండగట్టిన కాగ్

దేశంలో ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారికి ఆరోగ్య రక్షణ కల్పించేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం ఐదు సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఆయుష్మాన్ భారత్ (ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన-పీఎం జేపీవై) ఆశించిన లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమైంది. 2011 సామాజిక-ఆర్థిక కులగణన (ఎస్ఈసీసీ) ఆధారంగా దేశ జనాభాలో 40 శాతం మందిని ఈ పథకానికి అర్హులుగా గుర్తించారు. ఈ పథకం అద్వితీయ విజయాన్ని సాధించిందని, అందరికీ ఆరోగ్యం అందించాలన్న లక్ష్యానికి చేరువగా దేశాన్ని తీసుకుపోయిందని బీజేపీ శ్రేణులు గొప్పలు చెప్పుకున్నాయి. అయితే వాస్తవ పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా కన్పిస్తోంది.



న్యూఢిల్లీ : ఆయుష్మాన్ భారత్ కార్డు ఉన్న వారిని ఆస్పత్రులలో చేర్చుకునేందుకు కొన్ని యాజమాన్యాలు నిరాకరిస్తున్నాయి. బిల్లుల చెల్లింపులో నెలల తరబడి జాప్యం జరుగుతోందని వాటి వాదన. ఒకవేళ ఏ ఆస్పత్రి అయినా దయతలచి చేర్చుకున్నప్పటికీ బిల్లుల విషయానికి వచ్చేసరికి పేచీ పెడుతున్నాయి. ఉదాహరణకు ముంబయికి చెందిన ఓ వ్యక్తికి రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయం కావడంతో అతన్ని ఆస్పత్రిలో చేర్చారు. తొలుత ఆయుష్మాన్ భారత్ కింద అతన్ని చేర్చుకునేందుకు నిరాకరించినా చివరికి అంగీకరించి శస్త్రచికిత్స చేశారు. దురదృష్ట వశాత్తూ విఫలం కావడంతో అతను చనిపోయాడు. ఆస్పత్రి బిల్లు మూడు లక్షల రూపాయలు కట్టి తీరాల్సిందేనని యాజమాన్యం ఒత్తిడి తెచ్చింది. మోడీ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఐదు లక్షల రూపాయల బీమా సొమ్ము నుండి దానిని మినహాయించుకోవాలని కుటుంబసభ్యులు ఎంతగా వేడుకున్నా వినలేదు. చివరికి వారు గ్రామంలోని తమ భూమిని తనఖా పెట్టి, వచ్చిన సొమ్ముతో ఆస్పత్రి బిల్లు చెల్లించారు. ఇది కేవలం ఓ ఉదాహరణ మాత్రమే. ప్రైవేటు ఆస్పత్రులకు వెళితే ఇలాంటి ఉదంతాలు కోకొల్లలు.

ఆది నుండీ అడ్డంకులే

ఆయుష్మాన్ భారత్ పథకం సమాజంలోని అట్టడుగు వర్గాల వారి కోసమే ఉద్దేశించినప్పటికీ దాని రూపకల్పనలో అనేక అంశాలను విస్మరించారు. ఫలితంగా అర్హత ఉన్న వారికి కూడా అవరోధాలు ఎదురవుతున్నాయి. ఈ పథకంలో పేరు నమోదు చేసుకోవడంతోనే సమస్యలు మొదలవుతున్నాయి. ముందుగా ఆధార్, రేషన్, శ్రమకార్డు నుండి ఎన్‌టైటిల్ లెటర్ వంటి పత్రాలు అవసరమవుతాయి. ఆధార్, రేషన్ కార్డులలో ఉన్న పేరు, ఎస్ఈసీసీ జాబితాలోని పేరు ఒకేలా ఉంటేనే రిజిస్ట్రేషన్ జరుగుతుంది. ప్రధాని మోడీ ఉచిత ఆరోగ్య బీమా పథకంలో చేరడానికి ఇవి తొలి అవరోధాలు. పథకంలో చేరడానికి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నప్పటికీ వాస్తవానికి అది ఉచితంగా జరగడం లేదు. ఆయుష్మాన్ భారత్ కార్డు వస్తుందో లేదో తెలియకపోయినా పేరు నమోదు చేసుకోవడానికే వంద నుండి రెండు వందల రూపాయల ముడుపు సమర్పించుకోవాల్సి వస్తోంది.

లబ్దిదారుల జాబితాలో సంపన్నులు

పేదలలో పేదలైన నిరుపేదలకు ఈ పథకంలో చోటు లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. మరోవైపు సంపన్నులు, ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారు అధికారులను ప్రసన్నం చేసుకొని లబ్దిదారులుగా చేరిపోతున్నారు. ఈ సంవత్సరం ఆగస్టు నాటికి దేశంలోని 24 కోట్ల మందిని ఆయుష్మాన్ భారత్ పథకంలో చేర్చి వారికి కార్డులు జారీ చేశారు. అంటే పథకాన్ని ప్రారంభించిన ఐదు సంవత్సరాల తర్వాత కూడా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వారిగా గుర్తించిన వారిలో 58% శాతం మందిని ఈ పథకంలో చేర్చలేదు. 2019-21 కాలానికి సంబంధించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం...ప్రభుత్వ నిధులతో నడుస్తున్న ఆరోగ్య బీమా పథకాలలో లబ్ది పొందుతున్న కుటుంబాలలో (కుటుంబసభ్యులలో కనీసం ఒకరైనా లబ్దిదారుగా ఉంటే చాలు) మూడింట ఒక వంతు మాత్రమే పేద కుటుంబాలు కాగా మిగిలినవి సంపన్న కుటుంబాలే. అంటే పేదలకు అందాల్సిన ప్రయోజనాలను సంపన్నులు దొడ్డిదారిన సొంతం చేసుకుంటున్నారన్న మాట. నిజమైన లబ్దిదారులకు మొండిచేయి చూపుతూ, ధనిక కుటుంబాల ప్రలోభాలకు లోనై వారిని పథకంలో చేరుస్తుండడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుకారిపోతోంది. దీనికి అధికార యంత్రాంగమే కారణం. లబ్దిదారుల ఎంపిక సరిగా జరగకపోవడంతో పాటు ఎంపికైన వారి విషయంలో కూడా సరైన శ్రద్ధ కనబరచడం లేదు. పైగా బీమా కంపెనీలు తమ మాయాజాలంలో ప్రభుత్వ ఖజానాను కొల్లగొడుతున్నాయి. ఆయుష్మాన్ భారత్ పథకంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఇటీవల కాగ్ ఎండగట్టింది. గత ఐదు సంవత్సరాలలో ఈ పథకానికి బడ్జెటరీ కేటాయింపులు 360% పెరిగాయి. అయినా పేదలకు అవసరమైన ఆరోగ్య రక్షణ లభించడం లేదు.

తెలంగాణ విమోచన అయితే నిజాంకు శిక్ష ఏదీ?

మతం పేరుతో విద్వేషాలను రెచ్చగొట్టడమే బీజేపీ పని

- వాస్తవాలను వక్రీకరిస్తున్న ఆర్ఎస్ఎస్
- సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే :ఐద్వా సెమినార్‌లో సామాజిక కార్యకర్త దేవి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'తెలంగాణ విమోచన అయితే నిజాం నవాబుకు శిక్ష ఏదీ?. భారత్‌లో హైదరాబాద్ సంస్థానం విలీనం అయ్యాక ఆయన్ను రాజ్‌ప్రముఖ్‌గా ఎందుకు ప్రకటించారు. ఖాసీం రజ్వీని పటేల్ సైన్యం ఎందుకు శిక్షించలేదు.'అని సామాజిక కార్యకర్త దేవి బీజేపీని ప్రశ్నించారు. 'తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం- వాస్తవాలు-వక్రీకరణలు'అనే అంశంపై అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం కార్యాలయంలో సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా దేవి మాట్లాడుతూ అబద్దాలు, చరిత్ర వక్రీకరణలపైనే బీజేపీ ఆధారపడి ఉంటుందని విమర్శించారు. మతం పేరుతో విద్వేషాలను రెచ్చగొట్టడమే ఆ పార్టీ పని అని అన్నారు. అయినా చరిత్రలో ఉన్న సత్యాన్ని మరుగున పర్చలేరని చెప్పారు. చాకలి ఐలమ్మ మీద దాడి చేసింది రజాకార్లా లేదంటే దేశ్‌ముఖా, దొడ్డి కొమరయ్యను చంపించింది రజాకార్లా లేక దేశ్‌ముఖా?అని ప్రశ్నించారు. షేక్‌బందగీని విసునూరు దేశ్‌ముఖ్ చంపారని వివరించారు. ఆయన్ను నిజాం కాపాడలేదు, రజాకార్లు చంపలేదని చెప్పారు. ప్రజల మీద దాడులు, స్త్రీల మీద లైంగిక దాడులు, అకృత్యాలు జరిగినపుడు ఆర్ఎస్ఎస్ ఎక్కడుందని అడిగారు. ప్రజలను హింసకు గురిచేసింది, వెట్టిచాకిరీ చేయించింది, దోపిడీ, అణచివేతకు పాల్పడింది హిందూ దేశ్‌ముఖ్‌లు, భూస్వాములు, జమీందార్లు, జాగీర్దార్లేనని అన్నారు. నిజాం నవాబు కంటే ఎక్కువగా పీడించారని చెప్పారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం సాగిందనీ, దానికి వారసులు కమ్యూనిస్టులేనని స్పష్టం చేశారు. ఆ పోరాటంలో ఆర్ఎస్ఎస్ వారు లాఠీదెబ్బలు తినలేదనీ, జైళ్లకు వెళ్లలేదని గుర్తు చేశారు. అయితే ప్రజలను పీడించే వారికి ఆర్ఎస్ఎస్ అండగా నిలబడిందని విమర్శించారు. ప్రజల విముక్తి కోసం నిజాం పాలన మీద, పటేల్ సైన్యం అకృత్యాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాటం చేశారని గుర్తు చేశారు. ప్రజలు స్వాధీనం చేసుకున్న భూమిని తిరిగి గుంజుకోవడం విమోచన అవుతుందా?అని బీజేపీని ప్రశ్నించారు. అందుకే విమోచన గురించి మాట్లాడే హక్కు బీజేపీకి, ఆర్ఎస్ఎస్‌కు లేదన్నారు. ప్రజల హక్కులు, కులవివక్ష నిర్మూలన పోరాటాన్ని కొనసాగించాలని ఆమె పిలుపునిచ్చారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం మహత్తరమైందని చెప్పారు. నిజాంకు వ్యతిరేకంగా, వెట్టిచాకిరి విముక్తి కోసం ప్రజలే తిరుగుబాటు చేసిన చరిత్ర ఉందన్నారు. ప్రజలకు కమ్యూనిస్టులు అండగా నిలబడ్డారని అన్నారు. చరిత్రను వక్రీకరించే బీజేపీ విధానాలను దేశవ్యాప్తంగా ఎండగట్టాల్సిన అవసరముందన్నారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు టి జ్యోతి, కెఎన్ ఆశాలత, నాయకులు బుగ్గవీటి సరళ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

మా డిమాండ్లు నెరవేర్చాలి

- తమిళనాడులో నిర్మాణ కార్మికులు ర్యాలీ
- సీఐటీయూ మద్దతు

చెన్నై : తమిళనాడులో నిర్మాణ కారులు ఆందోళన బాట పట్టారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని ర్యాలీ చేపట్టారు. ఇందులో భాగంగా భవన నిర్మాణ కార్మికులు ఎగ్మోర్ నుంచి చెన్నైలోని తమిళనాడు సచివాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తమిళనాడు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు(టీఎన్‌సీడబ్ల్యుడబ్ల్యుబీ) తీసుకున్న నిర్ణయాలను అమలు చేయాలనీ, జీఓను ఆమోదించాలని వారు తమ డిమాండ్‌లను పునరుద్ఘాటించారు.

పలు సమావేశాల్లో సీడబ్ల్యుడబ్ల్యుబీ అనేక నిర్ణయాలు తీసుకున్నది. పింఛను రూ.1,000 నుంచి రూ.2,000కు పెంచడం, కార్మికుడికి 60 ఏండ్లు నిండిన రోజు నుంచి పెన్షన్లు, 55 ఏండ్ల నుంచి మహిళా కార్మికులకు పెన్షన్లు.. అదనంగా ప్రతినెలా 10వ తేదీలోగా పింఛను ఇవ్వాలని నిర్ణయించారు.

ఈ ర్యాలీకి సీఐటీయూ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సమాఖ్య (సీడబ్ల్యుఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షులు కెపి పెరుమాల్ నాయకత్వం వహించారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎ సౌందరరాజన్ పాల్గొన్నారు. "ర్యాలీ డిమాండ్లలో డీఎంకే ఎన్నికల హామీలు ఉన్నాయి. వాటిని నెరవేర్చకపోవడంతో కార్మికులు నిరాశకు గురయ్యారు. నిర్మాణ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ వంటి చట్టపరమైన ప్రయోజనాలు లేవు. సంక్షేమ బోర్డుపైనే ఆధారపడుతున్నారు. సంక్షేమ బోర్డు అనేక నిర్ణయాలు తీసుకున్నా ప్రభుత్వం ఒక్కదానికీ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. వర్షాకాలంలో పని లేని భవన నిర్మాణ కార్మికులకు రాష్ట్రం ఉపశమనం కల్పించాలి" అని పెరుమాల్ అన్నారు.

ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి డి కుమార్ మాట్లాడుతూ.. "ప్రభుత్వం అందించే రూ. 1,000 పింఛను సరిపోవడం లేదు. దానిని పెంచాలి. హౌసింగ్ స్కీమ్ కోసం చాలా మంది దరఖాస్తుదారులకు ఇవ్వాల్సిన గ్రాంట్ అందలేదు" అని అన్నారు. ఈ ర్యాలీ 24 పాయింట్ల డిమాండ్లను నొక్కి చెప్పింది. ర్యాలీ అనంతరం యూనియన్ నాయకులు తమిళనాడు కార్మిక సంక్షేమ శాఖ కార్యదర్శి కుమార్ జయంత్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ ఏడాది జూన్‌లో భవన నిర్మాణ కార్మికులు జిల్లా కేంద్రాల్లో నిరసనలు నిర్వహించి తమ డిమాండ్లను జిల్లా కలెక్టర్లకు అందించారు. అయితే ఎలాంటి పురోగతి లేకపోవటంతో రాష్ట్ర రాజధానిలో ఈ ర్యాలీకి సీడబ్ల్యుఎఫ్ఐ పిలుపునిచ్చింది.

బీమాలో మళ్లీ ప్రైవేటు కంపెనీలు

నిరుడు ఫసల్‌లోనే

- ఈ ఏడాది వెదర్ బేస్డ్ ఇన్సూరెన్స్ కూడా
- అన్ని జిల్లాలూ వాటికే అప్పగింత
- అడుగుజాడల్లో రాష్ట్ర సర్కార్

అమరావతి : గతేడాది ఖరీఫ్‌లో విపత్తులతో పంటలు నష్టపో యిన రైతులను ప్రైవేటు బీమా కంపెనీలు నిలువునా ముంచిన అనుభవం ఉండగానే, ప్రభుత్వం ఈ సంవత్సరం మరింతగా ప్రైవేటు కంపెనీలను ప్రవేశపెట్టింది. నిరుడు కేవలం దిగుబడి ఆధారిత బీమాలోకే (ఫసల్) కొన్ని ప్రైవేటు సంస్థలు రాగా ఈ తడవ వాతావరణ ఆధారిత బీమాను కూడా ప్రైవేటు కంపెనీలకు అప్పగించింది. ఫసల్‌లో కొన్నే ప్రైవేటు కంపెనీలుండగా వాతావరణ బీమా మొత్తాన్నీ ప్రైవేటు కంపెనీలు చేజిక్కించుకు న్నాయి.

2023-24 ఖరీఫ్, రబీలో పంటల బీమా అమలు కోసం ఇన్సూరెన్స్ కంపెనీలను ప్రభుత్వం ఖరారు చేసింది. రాష్ట్రంలోని జిల్లాలను క్లస్టర్ల వారీగా విభ జించి ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీలను గ్లోబల్ టెండర్ల ద్వారా ఎంపిక చేసింది. బీమా వర్తించే పంటలనూ నోటిఫై చేసింది. ఈ విషయాలపై ప్రభుత్వం గోప్యత పాటిస్తోంది. పంటల నోటిఫికేషన్లను, జిఓలను అంతర్గతంగా జిల్లా వ్యవసాయాధికారులకు (డిఎఒ) ఇప్పుడిప్పుడే వాట్సాప్‌ల్లో పంపుతోంది.

కేంద్రం ఒత్తిడితోనే

కేంద్ర పంటల బీమా పథకం ఫసల్ వలన ప్రైవేటు కంపెనీలు లాభపడుతున్నాయని, రైతులకు సకాలంలో క్లెయిములు అందక నష్టం జరుగుతోందని వైసిపి సర్కారు వచ్చాక తానే స్వయంగా బీమా పథకాలు అమలు చేసింది. కేంద్రం తన వాటా నిధులు బిగబట్టి, తమ పథకాల్లో చేరాలని ఒత్తిడి చేయడంతో నిరుటి నుంచి కేంద్ర పథకాల్లో చేరింది. ఫసల్‌లో గతేడాది కంపెనీలను ఆహ్వానించింది. వాతావరణ బీమాను అంతకుముందు మల్లే తానే అమలు చేసింది. ఈ సంవత్సరం వాతావరణ ఆధారిత బీమాను సైతం కేంద్రం పరిధిలోకి తీసుకెళ్లి అక్కడా కంపెనీలను ప్రవేశపెట్టింది.

అధిక ప్రీమియం

ఫసల్‌లోకి ఈ తడవ బజాజ్ ఎలియాంజ్ రెండు క్లస్టర్లకు, హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో ఒక క్లస్టర్‌కు ఎంపికయ్యాయి. ప్రభుత్వరంగ సంస్థలైన ఎస్‌బిఐ జనరల్ ఇన్సూరెన్స్, ఓరియంటల్ ఇన్సూరెన్స్ కొన్ని క్లస్టర్లకు ఎంపికయ్యాయి. నిరుడు కేంద్ర వ్యవసాయశాఖ పరిధిలోని ప్రభుత్వరంగ సంస్థ ఎఐసి ఐదు జిల్లాలకు ఎంపిక కాగా ఈ మారు ఆ కంపెనీ లేదు. ఈ ఏడాది నుంచి కేంద్ర పథకంలో చేరిన వాతావరణ బీమాలో ఒక్క ప్రభుత్వరంగ సంస్థ కూడా లేదు.

అన్నీ ప్రైవేటు కంపెనీలనే ఎంపిక చేశారు. ప్రైవేటు కంపెనీలు కోట్ చేసిన ప్రీమియం రేటు చాలా ఎక్కువగా ఉంది. ప్రభుత్వరంగ సంస్థలు తక్కువ ప్రీమియం కోట్ చేయగా, అత్యధికంగా 12.56 శాతం సగటు ప్రీమియం రేటును ప్రైవేటు సంస్థలు కోట్ చేసి పోటీలో నిలిచాయి.

ఖరీఫ్‌లో సాధారణ వ్యవసాయ పంటలకు రైతు చెల్లించాల్సిన ప్రీమియం 2 శాతం, రబీలో 1.5 శాతం. రెండు సీజన్లలోనూ హార్టికల్చర్ పంటలకు 5 శాతం. రైతు వాటా పోను ప్రీమియంలో మిగతా భాగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరించాలి. మన రాష్ట్రంలో ఉచిత పంటల బీమా కావడంతో రైతు వాటాను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తోంది. ఏతావాతా ప్రైవేటు కంపెనీలు కోట్ చేసే మొత్తాన్నీ ప్రభుత్వాలే కట్టాలి. ఎక్కువ ప్రీమియానికి ఏజెన్సీలను ఎంపిక చేస్తే ఆ భారం ప్రభుత్వాలపై, అంతిమంగా ప్రజలపై పడుతుంది. కంపెనీలు గరిష్ట లాభాలు పోగేసుకుంటాయి.

రబీ పరిహారం ఇంకా లేదు

2022-23 రబీలో విపత్తులకు పంటలు నష్టపోయాయి. ఇప్పటి వరకు బీమా పరిష్కారం కాలేదు. నిరుడు ఖరీఫ్‌లో ప్రైవేటు కంపెనీలు దిగుబడి ఆధారిత బీమాను అమలు చేయగా రైతుల తరఫున ప్రభుత్వాల నుంచి రూ.1,882 కోట్ల ప్రీమియం వసూలు చేసి, రూ.572 కోట్ల పరిహారం చెల్లించడానికి ముందుకొచ్చాయి. ఇంకా రైతులకు పరిహారం పూర్తిగా చేరలేదు.

రూ.1,310 కోట్లు మిగుల్చుకోగా అందులో ప్రైవేటు వాటా రూ.780 కోట్లు. గుంటూరు, అన్నమయ్య, విశాఖ జిల్లాల్లో సున్నా క్లెయిములు నమోదయ్యాయి. ఇక్కడ ప్రైవేటు కంపెనీలే నిర్వహించాయి. రైతులు ప్రైవేటు సంస్థలొద్దంటున్నా రాష్ట్ర సర్కారు కేంద్ర పథకాల్లో చేరి క్రాప్ ఇన్సూరెన్స్ వ్యవస్థను మరింతగా ప్రైవేటీకరిస్తోంది.

తెలంగాణ పోలీసుకు ఫిక్కి స్మార్ట్ పోలీసింగ్ అవార్డ్

- అవార్డు అందుకున్న రాచకొండ సీపీ మహేశ్ భగవత్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ పోలీసులకు ఫిక్కి స్మార్ట్ పోలీసింగ్ %ు %2022 అవార్డు దక్కింది. చైల్డ్ సేఫ్టీ కేటగిరీలో 'వర్క్‌సైట్ స్కూల్ ప్రోగ్రాం' కి ఈ అవార్డు వరించింది. శుక్రవారం నాడిక్కడ ఫిక్కీ ఆడిటోరియంలో బీఎస్ఎఫ్ మాజీ డైరెక్టర్ జనరల్ పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రకాశ్ సింగ్, సీఐఎస్ఎఫ్ మాజీ స్పెషల్ డీజీ మంజరి జరుహర్, డిప్యూటీ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ అరవింద్ గుప్తా చేతుల మీదుగా మహేశ్ భగవత్ ఈ అవార్డు అందుకున్నారు. దేశవ్యాప్తంగా 17 రాష్ట్రాల పోలీసు శాఖలు, 6 కేంద్ర పారామిలటరీ బలగాల నుంచి వచ్చిన 117 ఎంట్రీల్లో రాచకొండ పోలీసులు చేపట్టిన ఆ కార్యక్రమమే మిన్నగా నిలిచింది. అనంతరం మహేశ్ భగవత్ మీడియాతో మాట్లాడుతూ... రాచకొండ పోలీస్ కమిషనర్‌గా పనిచేస్తున్న సమయంలో హైదరాబాద్ నగర శివార్లలోని ఇటుక బట్టీల్లో పొరుగు రాష్ట్రాలకు చెందిన బాల కార్మికులు పనిచేస్తున్న విషయం తెలిసి, వాటిపై దాడులు జరిపించి బాలకార్మికులకు విముక్తి కల్పించినట్లు చెప్పారు. ఇటుక బట్టీలు, ఇతర ప్రమాదకర పనుల్లో నిమగ్నమైన బాల కార్మికులను రక్షించి, వారికి పాఠశాల విద్యను అందించాలని భావించినట్లు తెలిపారు. అయితే ఈ బట్టీల్లో పనిచేస్తున్న పిల్లల్లో అత్యధికులు ఒరిస్సా, మహారాష్ట్రకు చెందినవారేనని గుర్తించామన్నారు. వారికి వారి మాతృ భాషలోనే పాఠశాల విద్యను అందించడం కోసం 'వర్క్‌సైట్' స్కూళ్లను ఏర్పాటు చేశారు. ఇందుకోసం యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు, ఇటుక బట్టీ యజమానుల అసోసియేషన్, ఫిక్కీతో పాటు స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని కోరి తీసుకున్నట్లు వెల్లడించారు.

ఓబీసీ జాబితాలో తమ కులాలను చేర్చాలి

- రాష్ట్రపతికి వీరశైవ లింగాయత్, లింగ బలిజ నేతలు విజ్ఞప్తి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలోని వీరశైవ లింగాయత్, లింగ బలిజలను ఓబీసీ జాబితాలో చేర్చేలా కేంద్రానికి ఆదేశాలు ఇవ్వాలని వీరశైవ లింగాయత్, లింగ బలిజ నేతలు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం అధ్యక్షులు వెన్న ఈశ్వరప్ప నేతృత్వంలో బృందం శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వీరశైవ లింగాయతులు, లింగ బలిజలు జీవన విధానాలను, స్థితిగతులను ముర్ముకు వివరించారు. 2009లో వీరశైవ లింగాయత్ లను, లింగ బలిజలను రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడి తరగతులలో చేర్చిందని తెలిపారు. కానీ 14 ఏళ్ల గడచినప్పటికీ కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చలేదని వివరించారు. దీంతో విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ఆయా వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. కాగా ఈ నెల 5 వ తేదిన నేషనల్ బీసీ కమిషన్ కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో, అన్ని కుల సంఘాలతో చర్చలు జరిపి... వీరశైవ లింగాయత్, లింగ బలిజలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చేందుకు ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపిందన్నారు. తమ విజ్ఞప్తులపై రాష్ట్రపతి సానుకూలంగా స్పందించినట్లు మీడియాకు వెల్లడించారు.

ఎంబీఏలో 87.33 శాతం మందికి సీట్ల కేటాయింపు

- ఎంసీఏలో వంద శాతం సీట్లు భర్తీ
- 20 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్‌కు గడువు
- ఐసెట్ తొలివిడత సీట్ల కేటాయింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం ఐసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో సాంకేతిక విద్యాశాఖ తొలివిడత సీట్లు కేటాయించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఐసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంబీఏలో 255 కాలేజీల్లో 24,029 సీట్లుంటే, 20,985 (87.33 శాతం) మందికి సీట్లు కేటాయించామని తెలిపారు.

ఇంకా 3,044 (12.67 శాతం) సీట్లు మిగిలిపోయాయని వివరించారు. ఎంసీఏకు సంబంధించి 46 కాలేజీల్లో 3,009 సీట్లుంటే, వంద శాతం భర్తీ అయ్యాయని పేర్కొన్నారు. ఎంబీఏ, ఎంసీఏ కలిపి 27,038 సీట్లకుగాను 23,994 (88.74 శాతం) మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. ఇంకా 3,044 (11.26 శాతం) సీట్లు మిగిలిపోయాయని వివరించారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈడబ్ల్యూఎస్) కోటా కింద 902 మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. సీట్లు పొందిన అభ్యర్థులు తప్పనిసరిగా వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. అందుకోసం ఈనెల 20 వరకు గడువుందని పేర్కొన్నారు. లేదంటే ఆ సీట్లు రద్దయిపోతాయని తెలిపారు. ఇతర వివరాలకు https://tsicet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.